ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM
మహబూబ్‌నగర్ : fb.com/vaartha Digital

Published from Mahabubnagar, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
23-4-2025 బుధవారం సంపుటి: 31 సంచిక: 81 పేజీలు: 10+4 వెల: 6.50

ఫ్యామిలీతో అంబర్‌కోటను సందర్శించిన జెడి వాన్స్
పార్లమెంటే సుప్రీం -ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్
5



శక్తి దుబే 1వ ర్యాంకు | హర్షిత గోయెల్ 2వ ర్యాంకు | సాయి శివాని 11వ ర్యాంకు

## సివిల్స్‌లో తెలంగాణ అభ్యర్థి సాయి శివానికి 11వ ర్యాంక్

**ఫస్ట్ ర్యాంక్ సాధించిన శక్తి దూబే**

**సివిల్స్-2024 ఫలితాలు ప్రకటించిన యుపిఎస్‌సి**

**హైదరాబాద్, ఏప్రిల్ 22, ప్రభాతవార్త:** కేంద్ర సర్వీసుల్లో అత్యున్నతమైన ఐఏఎస్, ఐఎఫ్ ఎస్, ఐపిఎస్ నియామకాల కోసం యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యుపిఎస్‌సి) నిర్వహించిన సివిల్స్-2024 ఫలితాలు వెలువడ్డాయి. ఫలితాల్లో తెలంగాణకిచెందిన >>2

# టూరిస్టులపై 'ఉగ్ర'దాడి
# 27 మంది మృతి

## మరో 20 మందికి గాయాలు

**సౌత్ కాశ్మీర్ అనంతనాగ్ జిల్లా పహల్‌గాంవ్‌లో పర్యాటకులపై ఉగ్రవాదుల కాల్పులు**

**లష్కరే అనుబంధ సంస్థ టిఆర్‌ఎఫ్ ఘాతుకం**

**హుటాహుటిన కాశ్మీర్ వెళ్లిన హోంమంత్రి అమిత్‌షా**

**దాడిలో మృతి చెందిన హైదరాబాద్‌వాసి**



ఘటనాస్థలంలో రోదిస్తున్న మృతుల కుటుంబీకులు



**శ్రీనగర్, ఏప్రిల్ 22 :** జమ్ముకశ్మీర్‌లో ఉగ్రవాదులు మళ్లీ రెచ్చిపోయారు.. ప్రముఖ టూరిస్ట్ స్పాట్ పహల్‌గామ్‌లో పర్యాటకులను టార్గెట్ చేస్తూ కాల్పులు జరిపారు. ఉగ్రవాదుల కాల్పుల్లో 27 మందికిపైగా చనిపోయారు.మరో 20 మందిపరిస్థితి విషమంగాఉంది. జమ్ముకాశ్మీర్‌లో ఇటీవలికాలంలో జరిగిన అతిపెద్ద ఉగ్రకాల్పుల >>2

# రోహిత్ వేముల చట్టాన్ని తెస్తాం



హిరోషిమాలో మంగళవారం గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సిఎం రేవంత్. చిత్రంలో మంత్రి శ్రీధర్‌బాబు

## హిరోషిమాలో గాంధీ విగ్రహం వద్ద రాహుల్ లేఖను చదివా..

**గర్వించదగ్గ భవిష్యత్‌ను నెలకొల్పడం కోసం ముందుకు వెళ్తా: సిఎం రేవంత్**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్.ఎప్రిల్22:** ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ లేఖపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. రాహుల్ ప్రేరణ రేకెత్తించే ఆలోచన తనని కదిలించిందని ట్విట్టర్ ద్వారా సీఎం తెలిపారు. రాహుల్ లెటర్‌ను చారిత్రక నగరం హిరోషిమాలో ఉన్న మహాత్మా గాంధీ విగ్రహం ముందు చదివినట్లు వెల్లడించారు. రాహుల్ ప్రేరణ కలిగించే ఆలోచనలకు అనుగుణంగా, గర్వించదగ్గ భవిష్యత్‌ను నెలకొల్పడం కోసం ముందుకు వెళ్తామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం సీఎం రేవంత్ రెడ్డికి ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ లేఖ రాశారు. తెలంగాణలో వేముల రోహిత్ చట్టాన్ని అమలు చేయాలని రాహుల్ లేఖలో కోరారు. రోహిత్ వేముల, పాయల్ తార్వీ, దర్శన్ సోలంకి వంటి మంచి భవిష్యత్ ఉన్న యువకులు అర్ధాంతరంగా జీవితాలు ముగించారని లేఖలో పేర్కొన్నారు. ఇలాంటి ఆత్మహత్యలను నివారించాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణలో యువత ఆత్మహత్యలను ఆపేందుకు కొత్త చట్టం తీసుకురావాల్సిన అవసరం ఉందని రేవంత్ రెడ్డికి సూచించారు.కాగా.. దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన రోహిత్ వేముల మరణం తర్వాత రోహిత్ వేముల చట్టం తీసుకురావాలని అప్పుడు ప్రతిపక్ష నేతగా ఉన్న రాహుల్ గాంధీ పట్టుబట్టారు. ఈ అంశంపై దేశం వ్యాప్తంగా చర్చ జరిగింది. తాము అధికారంలోకి వస్తే రోహిత్ వేముల చట్టాన్ని తీసుకువస్తామని, ఈ చట్టం ద్వారా యూనివర్సిటీల్లో, విద్యాసంస్థల్లో జరుగుతున్న కుల వివక్షతను ఆపవచ్చని, అరికట్టవచ్చని రాహుల్ గాంధీ పదే పదే చెప్పారు. తాజాగా రెండు రోజు క్రితం కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు రాహుల్ గాంధీ ఓ లేఖ రాశారు. ఆ లేఖలో రోహిత్ వేముల చట్టమే రాష్ట్రంలో ఇంప్లిమెంట్ చేయాల్సిందిగా ఆయన అభ్యర్థించారు. అలాగే సోమవారం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కూడా రాహుల్ లేఖ రాశారు. ఆ లేఖలో రోహిత్ వేముల చట్టం అవసరం ఏంటి, దాని ప్రాముఖ్యత ఏంటి, అది రావాల్సిన ఆవశ్యకత ఏంటి అనే అంశాలను సీఎం రేవంత్‌కు స్పష్టం చేస్తూ లేఖ రాశారు. ఆ లేఖపై మంగళవారం సీఎం రేవంత్ స్పందించారు. ఆ లేఖను ట్విట్టర్ అకౌంట్‌లో పెడుతూ.. దానికి సమాధానంగా కొన్ని అంశాలను,కొన్ని వ్యాఖ్యలను రాసుకొచ్చారు. >>2



మంగళవారం ఇంటర్ ఫలితాలు విడుదల చేస్తున్న డి.సిఎం భట్టి. చిత్రంలో మంత్రులు కోమటిరెడ్డి, పొన్నం ప్రభాకర్, ఇంటర్‌బోర్డు అధికారులు

## ఇంటర్ ఫలితాల్లో బాలికలే టాప్

**సెకండియర్‌లో 65.65%, జూ. ఇంటర్‌లో 65.96 శాతం ఉత్తీర్ణత**

**ఫలితాలు విడుదల చేసిన డి.సిఎం భట్టి**

**మే 22 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు**

**హైదరాబాద్, ఏప్రిల్ 22, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో ఇంటర్మీడియట్ 2024-25 విద్యా సంవత్సరం వార్షిక పరీక్ష ఫలితాల్లో ఈ ఏడాది కూడా బాలికలే ముందున్నారు. బాలుర కంటే బాలికల ఉత్తీర్ణతా శాతం 15 శాతానికి మించి ఉంది. ఇంటర్మీడియట్ వార్షిక ఫలితాలను ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు కొమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్‌తో కలిసి మంగళవారం నాంపల్లిలోని ఇంటర్ బోర్డు కార్యాలయంలో విడుదల చేశారు. ఫలితాల విడుదల కార్యక్రమంలో విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా, ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ >>2






## చరిత్రలో కనీవినీ ఎరుగని విధంగా పసిడి ధరలు!

**రూ.3వేలు పెరిగిన బంగారం**

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 22:** భారత్‌లో బంగారం ధరలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఇదంతా ట్రంప్ సుంకాల ప్రభావమేనని తెలుస్తోంది. ఫెడ్‌రిజర్వు వడ్డీరేట్లు సవరణ ఫలితాలు కూడా బులియన్‌పై ప్రభావంచూపుతున్నాయి. ఇన్వెస్టర్లు తమ పెట్టుబడులన్నింటినీ >>2

## ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా కలెక్టర్లు పనిచేయాలి



భూభారతిపై నిర్వహించిన సమీక్షలో మంత్రి పొంగులేటి

**మే మొదటివారంలో మరో 28 మండలాల్లో భూభారతి వర్క్‌షాప్**

**యుద్ధ ప్రాతిపదికన ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపిక**

**ఎల్‌ఆర్‌ఎస్ గడువు పెంచబోం: మంత్రి పొంగులేటి**

**హైదరాబాద్,ఏప్రిల్ 22,ప్రభాతవార్త:** ప్రభుత్వ ఆలోచనలు, ప్రాధాన్యతలకు అనుగుణంగా పనిచేయాలని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిష్టాత్మకమైన ఇందిరమ్మ ఇండ్లు, భూభారతి చట్టం అమలుపై కలెక్టర్లు మరింత ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు.తెలంగాణ రాష్ట్ర సచివాలయం >>2



నిషేధిత సర్వేనెంబర్‌లో అక్రమంగా అనుమతులు పొంది నిర్మాణం పూర్తిచేసుకుంటున్న భవనం

## మియాపూర్‌లో చెలరేగుతున్న భూబకాసురులు

**వేలకోట్ల ప్రభుత్వ భూమికి రెక్కలు!**

**హెచ్‌ఎండిఎకు అప్పగించామన్న రెవెన్యూ శాఖ**

**ఇచ్చినంతా ఫెన్సింగ్ వేసుకున్నామన్న హెచ్‌ఎండిఎ**

**54 వేల కోట్ల భూమిలో ఇరు శాఖల దొంగాట**

**హైడ్రా అడుగుపెడితే తప్ప అక్రమాలు ఆగవా..?**

పైళ్ల విఠల్‌రెడ్డి / ప్రభాతవార్త సైబరాబాద్ ప్రతినిధి

హైటెక్‌సిటీకి కూతవేటు దూరంలోవున్న ఈభూమి విలువ గజం రెండు లక్షలు..! మొత్తం 27 లక్షల గజాలు.. దీని విలువ లెక్కగట్టాలంటే సాధారణ క్యాల్కులేటర్లు సరిపడవుకాని తేలిగ్గా చెప్పాలంటే తెలంగాణ బడ్జెట్‌లో ఆరోవంతుకు పైమాటే... ఇంత విలువైన >>2

# బాలికలే టాప్

>> ఆదిత్య, సీఈవో జయప్రదబాయి, జాయింట్ సెక్రటరీ(ఎగ్జామ్స్) డి మోహన్, జాయింట్ సెక్రటరీ(అడ్మినిస్ట్రేషన్) భీంసింగ్, జాయింట్ సెక్రటరీ(అకడమిక్స్) వసుంధర, సీజీజీ డైరెక్టర్ జనరల్ రాజేంద్ర నిమ్జే తదితరులు పాల్గొన్నారు. ఫలితాల విడుదల సందర్భంగా మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ .. మొదటి సంవత్సరంలో 65.96 శాతం ఉత్తీర్ణత సాధించగా.. ద్వితీయ సంవత్సరంలో 65.65 శాతం మంది పాసైనట్టు తెలిపారు. ఉత్తీర్ణులైన ఇంటర్ విద్యార్థులకు హృదయ పూర్వక అభినందనలు తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో 65.96 శాతం మంది తీర్ణత సాధించగా.. రెండో సంవత్సరంలో 65.65 మంది ఉత్తీర్ణ సాధించాలని వివరించారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో 4,88,430 లక్షల మంది పరీక్షలు రాయగా ఇందులో 73.83 శాతం బాలికలు, 57.83 బాలురు ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 5,08,582 మంది పరీక్షలు రాయగా ఇందులో 74.21 శాతం గర్ల్స్ 57.31 ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. రాష్ట్రంలో ఇంటర్ పరీక్షలు మార్చి 5 నుంచి మార్చి 25 వరకు నిర్వహించిన విషయం తెలిసిందే. రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్ పరీక్షలకు 9,97,012 మంది హాజరయ్యారు. వారిలో 6,56,099 మంది ఉత్తీర్ణత సాధించారు. పరీక్షల కోసం రాష్ట్ర వ్యాప్తంగా 2060 కేంద్రాలను ఏర్పాటు చేయగా.. 29,992 మంది ఇన్విజిలేటర్లను పరీక్షలకు వినియోగించారు. జవాబు పత్రాల మూల్యాంకనంను 19 కేంద్రాల్లో 18,518 మందితో నిర్వహించారు. మే 22 నుంచి ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను రెండు సెషన్స్‌లలో నిర్వహించనున్నట్టు తెలిపారు. రీకౌంటింగ్‌కు పేపర్‌కు రూ. 100, రీవెరిఫికేషన్‌కు పేపర్‌కు రూ. 600 చొప్పున చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. రీకౌంటింగ్, రీవెరిఫికేషన్‌కు నేటి(ఏప్రిల్ 23) నుంచి ఈ నెల 30లోగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. విద్యార్థులకి తమ కలర్ మెమోలను బుధవారం నుంచే డౌన్‌లోడ్ చేసుకోవడానికి అవకాశం కల్పించినట్టు ఇంటర్ బోర్డు సెక్రటరీ కృష్ణ ఆదిత్య తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో 65.96 శాతం మంది ఉత్తీర్ణత సాధించగా.. అందులో బాలికలు 73.83 శాతం కాగా .. బాలురు 57.83 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 65.65 శాతం ఉత్తీర్ణత సాధించగా .. అందులో బాలికల ఉత్తీర్ణత 74.21 శాతం ఉంటే.. బాలుర ఉత్తీర్ణత 57.31 శాతంగా ఉందన్నారు.

# శివానికి 11వ ర్యాంక్

>> సాయి శివాణి ఆలిండియా 11వ ర్యాంక్‌ను సొంతం చేసుకోగా.. టాప్-100లో మరో ఐదు మంది తెలుగు వారున్నారు. సివిల్స్-2024లో శక్తి దూబే ఆలిండియా ఫస్ట్ ర్యాంక్‌ను సొంతం చేసుకోగా.. హర్షిత గోయల్ రెండో ర్యాంక్‌ను సాధించారు. సివిల్స్-2024 ఫలితాలను యుపిఎస్‌సి మంగళవారం విడుదల చేసింది. సివిల్స్ ఫలితాల్లో 11వ ర్యాంక్ సొంతం చేసుకున్న ఈ సాయి శివాణి తెలంగాణలోని వరంగల్ జిల్లాకు చెందిన అభ్యర్థిని. వరంగల్ శివనగర్‌కు చెందిన సాయి శివాణి తల్లిదండ్రులు రాజు, రజిత. సాయి శివాణి తండ్రి మెడికల్ రిప్రజెంటేటివ్‌గా పనిచేస్తున్నట్టు తెలిసింది. కేంద్ర ప్రభుత్వంలోని వివిధ శాఖల్లోని ఐఎఎస్, ఐఎఫ్ఎస్, ఐపిఎస్‌తోపాటు సెంట్రల్ గ్రూప్-ఎ, బి సర్వీసుల్లోని పోస్టుల భర్తీ కోసం గత ఏడాది ఫిబ్రవరిలో సివిల్స్-2024 నోటిఫికేషన్‌ను జారీ చేసిన విషయం తెలిసిందే. అందులో భాగంగా జూన్ 16న ప్రిలిమ్స్ పరీక్షను నిర్వహించగా అందులో అర్హత సాధించిన వారికి సెప్టెంబర్ 20 నుంచి 29 వరకు మెయిన్స్ పరీక్షలను నిర్వహించారు. మెయిన్స్ ఉత్తమ ప్రతిభ చాటిన వారికి ఈ ఏడాది జనవరి 7 నుంచి ఏప్రిల్ 17 వరకు పర్సనల్ ఇంటర్వ్యూలను నిర్వహించింది. అనంతరం ఇంటర్వ్యూకు హాజరైన అభ్యర్థులకు మెడికల్ టెస్ట్‌లను నిర్వహించిన అనంతరం మంగళవారం సివిల్స్-2024 తుది ఫలితాలను యుపిఎస్‌సి ప్రకటించింది. ఫలితాల్లో 1009 మందిని ఐఎఎస్, ఐఎఫ్ఎస్, ఐపిఎస్‌తోపాటు సెంట్రల్ గ్రూప్-ఎ, బి సర్వీసులకు ఎంపిక చేశారు. వారిలో 335 మంది జనరల్ కేటగిరి వారు ఉండగా.. మరో 109 మంది ఈడబ్ల్యూఎస్ వారున్నారు. ఇక ఓబీసీ నుంచి 318 మంది, ఎస్సీ కేటగిరిలో 160, ఎస్టీ కేటగిరి నుంచి 87 మంది ఎంపికయ్యారు. 241 మంది అభ్యర్థుల అభ్యర్థిత్వాని ప్రొవిజనల్ జాబితాను రూపొందించిన యుపిఎస్‌సి క్యాంపస్‌లో పరీక్షా హాల్ వద్ద కౌంటర్‌ను ఏర్పాటు చేసినట్టు తెలిపింది. ఒక్కరి ఫలితాలను విత్ హెల్డ్‌లో పెట్టినట్టు ప్రకటించింది. సివిల్స్ అభ్యర్థులు సాధించిన మార్కుల జాబితాను 15 రోజుల్లోగా వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచనున్నట్టు మంగళవారం యుపిఎస్‌సి విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది. సివిల్స్ ఫలితాల్లో 1009 మంది ఎంపికవగా వారిలో తెలుగు రాష్ట్రాల నుంచి పలువురు విద్యార్థులు ఉన్నారు. ఈసారి టాప్-10 జాబితాలో తెలుగు రాష్ట్రాలకు చెందిన అభ్యర్థులు ఒక్కరు కూడా లేరు. శక్తి దూబే అనే అభ్యర్థికి ఫస్ట్ ర్యాంకు వచ్చింది. ఆ తర్వాత హర్షిత గోయెల్ వరుసగా రెండు, మూడు ర్యాంకులు సాధించారు.

# పసిడి ధరలు!

>> విత్‌డ్రాచేసి బులియన్‌పైనే పెడుతుండటంతో ఒక్కసారిగా ధరలు పెరిగాయి. సోమవారం సాయంత్రం దేశ చరిత్రలో తొలిసారి లక్ష రూపాయలు దాటిన పదిగ్రాముల మేలిమి పసిడిధరలు తాజాగా మరో మూడువేలు పెరిగింది. మధ్యాహ్నం ఒంటిగంట సమయానికి రూ.1.03,016కి చేరింది. అంతర్జాతీయ మార్కెట్లలో ఔన్స్ బంగారంధర 31.10 గ్రాములు బరువున్న బంగారం 3467 డాలర్లకు చేరింది. ఇక మల్టీకమోడిటీ ఎక్స్ఛేంజిలో కూడా పదిగ్రాముల పసిడి ధర లక్షరూపాయలకు చేరువయింది. నాలుగోట్రేడింగ్ సెషన్‌లోకూడా పసిడిధర పెరిగింది. జూన్‌నెల కాంట్రాక్టుధర మంగళవారం ఇంట్రాడేలో రూ.1899 పెరిగి రూ.99,178కి చేరుకున్నది. ఆ తర్వాత రూ.98,880కితగ్గింది. ఆగస్టు కాంట్రాక్టుధర రూ.99,800వద్దకొనసాగుతుండగా అక్టోబరు కాంట్రాక్టు గోల్డ్ మాత్రం ఏకంగా రూ.3వేలు పెరిగి లక్ష మార్కును దాటేసింది. పదిగ్రాముల 24 కేరట్ల బంగారంపై 3 వేలు పెరిగితే 22 కేరట్ల బంగారంపై 2750వరకూ పెరిగింది. సహజంగా అక్షయతృతీయకు ఎంతోకొంత బంగారం కొనుగోలుచేయడం ఆనవాయితీ. కానీ బంగారంధరలు రికార్డుస్థాయికి పెరగడంతో బయ్యర్లు వెనకడుగువేస్తున్నారు.

# కలెక్టర్లు పనిచేయాలి

>> నుంచి మంగళవారం నాడు చీఫ్ సెక్రటరీ శ్రీమతి శాంతికుమారితో కలిసి భూభారతి ,ఇందిరమ్మ ఇండ్లు, ఎల్ ఆర్ ఎస్ తదితర అంశాలపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన చిరస్మరణీయమైన భూభారతి చట్టాన్ని తీసుకువచ్చామని ఈ చట్టాన్ని అమలుచేయవలసిన బాధ్యత కలెక్టర్లదేనని స్పష్టం చేశారు. భూభారతి చట్టంపై పైపైనే కాకుండా లోతుగా అధ్యయనం చేసి ప్రజల్లోకి వెళ్లాలని కలెక్టర్లకు సూచించారు. భూభారతి పైలట్ ప్రాజెక్ట్ అమలుచేస్తున్న నాలుగు మండలాల్లోని 56 రెవెన్యూ గ్రామాలకు గాను 16 గ్రామాల్లో ఈనెల 17వ తేదీ నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరిగిందని తెలిపారు. వర్షా కాలాన్ని దృష్టిలో పెట్టుకొని యుద్దప్రాతిపదికన ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల ఎంపిక ప్రక్రియను మే మొదటి వారంలోగా పూర్తిచేసి నిర్మాణాలను వేగవంతం చేయాలని మంత్రి కలెక్టర్లను ఆదేశించారు. నిర్మాణదశలను బట్టి లబ్దిదారులకు ప్రతిసోమవారం నాడు వారి ఖాతాలోనే నేరుగా డబ్బులను జమచేయాలని సూచించారు. ఎల్ఆర్ఎస్‌కు గడువు ఈనెల 30తో ముగుస్తుందని మరోసారి గడువు పెంచే ఆలోచన ప్రభుత్వానికి లేదని స్పష్టం చేశారు. మరోవారంరోజుల వ్యవధి మాత్రమేఉందని ప్రభుత్వం కల్పించిన 25 శాతం రాయితీని ఉపయోగించుకోవాలన్నారు. ఎల్ఆర్ఎస్ అమలులో కలెక్టర్ల పనితీరు అభినందనీయమన్నారు.

# హిరోషిమా అసెంబ్లీని సందర్శించిన సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 22:** తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని "తెలంగాణ రైజింగ్" బృందం జపాన్‌లోని హిరోషిమా ప్రిఫెక్చర్‌ను సందర్శించింది. హిరోషిమా ప్రిఫెక్చరల్ అసెంబ్లీ హాల్ సందర్శనకు వెళ్లిన బృందానికి అసెంబ్లీ స్పీకర్ తకాషి నకమోటో, వారి శాసనసభ్యుల బృందం ఘనంగా స్వాగతించింది. ముఖ్యమంత్రి వెంట ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్‌బాబు, అధికారులు జయేష్ రంజన్, వి.శేషాద్రి,అజిత్ రెడ్డి, విష్ణు వర్ధన్ రెడ్డి అసెంబ్లీని సందర్శించారు. శాసనసభ్యుల సమావేశాన్ని ఉద్దేశించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, హిరోషిమాకు రావటం గౌరవంగా ఉంది. హిరోషిమా అంటే ఆశ. ప్రజలు కలిసికట్టుగా పనిచేస్తే ఏదైనా సాధ్యమని ప్రపంచానికి నిరూపించిన నగరం. హిరోషిమా మాదిరిగానే ప్రజలు ఆశలు,ఆకాంక్షలు, పోరాటానికి చిహ్నం తెలంగాణ. దూరదృష్టితో విజయం సాధించిన రాష్ట్రం అని అన్నారు. శాంతి, స్థిరత్వం, సమృద్ధి వంటి విలువలను పంచుకుందామని మంత్రి శ్రీధర్‌బాబు హిరోషిమా ప్రభుత్వానికి పిలుపునిచ్చారు. పెట్టుబడులకు కాకుండా పరస్పర సహకారం, భాగస్వామ్యం గురించి మాట్లాడటానికి వచ్చామని, కలిసికట్టుగా మెరుగైన, పచ్చని, సమగ్రమైన ప్రపంచాన్ని నిర్మిద్దామని అన్నారు. ఇప్పటికే యాభైకి పైగా జపాన్ కంపెనీలు తెలంగాణలో అద్భుతంగా పనిచేస్తున్నాయని, మరిన్ని కంపెనీలను మంత్రి స్వాగతించారు. క్లీన్ ఎనర్జీ, ఎలక్ట్రిక్ మొబిలిటీ, ప్రిసిసన్ మ్యానుఫాక్చరింగ్, గ్రీన్ హైడ్రోజన్ రంగాల్లో గొప్ప అవకాశాలున్నాయని అన్నారు. తెలంగాణను సందర్శించి, రాష్ట్ర ప్రగతిని స్వయంగా చూడాలని హిరోషిమా ప్రభుత్వ అధికారులు, పారిశ్రామికవేత్తలను మంత్రి ఆహ్వానించారు. తెలంగాణ దేశానికి గేట్ వేగా.. ప్రపంచానికి విస్తరించే వేదికగా ఉంటుందని అన్నారు. హిరోషిమా హైదరాబాద్, జపాన్ తెలంగాణ మధ్య బలమైన సంబంధాల వారధిని నిర్మిద్దామన్నారు. అసెంబ్లీ సందర్శన తర్వాత తెలంగాణ ప్రతినిధి బృందం హిరోషిమా చాంబర్ ఆఫ్ కామర్స్ నాయకులతో సమావేశమయ్యారు. అనంతరం, శాసనసభ్యుల బృందం రేవంత్ రెడ్డి బృందాన్ని గాంధీ మెమోరియల్, హిరోషిమా పీస్ మెమోరియల్ పార్క్, అణుబాంబు డోమ్‌ల వద్దకు తీసుకెళ్లింది. ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డితో పాటు పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి డి. శ్రీధర్‌బాబు నేతృత్వంలోని తెలంగాణ అధికారుల బృందం జపాన్‌లోని హిరోషిమా ప్రిఫెక్చర్ (రాష్ట్ర ప్రభుత్వం) ను సందర్శించింది. ఈ సందర్భంగా హిరోషిమా డిప్యూటీ గవర్నర్ మికా యొకోటాతో సమావేశమయ్యారు. రెండు రాష్ట్రాల మధ్య పరస్పర సహకారానికి ఉన్న అవకాశాలపై విస్తృతంగా చర్చించారు. పర్యావరణ సాంకేతికత,వ్యర్థాల నుంచి విద్యుత్ ఉత్పత్తి,చెత్త నిర్వహణ,మురుగునీటి శుద్ధి,పునరుత్పాదక శక్తి అభివృద్ధి వంటి అంశాలపై దృష్టి సారించారు. అలాగే పట్టణాభివృద్ధిలో భాగంగా విపత్తు నిరోధక నిర్మాణాలపై చర్చించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ హిరోషిమా ప్రభుత్వ ఆతిథ్యానికి హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలిపారు. శాంతితో పాటు సాంకేతిక పురోగతిలో హిరోషిమా ప్రపంచంలోనే ప్రత్యేక గుర్తింపు సాధించిందని అన్నారు. తెలంగాణ కూడా కొత్త ఆవిష్కరణలు, సుస్థిర విధానాలు, శాంతియుత వాతావరణానికి కట్టుబడి ఉందని అన్నారు. మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ, తెలంగాణ, హిరోషిమా కలిసి పని చేయగలిగే రంగాలపై విస్తృతంగా చర్చలు జరిపారు. వ్యర్థాల నుంచి ఇంధనం లాంటి క్లీన్ టెక్నాలజీ, మున్సిపాలిటీల్లో వ్యర్థాల ప్రాసెసింగ్, మురుగు నీటి శుద్ధి, పునరుత్పాదక విద్యుత్తు ప్రాజెక్టులు,అర్బన్ ఇన్నోవేషన్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, హైదరాబాద్‌లో విపత్తుల నివారణ డిజైన్లు, భూగర్భ మెట్రో ఇంజనీరింగ్, స్మార్ట్ సిటీ సొల్యూషన్స్, పారిశ్రామిక సహకారం, ఎలక్ట్రిక్ వాహనాలు, ఎలక్ట్రానిక్స్, అధునాతన ఉత్పత్తుల తయారీకి హిరోషిమా తెలంగాణ ఆటోమోటివ్ అండ్ మొబిలిటీ కారిడార్ ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనలను ప్రస్తావించారు. వీటితో పాటు విద్య, సాంస్కృతిక మార్పిడి కార్యక్రమాలు, హిరోషిమా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీతో తెలంగాణలోని ప్రముఖ విశ్వవిద్యాలయాల మధ్య సంబంధాలు, పరిశోధనలకు సహకారం, తెలంగాణ సంస్కృతి, శాంతి, పర్యాటకం, పీస్ పార్క్, సాంస్కృతిక ప్రదర్శనలు,బౌద్ధ వారసత్వానికి సహకరించాలని కోరారు.



మంగళవారం హిరోషిమా అసెంబ్లీని సందర్శించిన సిఎం రేవంత్, మంత్రి శ్రీధర్‌బాబు

**హిరోషిమా శాంతి స్మారకాన్ని సందర్శించిన సిఎం**

జపాన్ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హిరోషిమాలోని మహాత్మా గాంధీ విగ్రహాన్ని సందర్శించారు. భారత జాతిపిత, విశ్వ శాంతి దూత మహాత్ముడికి పూలమాల వేసి నివాళులర్పించారు. ముఖ్యమంత్రి గారి వెంట మంత్రి శ్రీధర్ బాబు, అధికారులు ఉన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తర్వాత జపాన్‌లోని ప్రసిద్ధ హిరోషిమా శాంతి స్మారకాన్ని సందర్శించారు. 1945 రెండో ప్రపంచ యుద్ధంలో హిరోషిమాపై జరిగిన అణుబాంబు దాడిలో ప్రాణాలు కోల్పోయినవారికి పుష్పాంజలి ఘటించి, నివాళులర్పించారు. నాటి అణుబాంబు విధ్వంసంలో నిలిచిన ఏకైక శిథిలం అటామిక్ బాంబ్ డోమ్ ను కూడా సందర్శించారు. ముఖ్యమంత్రితో పాటు మంత్రి శ్రీధర్ బాబు, అధికారులు నివాళర్పించిన వారిలో ఉన్నారు.

**ఇంటర్‌లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు సిఎం అభినందనలు**

ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఉత్తీర్ణులైన విద్యార్థినీవిద్యార్థులకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అభినందనలు తెలిపారు. భవిష్యత్‌లో మీరు, ఉన్నత చదువులు చదివి, జీవితంలో గొప్పగా రాణించాలని ఆకాంక్షిస్తున్నట్లు పేర్కొన్నారు.

## రోహిత్ వేముల చట్టాన్ని తెస్తాం

>> రేవంత్ ప్రస్తుతం జపాన్ పర్యటనలో ఉన్నారు. జపాన్‌లోని హిరోషిమాలో పర్యటిస్తున్నారు. ఒక చారిత్రాత్మక నగరంలో ఉన్న రేవంత్.. అక్కడ ఉన్న గాంధీజీ విగ్రహాన్ని సందర్శించి.. అక్కడ ఈ లేఖను చదివినట్లు ఆయన పేర్కొన్నారు. రాహుల్ ఏం ఆలోచించినా.. దేశం కోసం, దేశ ప్రజల కోసమే అని సోషల్ జస్టిస్ కోణంలోనే ఆలోచిస్తారని తెలిపారు. ఈ ఆలోచన, లేఖలో పేర్కొన్న అంశాలు తనను ఎంతగానే ప్రేరణ కలిగించాయని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. త్వరలోనే తెలంగాణలో రోహిత్ చట్టంపై చర్చ జరిగి దాన్ని అమలు చేసే అవకాశం ఉంది. రోహిత్ వేముల చట్టం తీసుకురావడం వల్ల యూనివర్సిటీల్లో జరుగుతున్న కులవివక్షతను ఆపే అవకాశం ఉన్నట్లు కాంగ్రెస్ నేతలు చెబుతున్న మాట. ముందుగా కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో దీన్ని అమలు చేస్తే భవిష్యత్‌లో మిగితా రాష్ట్రాల్లో కూడా తీసుకురావచ్చు అని రాహుల్ గాంధీ భావిస్తున్నారు.

## వారం - వర్జ్యం

తేది : 23-04-2025, బుధవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
చైత్రమాసం, ఉత్తరాయణం,
వసంత ఋతువు, కృష్ణ పక్షం
కృ.దశమి సా.4.37
ధనిష్ఠ మ.12.03
వర్జ్యం సా.6.52-8.22
దు.ఉ.11.41-మ.12.31
శుభసమయం : ఉ.9.30-10.15,సా.5.00-6.00
రాహుకాలం - మ.12.00-1.30

## వార్తాఫలం

**మేషం:** దూరప్రాంతాల నుండి విలువైన సమాచారం అందుకుంటారు. విందు, వినోదాలలో పాల్గొంటారు.

**వృషభం:** విలువైన వస్తువులు, పత్రాలు జాగ్రత్త అవసరం. వ్యాపారాలలో ఆటంకాలు ఎదురువుతాయి.

**మిథునం:** ఆకస్మిక ప్రయాణాలలో తొందరపాటు వద్దు. ఆరోగ్యం పట్ల మెలుకువ చాలా అవసరం.

**కర్కాటకం :** ఆర్థిక ఇబ్బందులు ఎదురై చికాకులు పెడతాయి. ఋణబాధలు తప్పవు. శుభవార్తలు వింటారు.

**సింహం:** మిత్రులతో ఏర్పడిన మాట పట్టింపులు పరిష్కారించు కుంటారు. ఉద్యోగాలలో స్థాన మార్పులు.

**కన్య:** బంధువుల నుండి శుభవార్తలు అందుకుంటారు. భూ వివాదాలు తీరి ఊరట చెందుతారు.

**తుల:** వృత్తి, వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. క్రయవిక్రయాలలో ప్రోత్సాహం లభిస్తుంది.

**వృశ్చికం:** ఆర్థిక సమస్యలు ఎదురై చికాకులు పెడతాయి. మిత్రులని కలిసి కీలక సమాచారం అందుకుంటారు.

**ధనుస్సు:** కుటుంబ సభ్యులతో ఏర్పడిన వివాదాలు పరిష్కారించుకుంటారు. పనులు నిదానంగా పూర్తి చేస్తారు.

**మకరం:** సన్నిహితుల నుండి శుభవార్తలు అందుకుంటారు. జీవితభాగస్వామి నుండి ధన లాభం పొందుతారు.

**కుంభం:** విలువైన వస్తువులు, ఆభరణాలు కొనుగోలు చేస్తారు. బంధువులను కలిసి కష్ట సుఖాలను పంచుకుంటారు.

**మీనం:** ముఖ్యమైన పనులలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి. ప్రయాణాలలో తొందరపాటు వద్దు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# 27 మంది మృతి

>> ఘటన ఇదేనని సీఎం ఒమర్ అబ్దుల్లా అన్నారు. ఈసంఖ్య మరింతగాపెరగవచ్చని అంచనా. మృతుల్లో ఒడిశా, కర్ణాటకనుంచి వచ్చిన యాత్రీకులు కూడా ఉన్నారు. అంతే కాకుండా అమర్‌నాథ్ యాత్ర కావడంతో దేశంలోని పలు రాష్ట్రాలనుంచి వచ్చిన యాత్రీకులున్నారు. ఒడిశా, తమిళనాడు, గుజరాత్, కర్ణాటక, మహారాష్ట్రలనుంచి వచ్చిన యాత్రీకులు బైసారన్ ప్రాంతంలో ఉన్నట్లు అంచనా. మరో 10 మందికి పైగా గాయాలయ్యాయి. మొత్తం 27 మంది మృతి చెందారని తెలుస్తోంది. గాయపడ్డ వారిని వెంటనే ఆస్పత్రికి తరలించారు. గాయపడ్డ వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు వెల్లడించారు. మిని స్విట్జర్లాండ్‌గా పేర్కొంటున్న పహల్గాంలోని బైసరన్ ప్రాంతాన్ని ఉగ్రమూకలు లక్ష్యంచేసుకున్నాయి. సమాచారం అందిన వెంటనే సంఘటనా స్థలానికి భారీగా భద్రతా బలగాలు చేరుకున్నాయి. కాల్పులు జరిపిన ఉగ్రవాదుల కోసం ఆ ప్రాంతాన్ని భద్రతా బలగాలు జల్లెడపడుతున్నాయి. మంగళవారం మధ్యాహ్నం 3 గంటలప్రాంతంలో బైసరన్‌ప్రాంతంలో ఉన్న సుమారు 40 మంది పర్యాటకులను అటవీప్రాంతంనుంచి వచ్చిన ఉగ్రవాదులు ఒక్కసారిగా చుట్టుముట్టారు. ఆ తర్వాత విచక్షణరారహితంగా కాల్పులు జరిపారు. పహల్‌గామ్‌లో అమర్‌నాథ్ యాత్రికుల బేస్ క్యాంప్ ఉంటుంది. ఇప్పటికే అమర్‌నాథ్ యాత్ర కోసం రిజిస్ట్రేషన్లు ప్రారంభమయ్యింది. ఇదే సమయంలో ఉగ్రవాదులు కాల్పులు జరపడం తీవ్ర కలకలం రేపింది. ఉగ్రవాదుల కాల్పుల్లో గాయపడ్డ ఓ మహిళా టూరిస్ట్ సమాచారం ఇవ్వడంతో కాల్పుల ఘటన గురించి అధికారులకు సమాచారం అందింది. ఉగ్రవాదుల కాల్పుల్లో పర్యాటకులతో పాటు స్థానికులకు కూడా గాయాలైనట్టు తెలుస్తోంది. అయితే ఈ ఘటనకు సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది. జమ్ముకశ్మీర్ లోని కొన్ని ప్రాంతాల్లో అసలు ఉగ్రవాదుల జాడ ఉండదు. పహల్‌గామ్ కూడా అందులో ఒకటి. ఇక్కడికి దేశ విదేశాల నుంచి టూరిస్టులు తరలివస్తుంటారు. మార్చిలో భారీగా మంచు కురియడంతో ఆ ప్రాంతానికికి భారీగా టూరిస్టులు తరలివచ్చారు. ట్రెక్కింగ్ వెళ్లిన టూరిస్టులను టార్గెట్ చేస్తూ ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. పహల్గాం ఆసుపత్రిలో తొమ్మిది మంది బాధితులు చేరారు. 38 రోజులపాటు కొనసాగే అమర్‌నాథ్‌యాత్ర జులై 3నుంచి ప్రారంభం కానున్నది. దేశవ్యాప్తంగా లక్షలమంది యాత్రీకులు రెండు మార్గాల్లో ఇక్కడకు చేరుకుంటారు. అనంత్‌నాగ్ జిల్లాలో పహల్గాం మార్గంలోనే 48 కిలోమీటర్లమేర ఉండదా 14కిలోమీటర్లు మార్గం గండేర్బాల్ జిల్లామీదుగానే ఉంటుంది. ఈ క్రమంలోనే పర్యాటకులపై ఉగ్రవాదులు దాడికి దిగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. కాల్పుల శబ్దాలు వినిపించడంతో వెంటనే భద్రతా బలగాలు ఆప్రాంతానికి చేరుకున్నాయి. గాయపడిన వారిని హెలికాప్టర్‌ద్వారా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే స్థానికులు గుర్రాల సాయంతో పలువురిని తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. మృతుల్లో ఇద్దరు విదేశీయులు కూడా ఉన్నారు. కాల్పుల ఘటనతో ఇపుడు పహల్గాంవ్ వీధులన్నీ నిర్మానుష్యం అయ్యాయి.

పహల్‌గాంవ్ సంఘటనపై ప్రధానిమోడీ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తంచేసారు. అందుకు భారీ మూల్యం తప్పదని, ఉగ్రవాదం ఏరూపంలో ఉన్నా తీవ్రంగా అణిచివేస్తామని ప్రకటించారు. నిందితులను చట్టంముందుకు తీసుకురాక తప్పదని చెప్పారు. మృతుల కుటుంబాలకు ఆయన ప్రగాఢ సంతాపం తెలిపారు. ఆ కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. అంతేకాకుండా కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను వెంటనే శ్రీనగర్‌కువెళ్లి పరిస్థితిని సమీక్షించాలని ఆదేశించడంతో అమిత్‌షా ప్రత్యేక విమానంలో శ్రీనగర్‌కు చేరుకున్నారు. ఈసందర్భంగా అమిత్‌షా మాట్లాడుతూ ఈ ఘాతుకానికి పాల్పడిన ఉగ్రవాదులను ఉపేక్షించేదిలేదని కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మృతుల కుటుంబాలకు ఆయన ప్రగాఢ సంతాపం తెలిపారు. అమాయక పౌరులను టార్గెట్‌గా చేసుకుని వారిపై కాల్పులు జరపడం ఎంతమాత్రం తగదని యాత్రీకులే లక్ష్యంగా దాడులుచేయడం క్షమించరాని నేరమని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు ఆమె ప్రగాఢసంతాపం తెలిపారు. జమ్ముకాశ్మీర్ ముఖ్యమంత్రి ఓమర్ అబ్దుల్లా వెంటనే సంఘటన జరిగిన ప్రాంతానికి చేరుకుని అక్కడి అధికారులతో పరిస్థితిని సమీక్షించారు. ఇదిలా ఉంటే కర్ణాటక ప్రభుత్వం ఒక పోలీస్ అధికారుల బృందాన్ని పహల్‌గాంవ్‌కు పంపించి కాల్పుల్లో మృతిచెందిన కర్ణాటక యాత్రీకులను తీసుకువచ్చేందుకు పంపించింది. లోక్‌సభలో విపక్షనేత రాయ్‌బరేలి ఎంపి రాహుల్‌గాంధీతోపాటు ఎఐసిసి అధ్యక్షుడు మల్లిఖార్జున్‌ఖర్గేలు కూడా ఈ కాల్పుల ఘటనను తీవ్రంగా ఖండించారు. సరిహద్దుల్లో ఉగ్రవాదంపై పోరుకు దేశం మొత్తం భద్రతా బలగాలతో నడుస్తుందని ఈసందర్భంగా ఆయన పేర్కొన్నారు.

## దాడిలో మృతి చెందిన హైదరాబాద్‌వాసి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్.ఏప్రిల్22:** కాశ్మీర్ ఉగ్రదాడిలో హైదరాబాద్ వాసి మృతి చెందాడు. హైదరాబాద్‌కు చెందిన మనీష్ రంజన్.. తన భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి హాలిడే ట్రిప్ కోసం జమ్ముకాశ్మీర్ కు వెళ్లారు. ఈ క్రమంలో ఇవాళ సాయంత్రం జరిగిన ఉగ్రవాదుల కాల్పుల్లో మనీష్ చనిపోయాడు. భార్య, ఇద్దరు పిల్లల ముందే మనీష్‌ను ఉగ్రవాదులు కాల్చి చంపారు. ఆయన కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. హైదరాబాద్‌లో మనీష్ రంజన్ ఇంటెలిజెన్స్ బ్యూరోలో సెక్షన్ ఆఫీసర్‌గా పని చేస్తున్నట్లు తెలుస్తోంది.



ప్రభుత్వ భూమిని వదిలేసి ఫెన్సింగ్ వేయడంతో హెచ్ఎండిఎ సిబ్బంది సాక్షిగా మంగళవారం దర్జాగా బోరువేసి కబ్జా మొదలుపెట్టిన దృశ్యం

# చెలరేగుతున్న భూబకాసురులు

>> భూమిని కాపాడాల్సిన బాధ్యతలో ఉన్న ప్రభుత్వాధికారులు ఎంత అప్రమత్తంగా ఉండాలి..? కాని ఇక్కడ జరుగుతున్న తంతు చూస్తుంటే అధికారులే ఈ భూమిని బంగారు పళ్లెంలో పెట్టి కబ్జాదారులకు అప్పగిస్తున్నట్లు అవగతమవుతోంది.. ఓవైపుహెచ్ఎండిఎ, మరోవైపు రెవెన్యూ అధికారులు ఎవరికివారు బాధ్యత లేకుండా వ్యవహరిస్తుండగా జిహెచ్ఎంసి అధికారులు మాత్రం అందిన కాడికి దండుకొని అక్రమ అనుమతులు మంజూరు చేస్తున్నారు... ఇలా పొందిన అనుమతులతో భూబకాసురులు కోర్టులను అడ్డుపెట్టుకొని ప్రభుత్వ భూముల్లోనే భారీ భవనాలు నిర్మిస్తూ వాటిని అమాయకులకు అంటగడుతున్న వైనంపై ప్రభాతవార్త ప్రత్యేక కథనం...

పుట్టింటోళ్లు తరిమేశారు.. కట్టుకున్నోడు వదిలేశాడు.. అన్న చందంగా మారింది మియాపూర్ ప్రభుత్వ భూముల పరిస్థితి. శేరిలింగంపల్లి మండలం మియాపూర్ సర్వేనెంబరు 100లో 277.5 ఎకరాలు, 101లో 273.34 ఎకరాలు మొత్తం కలిపి 551 ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నది. దశాబ్దాల క్రితం కొందరు అధికారులు, కింది స్థాయి సిబ్బంది చేసిన తప్పిదానికి ఉన్నట్టుండి హక్కుదారులు పుట్టుకొచ్చి ఈ భూముల వ్యవహారం న్యాయస్థానాల వరకు వెళ్లింది. చివరగా 2003వ సంవత్సరంలో హైకోర్టు ఈ భూములు ప్రభుత్వానివేనంటూ స్పష్టమైన తీర్పు ఇచ్చినా, ఆశచావని బడాబాబులు సుప్రీంకోర్టులో దావా వేశారు. ఈభూములపై సుప్రీంకోర్టు స్టేటస్‌కో మంజూరు చేయగా అప్పటి ప్రభుత్వం ఈ భూముల పరిరక్షణ బాధ్యతను అప్పటి హుడా చేతిలో పెట్టింది. కాలక్రమంలో హుడా హెచ్ఎండిఎగా రూపాంతరం చెందగా ఆ విభాగం అధికారులే ఇప్పటికీ ఈ భూముల పరిరక్షణ బాధ్యతను నిర్వహిస్తున్నారు. హెచ్ఎండిఎతో పాటు స్థానిక రెవెన్యూ విభాగం సైతం సమిష్టిగా ఈ భూముల పరిరక్షణ బాధ్యతలు చేపట్టాల్సివుంది. ఇదిలావుండగానే ఏడేళ్ల క్రితం గత ప్రభుత్వ హయాంలో ఇవే భూములపై అక్రమంగా రిజిస్ట్రేషన్లు జరుగగా ఈవ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేకెత్తించింది. ఈవ్యవహారం అసెంబ్లీని సైతం కుదిపేయగా వేలకోట్ల ఈ భూకుంభకోణంలో పాత్రుడైన సబ్‌రిజిస్ట్రార్‌ను సస్పెండ్‌చేసి అప్పటి ప్రభుత్వం చేతులు దులుపుకుంది. ఇంత జరిగినా కనీసం ఈభూముల పరిరక్షణకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో సరిహద్దుల్లో ఉన్నవారు స్వాహా చేస్తూవచ్చారు. అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన కొత్తలో ఇక్కడి ప్రభుత్వ భూములను ఆక్రమించుకుంటే తమకు పట్టాలు వస్తాయని వ్యాపించిన వదంతులను నమ్మి సమీప ప్రాంతాల నుంచి పేద ప్రజలు వేలాదిగా తరలిరాగా పోలీసుల సహాయంతో అధికారులు వారిని తరిమికొట్టారు. అప్పట్లో ఈవిషయం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం కలిగించగా ప్రభుత్వ పెద్దలు కలుగజేసుకొని భూమిచుట్టూ ఫెన్సింగ్ వేయించారు.

**కబ్జాలకు ఊతమిచ్చిన ఫెన్సింగ్..!**

ఏదైనా భూమి అన్యాక్రాంతం కాకుండా ఉండాలంటే హద్దులు నిర్ణయించి ఫెన్సింగ్ వేయడమే పరిష్కారమవుతుంది కానీ మియాపూర్ భూముల విషయంలో ఇందుకు విరుద్ధమైంది. రెండు సర్వేనెంబర్లలోని మొత్తం 551 ఎకరాలకు హద్దులు నిర్ణయించి అన్యాక్రాంతమవని భూమికి ఫెన్సింగ్ వేయాల్సిన హెచ్ఎండిఎ అధికారులు తమకు రెవెన్యూశాఖ కేవలం 445 ఎకరాలు మాత్రమే అప్పగించిందని పేర్కొంటూ ఆమేరకు మాత్రమే ఫెన్సింగ్ వేశారు. దీంతో 106 ఎకరాల విలువైన స్థలం కబ్జాదారులకు అయాచిత వరంగా దక్కినట్లయింది. ఇందులో మూడు దశాబ్దాలుగా పేదలు నివాసముంటున్న ఎంఎనగర్ చుట్టూ ఫెన్సింగ్‌వేసినా స్టాలిన్‌నగర్‌ను వదిలేశారు. స్టాలిన్‌నగర్‌కు దాదాపు ఆరు ఎకరాలు పోయినా మరో 100ఎకరాల్లో ఇప్పటికే కబ్జాపెట్టిన వారికి బలం చేకూరగా కొత్తగా కబ్జా చేసుకునేవారికి హద్దు అదుపు లేకుండా పోయింది.

**జిహెచ్ఎంసి అడ్డగోలు అనుమతులు**

ఓవైపు హెచ్ఎండిఎ, రెవెన్యూ శాఖలు ప్రభుత్వభూమి పరిరక్షణలో నిద్ర నటిస్తుండగా ఇదే అదునుగా జీహెచ్ఎంసి అధికారులు అందినంతా దోచుకొని ప్రభుత్వ భూమిలోనే అనుమతులు మంజూరు చేస్తున్నారు. భూకబ్జాదారులు పక్కనేవున్న ప్రైవేటు సర్వేనెంబర్లతో దరఖాస్తు చేసుకొని ప్రభుత్వభూమినే నిర్మాణంకోసం చూపిస్తుండగా రెవెన్యూశాఖ నుంచి ఎలాంటి ఎన్ఓసి అడుగకుండా కళ్లు మూసుకొని ఎడాపెడా నిర్మాణ అనుమతులు మంజూరు చేస్తున్నారు. నిర్మాణం మొదలవగానే తేరుకునే రెవెన్యూ అధికారులు యధాలాపంగా ఒక నోటీసు పంపించి తిరిగి అటువైపు చూడకపోవడం ఆక్రమణదారులకు వరంగా మారింది. ఈకోవలోనే సర్వేనెంబరు 100లో ప్రశాంత్‌నగర్ వైపు ఏకకాలంలో దాదాపు పది అక్రమ భవనాలు, భారీ షెడ్లు వ్యాపార సముదాయాలు పుట్టుకొచ్చాయి. నిశేధిత సర్వేనెంబర్లలో సైతం దర్జాగా జీహెచ్ఎంసి అనుమతులు తీసుకొని నిర్మాణాలు మొదలుపెడుతుండా రెవెన్యూ అధికారులు చేష్టలుడిగి చూస్తున్నారు.

**అడ్డంకులు సృష్టిస్తున్నారు:హెచ్ఎండిఎ డిఇఓ**

అక్రమ నిర్మాణాలను కూల్చివేసేందుకు తాము వెళ్తుండగా ప్రభుత్వ విభాగమే అయిన జీహెచ్ఎంసి అనుమతులు ఇస్తే మీరెలా కూలుస్తారంటూ ఆక్రమణదారుల నుంచి తమకు ప్రతిఘటన ఎదురవుతోందని హెచ్ఎండిఎ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ అధికారిణి దివ్వరెడ్డి ప్రభాతవార్తకు వివరణ ఇచ్చారు. ఆక్రమణదారులు నిర్మాణ అనుమతులు అడ్డుపెట్టుకొని కోర్టులనుంచి నాట్‌టూ ఇంటర్‌ఫియర్ ఆర్డర్లు పొందుతున్నారని, ఇటీవల ఒనిర్మాణం పిల్లర్లను తొలగిస్తే తమకు కోర్టు ధిక్కరణ నోటీసు ఇప్పించారని వాపోయారు.

**హైడ్రా అధికారులు ఎక్కడ..?**

వేలకోట్ల రూపాయలు విలువచేసే ప్రభుత్వ భూమి పందికొక్కుల పాలవుతుండగా హైడ్రా అధికారులు ఇటువైపు రావడంలేదని స్థానికులు వాపోతున్నారు. గత 22 ఏళ్లుగా సుప్రీంకోర్టులో ఈ భూవివాదం కొనసాగుతుండగా మరికొన్ని నెలల్లోనే తీర్పు వెలువడే అవకాశముందని సర్వత్రా చర్చనీయాంశమైంది. హైకోర్టు తీర్పు ఇచ్చిన మాదిరిగానే సుప్రీంకోర్టులో కూడా ఈ భూమి ప్రభుత్వానికే చెందుతుందని తీర్పు వెలువడే అవకాశముందన్న ఊహాగానాలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో కబ్జాదారులు మరింతగా రెచ్చిపోయి రేయింబవళ్లు నిర్మాణాలు పూర్తిచేస్తున్నారు. ఇప్పటికైనా హైడ్రా అధికారులు ఇటువైపు దృష్టిసారిస్తే వేలకోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కబ్జాల చెరనుంచి కాపాడే అవకాశముంది.

# సినీపరిశ్రమకు పూర్వవైభవం తెస్తాం

## ఘనంగా గద్దర్ అవార్డుల వేడుక: డిప్యూటీ సీఎం భట్టి



**హైదరాబాద్, ఏప్రిల్ 22, ప్రభాతవార్త:** తెలంగాణలో గత పదేళ్లలో సినీ పరిశ్రమ నిరాదరణకు గురైందని, తమ ప్రభుత్వం తిరిగి పూర్వ వైభవాన్ని తెస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. రాష్ట్రంలో జూన్ 14న గద్దర్ సినిమా అవార్డుల ఫంక్షన్ ఘనంగా జరపాలని తెలిపారు. హైదరాబాద్‌లోని సినీ ల్యాబ్‌లో మంగళవారం జరిగిన గద్దర్ సినిమా అవార్డుల జ్యూరీ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ అవార్డుల ఫంక్షన్ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి సంపూర్ణ సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. ప్రపంచ స్థాయిలో నిర్వహించే సినిమా అవార్డుల ఫంక్షన్‌కు ధీటుగా తెలంగాణలో కూడా సినిమా అవార్డుల కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ చలనచిత్ర అవార్డుల ఫంక్షన్ గురించి ప్రపంచవ్యాప్తంగా మాట్లాడుకునేలా కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. 2011లో చలనచిత్ర అవార్డుల పంపిణీ కార్యక్రమం నిలిచిపోయి ప్రోత్సాహం కరువైందన్నారు. తెలంగాణ సంస్కృతి భావజాలాన్ని రాష్ట్రానికి దేశానికి ప్రపంచానికి స్పష్టమైన మార్గంలో గద్దర్ ప్రచారం చేశారని వివరించారు. ఎక్కడో ఉన్న చిత్ర పరిశ్రమను కాంగ్రెస్ ప్రభుత్వం హైదరాబాద్‌కు తరలించి ప్రోత్సహించింది అన్నారు. చిత్ర పరిశ్రమను తరలించి ప్రోత్సాహకాలు అందించడమే కాదు, సినీ పరిశ్రమ లో పనిచేసే వారికి ఇళ్ల స్థలాలను సైతం కేటాయించాం అన్నారు. సమాజంలో అభివృద్ధి, విలువలను ప్రోత్సహించే మీడియానే అని, దాన్ని కాపాడుకునే బాధ్యత పాలకులపై ఉంది అన్నారు. ప్రజల జీవన ప్రమాణాల పెరుగుదలకు బాధ్యత గల ప్రభుత్వాలు బలమైన సినిమా రంగం ద్వారానే సమాజానికి సందేశం ఇవ్వాలని మంత్రివర్గం నిర్ణయించిందన్నారు. దశబ్ద కాలంగా ప్రోత్సాహకానికి నోచుకోని సినీ రంగానికి చేయూతనివ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. భవ బంధాలు, రాగద్వేషాలకు అతీతంగా అవార్డులకు సినిమాలను ఎంపిక చేయాలని జూరీ సభ్యులను డిప్యూటీ సీఎం కోరారు. సినిమా అవార్డులతో పాటు సినీ పరిశ్రమకు కీర్తి ప్రతిష్టలు తెచ్చి పెట్టిన వ్యక్తుల పేరిట అవార్డులు ఇస్తున్నాం, ఇవి భవిష్యత్తు తరాలకు స్ఫూర్తిదాయకంగా ఉండాలి అన్నారు.

# కరెంట్ షాక్ మరణాలు ఆందోళనకరం

## విద్యుత్ సంస్థలపై మానవ హక్కుల కమిషన్ సీరియస్

### జూన్ 4లోగా నివేదిక సమర్పించాలని ఆదేశం

**హైదరాబాద్, ఏప్రిల్ 22, ప్రభాతవార్త:** రాష్ట్రంలో విద్యుత్ షాకుల వల్ల వరుస మరణాలు సంభవిస్తుండటంపై రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ సీరియస్ అయ్యింది. ఈ మరణాలపై నివేదిక సమర్పించాలని మంగళవారం రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్మన్ జస్టిస్ షమీమ్ అక్తర్ విద్యుత్ సంస్థలను ఆదేశించారు. ఇటీవల కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ షాక్‌లతో ఎక్కువ మంది చనిపోతున్నారు. విద్యుత్ రిపేర్లు చేస్తుండగా, కరెంట్ వైర్లు తగిలి మరణించడం, కొన్నిచోట్ల ట్రాన్స్‌ఫార్మర్లకు ఫెన్సింగ్ లాంటివి లేకపోవడం వల్ల మనుషులతో పాటు పశువులు కూడా మృత్యువాత పడుతున్నాయి. ఈ వరుస మరణాలపై రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ సుమోటోగా విచారణకు స్వీకరించింది. గత యేడాది కాలంగా రాష్ట్రంలో 69 మంది విద్యుదా ఘాతానికి గురై మరణించారని వెల్లడి కావడంతో కమిషన్ స్పందించింది. ఈ నేపథ్యంలో విద్యుత్ షాక్‌ల వల్ల జరుగుతున్న మరణాలపై విచారణ చేపట్టింది. ఈ మరణాలపై జూన్ 4లోగా నివేదిక సమర్పించాలని టీజీఎస్పీడీసీఎల్, సిఎండీ, అన్ని జిల్లాల కలెక్టర్లను కమిషన్ ఛైర్మన్ జస్టిస్ షమీమ్ అత్తర్ ఆదేశించారు.

# శిక్షలు హెచ్చరికగా పనిచేయాలి

## ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాహాసన్‌రెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 22, ప్రభాతవార్త:** శిక్షలు నేరస్తులకు హెచ్చరికగా పనిచేయాలి డ్రగ్స్, గంజాయి కేసుల్లో పడే శిక్షలు నేరస్తులకు హెచ్చ రికగా పనిచేసి ఆయా నేరాలకు మళ్లీ పాల్పడకుండా నిరోధించాలని ఎక్సైజ్ ఎన్ఫోఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమాలాహాసన్ రెడ్డి తెలిపారు. గతంలో సంగారెడ్డిలో పని చేసిన ఎక్సైజ్ అధికారులు మంచి పనితీరును కనబరిచి కేసులు నమోదు చేయడమే కాకుండా విచారణను వేగవంతం చేసిసమర్థ వంతంగా పనిచేసి శిక్షల ఖరారుకు తోడ్పడ్డారన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని కమిషనర్ కార్యాలయంలో పలు కేసులలో శిక్షలు పడేటట్లు చేసి రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులకు,సిబ్బందికి రివార్డులను అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ రహిత తెలంగాణ సాధించటానికి ఎక్సైజ్ సిబ్బంది మరింత సమర్థ వంతంగా పనిచేసి శాఖకు గుర్తింపు తేవాలన్నారు. ఇటీవలకాలంలో ఎక్సైజ్ శాఖ సిబ్బంది రాష్ట్ర వ్యాప్తంగా ఎన్‌డిపిఎస్ కేసుల నమోదులో మంచి ప్రతిభ కనబరడమే కాకుండా విచారణలో కూడా ప్రతిభ కనబరిచి శిక్షల పెంపునకు తోడ్పడాలన్నారు. ఈ సందర్భంగా గతంలో సంగారెడ్డిలో పనిచేసిన ఇన్స్ స్పెక్టర్లు జె.మధుబాబు, శ్రీనివాస్ రెడ్డి తోపాటు మరో 7 గురు అధికారుల్ని కూడా అభినందించి క్యాష్ రికార్డుల్ని అందించారు. హైదరాబాద్‌లో కోడిన్ ఆధారిత దగ్గు సిరప్స్‌పు అక్రమంగా మళ్లిస్తున్న నెట్‌వర్క్‌ను తెలంగాణ ఎక్సైజ్,డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్‌లు(డిసిఏ)శాఖలు సంయుక్తంగా మంగళవారం నిర్వహించిన ప్రత్యేక ఆపరేషన్‌లో పట్టుకున్నారు. ఈ ఆపరేషన్‌లో రంగారెడ్డి జిల్లా ఎక్సైజ్‌శాఖ ఎన్‌ఫోర్‌మెంట్‌శాఖ అధికారులు రామంతాపూర్ దగ్గర ఇద్దరు వ్యక్తుల నుంచి నిషేది గంజాయిని1.050కేజీలు పట్టుకున్నారు. ఈ కేసులో వైభవ్ కులకర్ణి, మనుపాటి భాను ప్రకాష్‌లు ఉన్నారు. విచారణలో వీరు సికింద్రాబాద్ లాలాపేట్ ప్రాంతంలో ఒక మహిళ నిషేధిత కోడిన్ పాస్ఫేట్ సిరప్ అమ్ముతొందన్న సమాచారం మేరకు మోలాలి బ్రిడ్జి సమీపంలో నిఘా ఉంచిన అధికారులు ఒక మహిళ స్కూటర్‌పై 13 బాటిళ్ల కోడిన్ పాస్పేట్ సిరప్ బాటిళ్లను తీసుకు వెళుతుండగా పట్టుకున్నారు. ఆమెను నల్ల రజనీగా గుర్తించారు. ఆమె దగ్గర డ్రగ్ లైసెన్, మెడికల్ ప్రిస్క్రిషన్ వంటివి లభించలేదు. ఈ మందులను విద్యానగర్‌లోని జనరిక్ మెడికల్ షాపులను నుంచి తీసుకున్నట్లు తమ విచారణలో తెలిసిందని అధికారులు తెలిపారు. దీంతో అధికారులు ఆ మెడికల్ షాపులో సోదాలు నిర్వహించగా, సదరు మెడికల్ షాపులో3 బాటిళ్ల కోడిన్ సిరప్‌లు లభించాయి. హిమాలయ ఫార్మసీ, ఓల్డ్ బోయిన్‌పల్లి దగ్గర ఫార్మసీ నుంచి కొనుగోలు చేనిట్లు తెలిసింది. ఈ పార్మసీని జనరిక్ వరల్డ్ మెడికల్ షాపును లెసెన్స్ దారు బంధువులు నిర్వహిస్తున్నారు. ఈ షాపులో 80 నిషేదిత కోడిన్ పాస్పెట్ సిరప్ లభించాయి.

# అఘోరీని అరెస్టు చేసిన పోలీసులు

## నగ్నపూజల పేరిట మహిళ నుండి రూ. 9లక్షల 50వేలు వసూలు

**శంకర్‌పల్లి, ఏప్రిల్ 22, ప్రభాతవార్త:** తెలుగు రాష్ట్రాల్లోని దేవాలయాలను నగ్నంగా సందర్శించి పూజలు చేస్తూ వివాదాస్పదంగా మారిన లేడీ అఘోరి శ్రీనివాస్‌ను శంకర్‌పల్లి మండలంలోని మోకిలా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. నగ్న పూజల పేరుతో లేడీగోరి తనను మోసం చేసిందని మోకిలా పోలీస్ స్టేషన్ లో శంకర్ పల్లి మండలంలోని ప్రగతి రిసార్ట్స్ లోని ఓ మహిళ గత నెలలో పోలీసులకు ఫిర్యాదు చేసిందని పేర్కొన్నారు. మహిళకు ఆరు నెలల క్రితం లేడీ అగోరితో పరిచయం ఏర్పడిందని, పరిచయమైన రెండు నెలల తర్వాత ఇద్దరూ ప్రగతి రిసార్ట్స్ లో డిన్నర్ కు పిలిచారని, ఆ తర్వాతి నుంచి ఇద్దరు ఫోన్లో మాట్లాడుకునేవారన్నారు. అగోరి మహిళా కష్టాలు అడిగి తెలుసుకునేదని, ఓ పూజ చేస్తే కష్టాలన్నీ తొలగిపోతాయని చెప్పిందన్నారు. ఈ నేపథ్యంలోనే పూజ కోసం ఐదు లక్షల రూపాయలు అఘోరి అకౌంట్లో వేసిందని. ఆ తర్వాత యూపీలోని ఉజ్జయిని తీసుకెళ్లి అక్కడ పూజలు చేసిందన్నారు. మరసటి రోజు మరో ఐదు లక్షలు అడిగిందని, డబ్బులు ఇవ్వకపోతే పూజ విఫలం అవుతుందని భయపెట్టిందన్నారు. అగోరి మాటలతో భయపడిపోయిన మహిళ మరో నాలుగు లక్షల 50 వేలు అకౌంట్ లో వేసిందని వివరించారు. ఇలా మొత్తం రూ.9.50 లక్షలు నమ్మించి తీసుకుందన్నారు. అగోరి అంతటితో ఆగకుండా మరో ఐదు లక్షలు కావాలంటూ బెదిరింపులకు దిగిందని, దీంతో మహిళ పోలీసులకు గత నెలలో ఫిర్యాదు చేసిందన్నారు. కేసు నమోదు చేసి పోలీసులు మంగళవారం ఉదయం మధ్యప్రదేశ్ నుంచి యూపీ వెళ్తుండగా అరెస్ట్ చేసి మోకిలా పోలీస్ స్టేషన్ కు తరలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### కోడలుపై కన్నేసి..

# కన్నకొడుకుని కడతేర్చిన తండ్రి

## పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయిన నిందితుడు

**రేగొండ, ఏప్రిల్ 22, ప్రభాతవార్త :** కొడుకు భార్యపై కన్నేసి కన్నకొడుకుని కడ తేర్చిన కసాయి తండ్రి ఉదంతమిది. కనికరం లేకుండా రోకలిబండతో మోది కొడుకును హత్యచేసిన సంఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం రేపాకపల్లిలో మంగళవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన కసం ఒదేలు (35) 108 వాహనంలో డ్రైవర్‌గా పని చేస్తున్నారు. ఒదేలుకు పరకాల మండలానికి చెందిన దేవితో 14 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి కుమారుడు ఉన్నాడు. కాగా ఒదేలు తండ్రి ముండయ్య కొన్నిరోజులుగా కోడలితో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడు. గతంలో ఈ విషయంలో పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీ కూడా జరిగినట్టు కుటుంబసభ్యులు తెలిపారు. అయినప్పటికీ తండ్రి ముండయ్య ప్రవర్తనలో ఏ మార్పురాలేదు. ఇదే విషయంలో తండ్రీకొడుకులకు తరచుగా గొడవలు జరుగుతూ ఉండేవి. ఈ క్రమంలో ఈ నెల 21న ఒదేలు, దేవిల పెళ్లిరోజు కావడంతో వేడుకలు జరుపుకుంటుండగా మద్యం మత్తులో ముండయ్య కొడు కుతో గొడవపడ్డాడు. ఇంటి పక్కనే ఉన్న కురుమ లక్ష్మీ నారాయణ ఇద్దరిని పిలిచి సముదాయించి పంపించాడు. ఈ విషయాలు అన్ని మనసులో పెట్టుకొని కొడు కుని ఎలాగైనా హతమార్చాలని ముండయ్య పథకం వేసినట్లు పోలీసులు తెలి పారు. మంగళవారం తెల్లవారుజామున వరండాలో పరుపుపై పడుకొని ఒదేలు నిద్రిస్తుండగా కుటుంబసభ్యులు వ్యవసాయ బావి వద్దకు వెళ్లడాన్ని గమనించిన తండ్రి ముండయ్య కొడుకు తలపై రోకలిబండతో మోది అక్కడి నుండి పరారై రేగొండ పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయాడు. రోకలిబండతో తలపైకొట్టగా తీవ్రంగా గాయపడినన ఒదేలు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎన్

# ఉపాధి హామీ పనులు తగ్గించిన కేంద్రం

## ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్ చిన్నారెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 22, ప్రభాతవార్త:** జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పనిదినాల్లో కేంద్ర ప్రభుత్వం ఒక కోటి 50 లక్షల పనిదినాలు కోత విధించిందని, ఇది కూలీ పనులు చేసుకునే వారికి గుండె కోతకు గురి చేస్తుందని ఉమ్మడి రాష్ట్ర గ్రామీణాభివృద్ది శాఖ ప్రణాళికాశాఖ మాజీ మంత్రి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్ జి. చిన్నారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ పథకం ద్వారా పూట గడుపుకునే కూలీలకు కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం శరఘాతంగా మారిందన్న ఆయన రాష్ట్రానికి 12 కోట్ల పనిదినాలు కల్పించాలని కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపగా కేవలం 6.5 కోట్లు పనిదినాలు మాత్రమే మంజూరు చేసి కూలీ పనులు చేసుకునేవారి కుటుంబాలకు తీరని అన్యాయం చేసిందన్నారు.

కేంద్ర ప్రభుత్వం కక్ష పూరిత విధానాలతో రాష్ట్ర ప్రభుత్వంపై అక్కసు వెళ్ళగక్కుతోందని, అందుకు తాజా నిదర్శనం ఉపాధి హామీ పథకంలో ఒక కోటి 50 లక్షల పని దినాలు కుదించడమేనని చిన్నారెడ్డి పేర్కొన్నారు. గత నాలుగు సంవత్సరాల నుంచి రాష్ట్రంలో వరుసగా ప్రతిఏటా 10 కోట్ల ఉపాధి హామీ పని దినాలు జరుగుతున్నాయని రాష్ట్రంలో ఉపాధి హామీ పథకం పనులు విజయవంతంగా కొనసాగుతున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పని దినాలలో కోత విధించడం వల్ల కూలీలకు పనులు లభించగా వలస వెళ్లాల్సిన దుస్థితి కలుగుతోందని చిన్నారెడ్డి అన్నారు. 2004 లో కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని అప్పటి యు.పీ.ఏ. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఉపాధి హామీ పథకాన్ని అమలులోకి తెచ్చిందని, వర్షాభావ పరిస్థితులు ఉన్న ఉమ్మడి రాష్ట్రం అనంతపురం జిల్లాలో అప్పట్లో ఉపాధి హామీ పనులకు తాను మంత్రిగా ఉన్న హయాంలో వైఎస్సార్ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని చిన్నారెడ్డి గుర్తు చేశారు. రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ వెంటనే కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి ఉపాధి హామీ పనుల్లో రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయంపై నోరు విప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకం కింద పది కోట్ల పని దినాలు కల్పించాలని చిన్నారెడ్డి ఒక ప్రకటనలో కేంద్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు.

# పడిపోయిన మిర్చి ధరలు

**హైదరాబాద్, ఏప్రిల్ 22, ప్రభాతవార్త:** రాష్ట్రంలో మిర్చి ధరలు పడిపోయాయి. ఆసియాలోనే రెండో పెద్ద మార్కెట్ అయిన వరంగల్ ఏనుమాముల మార్కెట్‌కు మిర్చి పోటెత్తింది. శుక్ర, శని, ఆదివారాలు సెలవులు రావడంతో రైతులు 60 వేల నుంచి 70 వేల బస్తాల మిర్చిని మార్కెట్‌కు తీసుకొచ్చారు. అయితే తేజ రకం మిర్చి క్వింటాల్కు గరిష్టంగా రూ.12 వేలు పలుకగా, కనిష్టంగా రూ. 8 వేలు పలికింది. వండర్ హాట్ రకం రూ. 13 వేల నుంచి రూ. 10 వేల మధ్య, యుఎస్341 రకరం రూ. 11 వేల నుంచి రూ. 8 వేల మధ్య, దేశీ రకం గరిష్టంగా రూ.27 వేలు పలుకగా, కనిష్టంగా రూ.18 వేలు పలికింది. ధరలు ఇలాగే కొనసాగితే భారీ మొత్తం నష్టం వాటిల్లుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కాగా సీజన్‌కు ముందు క్వింటాల్ మిర్చికి రూ.20 వేలు నుండి రూ.22 వేల మధ్య ధర పలికింది. అయితే అది రూ.16 నుండి రూ.12 వేల మధ్యకు పతనమైంది. గత ఏడాది సీజన్ షురూ అయి మార్చి నాటికి రూ.16 వేలకు పడిపోయింది. ఈ నేపథ్యంలో అధికారులు భవిష్యత్ లో మిర్చికి మంచి ధరలు వస్తాయని, రైతులు తొందరపడి తక్కువకు అమ్ముకోవద్దని కోల్డ్ స్టోరేజీల్లో దాచుకోవాలని సూచించారు. దీంతో నెలకు 8 వేలు అదె కడుతూ పంటను దాచారు. ఈ ఏడాది సీజన్ షురూ కాగానే మార్కెట్లో అమ్మడానికి తీసుకెళ్తే రూ.12 వేల ధర పలికింది. స్టోరేజీల్లో దాచిన పంట రంగు మారిందని, నాణ్యత లేదని వ్యాపారులు సాకు చూపి తక్కువ రేటుకు కొనుగోలు చేశారు. దీంతో రైతులు ఒక్కో క్వింటా రూ.4 వేలతో పాటు కోల్డ్ స్టోరేజీల అద్దె కూడా నష్టపోయారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఈసారి రైతులు పంటను దాచుకోవడానికి ఇష్టపడట్లేదు.

# చెన్నమనేనిపై ఫోర్జరీ కేసు నమోదు



**వేములవాడ, ప్రభాతవార్త:** వేములవాడ మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్ పై తెలంగాణ సీఐడీ ఫోర్జరీ కేసు నమోదు చేసింది. ప్రభుత్వవిప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదైంది. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడకు చెందిన చెన్నమనేని రమేశ్‌పై వివిధ చట్టాల కింద సీఐడీ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఈ మేరకు సీఐడీ డైరెక్టర్ జనరల్ ఆదేశాల మేరకు కేసు దర్యాప్తు ప్రారంభించినట్టు అధికార వర్గాలు వెల్లడించాయి. ఈ కేసులో భారత శిక్షా స్మృతి (ఐపీసీ) సెక్షన్ 465 (ఫోర్జరీ), 468 (దొంగ పత్రాలు తయారు చేసి మోసం చేయడం), 471 (దొంగ పత్రాలను అసలైనవిగా ఉపయోగించడం) కింద కేసు నమోదైంది. అలాగే పాస్‌పోర్ట్ చట్టం 1967 లోని సెక్షన్ 12, విదేశీయుల చట్టం 1946 సెక్షన్ 14, పౌరసత్వ చట్టం 1955 సెక్షన్ 17 కింద కూడా చెన్నమనేని రమేశ్‌పై ఆరోపణలు మోపబడ్డాయి. చెన్నమనేని రమేశ్‌కు జర్మన్ పౌర సత్వం ఉండి, పలుమార్లు బెర్లిన్‌కు ప్రయాణాలు చేసిన విషయాలను తన ఫిర్యాదులో ఆది శ్రీనివాస్ వివరించారు. ఈ క్రమంలో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలను మోసం చేయడమే కాకుండా వేములవాడ నియోజకవర్గ ఓటర్లను కూడా మోసం చేశారని ఆయన ఆరోపించారు. "చెన్నమనేని రమేశ్ చట్ట ప్రకారం శిక్షార్హుడు. ఆయనపై ఫిర్యాదు చేయడానికి ముందు హైకోర్టు తీర్పు ప్రతిని పొందడం, న్యాయ నిపుణులతో చర్చించడం జరిగింది" అని ఆది శ్రీనివాస్ స్పష్టం చేశారు.

**వేములవాడ ప్రజలకు క్షమాపణ చెప్పాలి**

తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో ఎమ్మెల్యేగా గెలుపొంది, దేశ అత్యున్నత న్యాయస్థానాన్ని తప్పుదోవ పట్టిస్తూ ఎమ్మెల్యేగా కొనసాగిన రమేష్ బాబు వేములవాడ నియోజకవర్గం ప్రజలను మోసం చేశాడు కాబట్టి ప్రజలకు భేషరతుగా క్షమాపణ చెప్పాలని ప్రభుత్వ విప్ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ డిమాండ్ చేశారు.

# టార్గెట్ 'కర్రెగుట్టలు'

## అడవిబాట పట్టిన భద్రతా బలగాలు

### భారీగా మోహరింపు

**చర్ల, ఏప్రిల్ 22, ప్రభాతవార్త:** తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో అలజడి మొదలైంది. ములుగు జిల్లాలోని కర్రెగుట్టలలో మావోయిస్టులు ఉన్నారన్న పక్క సమాచారంతో భారీగా భద్రతా బలగాలను మోహరించినట్లు తెలుస్తుంది. కర్రెగుట్టలు చత్తీస్ ఘడ్ లోని ఊసురు పూజారికాంకేర్ తెలంగాణలోని వాజేడు మండలం వరకు విస్తరించి ఉన్నాయి. కర్రెగుట్టల్లో భారీగా మందుపాతరలు ఉన్నాయని ఆదివాసీలు ఎవరూ అటవి ప్రాంతంలోకి రావద్దని వెంకటాపురం ఏరియా కమిటి కార్యదర్శి శాంత పేరిట లేఖ విడుదల చేసిన విషయం విదితమే. దీంతో మావోయిస్టు తెలంగాణా కమిటీతో పాటు పలువురు అగ్రనేతలు అక్కడే నిఘా వర్గాలు భద్రతా దళాలు బావిస్తున్నాయి. బచావో కర్రెగుట్టలు పేరుతో ఆపరేషన్ నిర్వహిస్తున్నారని విశ్వసనీయ సమాచారం అటు ఛత్తీస్‌గఢ్ నుంచి ఇటు తెలంగాణ వైపు నుంచి కర్రెగుట్టలను సీఆర్పీఎఫ్ బలగాలు చుట్టుముట్టాయని ఎన్ కౌంటర్ జరిగిందని పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. కర్రెగుట్టలను చేరుకోవడానికి భద్రతా బలగాలకు సవాల్ గా మారింది.

# కర్రగుట్టలో పోలీసు కాల్పులు నిలిపివేయాలి

## మావోయిస్టు పార్టీతో కేంద్రం చర్చలు జరపాలి

### పౌర, ప్రజా సంఘాలు డిమాండ్





సమావేశంలో మాట్లాడుతున్న ఎన్.వేణుగోపాల్. చిత్రంలో లక్ష్మణ్, నారాయణరావు తదితరులు

**హైదరాబాద్ (సైఫాబాద్), ఏప్రిల్ 22, ప్రభాతవార్త:** ఛత్తీస్‌గఢ్‌లోని ఊసూరు కర్రగుట్టలో పదివేల మంది పోలీసుబలగాలతో చుట్టుముట్టి జరుపు తున్న కాల్పు లను వెంటనే నిలిపివేయాలని ప్రజా సంఘాలు, పౌర హక్కుల సంఘం కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. శాంతి చర్చలకు, కాల్పుల విరమణకు సిద్ధం అని ప్రకటించిన మావోయిస్టు పార్టీతో చర్చలు జరపాలని ఆ సంఘాల నాయ కులు కోరారు. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో విరసం నేత ఎన్.వేణుగోపాల్, తెలంగాణ పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, ఎన్. నారాయణరావు తదితరులు మాట్లాడుతూ ఈ రోజు ఉదయం నుంచి కర్రగుట్టలో మందు పాతరలు పెట్టామని, కాల్పులు జరుగుతు న్నాయని పోలీసులు తప్పుడు ప్రచారం చేసు న్నారని ఆరోపించారు. అసలు కర్రగుట్టలో ఎవరూ ఉన్నారన్న విషయం తెలియదని, కాని తప్పుడు ప్రచారం చేయడం మంచిది కాదన్నారు. అక్కడ ఉన్న ఖనిజ సంపదను కార్పోరేట్ సంస్థలకు అప్పగించడానికి కేంద్ర హోంశాఖ మంత్రి వీధి రౌడిలా వ్యవహారిస్తున్నారని వారు ధ్వజమెత్తారు. కర్రగుట్టలో పోలీసులు జరుపు తున్న కాల్పులను వెంటనే అపాలని వారు డిమాండ్ చేశారు. ఆపరేషన్ కగార్ పేరుతో గత ఏడాది జనవరి నుంచి 470 మంది మావో యిస్టులను, ఆది వాసీలను అత్యంత కిరాతకంగా హత్యచేసి ఎన్ కౌంటర్లు అని ప్రభుత్వం ప్రకటిం చడం సిగ్గుచేటని విమర్శించారు. కేంద్రం అన్ని రకాలు పోలీసుల బలగాలను మెహరించి మనుషులను చంపడం దారుణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సహకరించడం వల్లనే అక్కడ ఊచకోత కొనసా గుతున్నదని ఈ మారణ కాండ విషయంపై ప్రజాస్వామికవాదులు స్పందించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ ఎదురుకాల్పుల హత్యాకాండలను నిలు పుదల చేయడానికి తెలంగాణ ప్రభుత్వం ముందుకు రావాలని, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కూడా క్రియాశీలకంగా చొరవ తీసుకుని మధ్యభారతంలో కొనసాగుతున్న నరసంహారాన్ని నిలిపివేయడానికి, శాంతిచర్చల ప్రక్రియకు ముందుకువచ్చి ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టాలని వారు కోరారు. ఈ సమావేశంలో ప్రజా సంఘాల నాయకులు వెంకటయ్య, ఇన్నయ్య, రమణ, రవిశర్మ, రమేష్, చంద్రమౌళి, పద్మకుమారి, వెంకన్న, సోమన్న తదితరులు పాల్గొన్నారు.

# అన్నదాతను వదలని అకాల వర్షాలు

## చేతికందొచ్చిన పంట నీటిపాలు

## 21 వేల ఎకరాల్లో పంట నష్టం

## మళ్లీ కురిసిన వడగండ్ల వానలు

**హైదరాబాద్, ఏప్రిల్ 22, ప్రభాతవార్త:** తెలంగాణ అన్నదాతలను అకాల వర్షాలు, వడగండ్ల వానలు వదలిపెట్టడం లేదు. కష్టాలకు ఎదురీది పంటలు సాగు చేసిన రైతులను అకాల వర్షాలు నట్టేట ముంచాయి. రాత్రింబవళ్లు పడిన శ్రమంతా నీటిపాలైంది. అకాల వర్షం అన్నదాతలకు అపార నష్టాన్ని మిగిల్చింది. వరణుడి ప్రకోపం రైతులకు తీరని శోకాన్ని కలిగించింది. నోటి కాడి బుక్క నీటిపాలడంతో దిక్కుతోచక తలలు పట్టుకున్నారు. తాజాగా రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో రాత్రి కురిసిన వర్షాలతో చేతికందొచ్చిన పంట నేలపాలై, ఆరుగాలం కష్టమంతా వృధా అయింది. ఓవైపు భానుడి భగభగలతో ప్రజలు ఉక్కపోతకు గురవుతుంటే, మరోవైపు ఈదురుగాలతో కూడిన వడగళ్ల వర్షాలు రైతుల్ని దెబ్బతీస్తున్నాయి. ఆరు గాలం శ్రమించి పండించిన పంట పనికి రాకుండా పోవడంతో రైతుల పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. రాష్ట్రంలోని నాగర్ కర్నూల్ జిల్లాలో మామిడి రైతులను అకాల వర్షాలు కోలుకోలేని దెబ్బ తీశాయి.

అచ్చంపేట మండలం లింగోటంలో మామిడి కాయలు రాలిపోయాయి. పంట చేతికొచ్చే సమయంలో కాయలన్నీ నేలరాలడంతో రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చింది. మరోవైపు కోతకు వచ్చిన వరి నేలవాలగా, కళ్లాల్లో ఆరబోసిన వడ్లు తడిసి ముద్దయ్యాయి. అప్పులు చేసి పంటకు పెట్టుబడిగా పెడితే కనీసం పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని రైతన్నలు వాపోతున్నారు. అలాగే వరంగల్, ములుగు, మహబూబాబాద్, జనగామ, జయశంకర్ భూపాలపల్లి, హనుమకొండ జిల్లాల్లో అకాల వర్ష బీభత్సంతో ఊహించని నష్టం వాటిల్లింది. పంట మొత్తం వర్షార్పణమైంది. వరి, మామిడి, మొక్కజొన్న, మిర్చి పంటలు నీటిపాలయ్యాయి. కళ్లెదుటే ధాన్యం నీళ్లలో కొట్టుకుపోవడంతో కర్షకులు కన్నీటి పర్యంతమయ్యారు. సుమారు 21 వేల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని ప్రాథమిక అంచనాలు చేశారు. ఆరబోసిన ధాన్యం తడవడంతో ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. వికారాబాద్ జిల్లా పరిగిలో ఈదురు గాలులతో వర్షం బీభత్సం సృష్టించింది. పలు చోట్ల భారీ వృక్షాలు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో జనాలు భయాందోళనకు గురయ్యారు. ఈదురు గాలుల ధాటికి పలు చోట్ల ఇళ్ల పైకప్పులు ఎగిరిపడ్డాయి. ప్రకృతి ప్రకోపానికి నష్టపోయిన పంటలను గుర్తించి ప్రభుత్వమే ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.

hmda హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ
స్వర్ణ జయంతి కమర్షియల్ కాంప్లెక్స్, అమీర్‌పేట, హైదరాబాద్-82.
బహిరంగ ప్రకటన
ప్రణాళికా విభాగం
ఫైల్ నం. 013277/FLT/HMDA/3581/SMD/2024
ఇందుమూలముగా ప్రకటించునది ఏమనగా M/s. సెంచరీ హోమ్స్ TG-bPASS క్రింద, షేక్ సుల్తాన్ మరియు ఇతరులచే ప్రాతినిధ్యం కలిగి R.R. జిల్లా, ఫరూఖ్‌నగర్ (పార్ట్) మండలం, ఎలికట్ట గ్రామం వద్ద ఉన్న సర్వే నం.215/Pలో ఓపెన్ ప్లాట్స్‌తో ఫైనల్ లేఅవుట్ యొక్క అనుమతికి 25898.88 చ.మీటర్ల విస్తీర్ణానికి ప్లాటెడ్ ప్రాంతం, పార్క్ ఏరియా, సామాజిక మౌలిక వసతుల ఏరియా, మరియు యుటిలిటీ ఏరియా వంటి వాటిలో మార్పులతో, అంతకుముందు జారీ చేయబడిన డ్రాఫ్ట్ లేఅవుట్ అనుమతి ఫైల్ నం.054901/SMD/LT/U6/HMDA/30052022, తేది: 19.09.2022 దానికి దరఖాస్తు పెట్టింది.
అందువలన R.R. జిల్లా, ఫరూఖ్‌నగర్ (పార్ట్) మండలం, ఎలికట్ట గ్రామం వద్ద ఉన్న సర్వే నం.215/Pలో లేఅవుట్ అనుమతి యొక్క ప్లాట్/విల్లా యజమానులు/కొనుగోలుదారులు/అగ్రిమెంట్ హోల్డర్లు ఈ ప్రకటన ప్రచురణ తేదీ నుండి 15 రోజులలోపుగా వారి అభ్యంతరాలు/సూచనలు రాతపూర్వకంగా ఈ కార్యాలయానికి దాఖలు చేయవచ్చును. ఎటువంటి అభ్యంతరాలు/సూచనలు పై పీరియడ్‌లో రాకపోతే, రివైజ్డ్ డ్రాఫ్ట్ లేఅవుట్‌కు అనుమతి అర్జిస్తూ దరఖాస్తుదారుని అభ్యర్థన ఈ కార్యాలయంలో అందుబాటులో ఉన్న మెటీరియల్ పేపర్స్‌పై ఆధారపడి పరిగణించబడుతుందని ఈ ప్రకటనలో తెలియజేయడమైనది.
DIPR.No.690-PP/CL/Advt/1/2025-26, తేది: 22.04.2025 సం/- డైరెక్టర్ (ప్లానింగ్)-II, HMDA

BEFORE THE HON'BLE DEBTS RECOVERY TRIBUNAL-II, AT: TRIVENI COMPLEX, FIRST FLOOR, ABIDS, HYDERABAD
O.A.NO. 562 OF 2024
BETWEEN:
PEGASUS ASSETS RECONSTRUCTION PRIVATE LIMITED, Acting in its Capacity of Trustee of Pegasus Group 39 Trust 1, Having its Registered Office at 55-56, 5th Floor, Free Press House, Nariman Point, Mumbai-400021. Representative Office at: Flat No.1-C, First Floor, H.M.H Plaza, New No.56(o) 105, G.N Chetty Road, T Nagar, Chennai-600017. Regus Business Centre at 1-10-39 to 44, Level-4, Gumidelli Towers, Begumpet, Hyderabad-500016, Represented by its Authorized Signatory, MAHESH KUMAR, S/o Jayanna, Aged 44 years, Occ: Senior Manager of Applicant.
... APPLICANT
AND
1. SYED MASTHAN BABULA, S/o Syed Ammeer Basha, Aged: 49 Years, Occ: Business,
2. MAHAMMED NEESHMA, W/o Syed Masthan Babula, Aged: 33 Years, Occ: Business, Both are R/o Flat No. 201, Bankers Chambers, A.S Raju Nagar, Kukatpally, Hyderabad – 500072.
AND H.No.8-3-293-82/A/117/1, Road No.10, Jubilee Hills, Hyderabad-500033.
AND Flat No.501, 501/A, 502, H.No.6-2-976/501, H.No.6-2-976/501/A, H.No.6-2-976/502, 5th Floor, Pavani Estates Captol, Block No.2, Rajbhavan Road, Khairtabad, Hyderabad-500082
... DEFENDANTS
To,
1. SYED MASTHAN BABULA, S/o Syed Ammeer Basha Aged: 49 Years, Occ: Business,
2. MAHAMMED NEESHMA, W/o Syed Masthan Babula, Aged: 33 Years, Occ: Business, Both are R/o Flat No. 201, Bankers Chambers, A.S Raju Nagar, Kukatpally, Hyderabad – 500072.
AND H.No.8-3-293-82/A/117/1, Road No.10, Jubilee Hills, Hyderabad-500033.
AND Flat No.501, 501/A, 502, H.No.6-2-976/501, H.No.6-2-976/501/A, H.No.6-2-976/502, 5th Floor, Pavani Estates Captol, Block No.2, Rajbhavan Road, Khairtabad, Hyderabad-500082.
NOTICE
Please take notice that the Applicant had filed the above O.A seeking to direct the Defendants jointly and severally liable to pay an amount of Rs.4,61,16,172.32/- towards Loan Account Nos.809001473321 & 809001473383 and others reliefs sought therein. The Hon'ble Debt Recovery Tribunal-II posted the above O.A on 19.05.2025 for your appearance.
Hence make it convenient to appear before the Hon'ble Debt Recovery Tribunal-II on 19.05.2025 at 10:30 A.M. either personally or through authorized Counsel or otherwise the matter will be adjudicated in due process of law.
Hence, this NOTICE.
[BY ORDER OF THE HON'BLE DEBT RECOVERY TRIBUNAL-II]
VEERA SHIVA KUMAR, ADVOCATE

BEFORE THE HON'BLE DEBTS RECOVERY TRIBUNAL-II, AT: TRIVENI COMPLEX, FIRST FLOOR, ABIDS, HYDERABAD
O.A.NO. 563 OF 2024
BETWEEN:
PEGASUS ASSETS RECONSTRUCTION PRIVATE LIMITED, Acting in its Capacity of Trustee of Pegasus Group 39 Trust 1, Having its Registered Office at 55-56, 5th Floor, Free Press House, Nariman Point, Mumbai-400021. Representative Office at: Regus Business Centre at 1-10-39 to 44, Level -4, Gumidelli Towers, Begumpet, Hyderabad-500016.Represented by its Authorized Signatory, MAHESH KUMAR, S/o Jayanna, Aged 44 years, Occ: Senior Manager of Applicant.
... APPLICANT
AND
1. M/S HARI SHANKAR PAPER PRODUCTS PVT LTD, Represented by Shiva Shankar Thaparia, 1st Floor, Plot No.409, Sy.No.127/1, Sai Krupa Market, Mahaboob Mansion, Hyderabad-500036.
2. M/S ABHISHEK ENTERPRISES, 1st Floor, Plot No.411 & 412, Sy.No.127/1, Sai Krupa Market, Mahaboob Mansion, Hyderabad-500036.
3. RAM KISHORE TAPARIA, Aged about 52 Years, Occ: Business, R/o H.No.5-9-46/1, 2nd Floor, Sri Sai Queens Stones Palace, Basheer Bagh, Near Kirloskar Hospital, Hyderabad-500029.
4. SHIVA SHANKAR TAPARIA, Aged about 50 Years, Occ: Business, R/o H.No.5-9-46/1, 2nd Floor, Sri Sai Queens Stones Palace, Basheer Bagh, Near Kirloskar Hospital, Hyderabad-500029.
5. MANJU DEVI TAPARIA, Aged about 50 Years, Occ: Housewife, R/o H.No.5-9-46/1, 2nd Floor, Sri Sai Queens Stones Palace, Basheer Bagh, Near Kirloskar Hospital, Hyderabad-500029. AND H.No.8-2-413/1/A, Road No.4, Banjara Hills, Hyderabad-500034.
6. MAHADEV RARTHI, Aged about 33 Years, Occ: Home Maker, R/o H.No.5-9-46/1, 2nd Floor, Sri Sai Queens Stones Palace, Basheer Bagh, Near Kirloskar Hospital, Hyderabad-500029.
7. SARALA TAPARIA, R/o H.No.5-9-46/1, 2nd Floor, Sri Sai Queens Stones Palace, Basheer Bagh, Near Kirloskar Hospital, Hyderabad-500029.
... DEFENDANTS
To,
1. M/S HARI SHANKAR PAPER PRODUCTS PVT LTD, Represented by Shiva Shankar Thaparia, 1st Floor, Plot No.409, Sy.No.127/1, Sai Krupa Market, Mahaboob Mansion, Hyderabad-500036.
2. M/S ABHISHEK ENTERPRISES, 1st Floor, Plot No.411 & 412, Sy.No.127/1, Sai Krupa Market, Mahaboob Mansion, Hyderabad-500036.
3. RAM KISHORE TAPARIA, Aged about 52 Years, Occ: Business, R/o H.No.5-9-46/1, 2nd Floor, Sri Sai Queens Stones Palace, Basheer Bagh, Near Kirloskar Hospital, Hyderabad-500029.
4. SHIVA SHANKAR TAPARIA, Aged about 50 Years, Occ: Business, R/o H.No.5-9-46/1, 2nd Floor, Sri Sai Queens Stones Palace, Basheer Bagh, Near Kirloskar Hospital, Hyderabad-500029.
5. MANJU DEVI TAPARIA, Aged about 50 Years, Occ: Housewife, R/o H.No.5-9-46/1, 2nd Floor, Sri Sai Queens Stones Palace, Basheer Bagh, Near Kirloskar Hospital, Hyderabad-500029. AND H.No.8-2-413/1/A, Road No.4, Banjara Hills, Hyderabad-500034.
6. MAHADEV RARTHI, Aged about 33 Years, Occ: Home Maker, R/o H.No.5-9-46/1, 2nd Floor, Sri Sai Queens Stones Palace, Basheer Bagh, Near Kirloskar Hospital, Hyderabad-500029.
7. SARALA TAPARIA, R/o H.No.5-9-46/1, 2nd Floor, Sri Sai Queens Stones Palace, Basheer Bagh, Near Kirloskar Hospital, Hyderabad-500029.
NOTICE
Please take notice that the Applicant had filed the above O.A seeking to direct the Defendants jointly and severally liable to pay an amount of Rs.11,51,04,543.87/- towards Loan Account Nos.809000446706 & 809000919734 and others reliefs sought therein. The Hon'ble Debt Recovery Tribunal-II posted the above O.A on 19.05.2025 for your appearance.
Hence make it convenient to appear before the Hon'ble Debt Recovery Tribunal-II on 19.05.2025 at 10:30 A.M. either personally or through authorized Counsel or otherwise the matter will be adjudicated in due process of law.
Hence, this NOTICE.
[BY ORDER OF THE HON'BLE DEBT RECOVERY TRIBUNAL-II]
Sd/- VEERA SHIVA KUMAR, ADVOCATE

వార్త

శారీరక సామర్థ్యం ద్వారా మనకు బలం రాదు. అణచిపెట్టలేనంతటి ఆత్మబలం ద్వారానే అది లభిస్తుంది.

-వివేకానందుడు

# కాలుష్య భారతం!

కాలుష్య నివారణకై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆచరణయోగ్యంకాని విధానాలతో ప్రయోగాలు చేస్తూ రోజురోజుకు సమస్యను మరింత జటిలం చేస్తున్నాయి. అన్నింటికంటే ముఖ్యంగా పాలకులు కాలుష్య నివారణకు రూపొందిస్తున్న నిబంధనలను, చట్టాలను త్రికరణశుద్ధిగా అమలు చేయకపోవడంతో పర్యావరణం విషతుల్యంగా మారుతున్నది. దేశవ్యాప్తంగా కోట్లాది మంది అనేకవ్యాధులకు లోనవుతున్నారు. మరెందరో దీర్ఘకాలిక వ్యాధుల బారినపడి మంచానికి పరిమితమై అసువులు బాస్తున్నారు. అంతకంతకు కాలుష్య మేఘాలు కమ్ముకోవడం ఆందోళన కలిగించేఅంశం. ప్రధానంగా నగరాల పరిస్థితి మరింత దారుణంగా తయారవుతున్నది. దేశరాజధాని ఢిల్లీలో వాయుకాలుష్యం అదుపు తప్పిపోతున్నది. కేవలం వాయుకాలుష్యం కారణంగా పాఠశాలలకు ఏకంగా సెలవులు ప్రకటించాల్సిన దురదృష్టపు పరిస్థితులు దాపురిస్తున్నాయి. దేశ రాజధాని ఢిల్లీలోనే కాదు అనేక నగరాలలో కాలుష్య పరిస్థితి ప్రమాదకర స్థాయికి చేరుకుంటున్నదని వార్తలు కలవరపరుస్తున్నాయి. కోల్‌కతా, ముంబాయి, నగరాలతోపాటు దక్షిణాదిన బెంగళూరు, హైదరాబాద్, చెన్నైలోనూ వాయు నాణ్యత క్షీణిస్తున్నది. పర్యావరణం నీటి, గాలి నాణ్యత వాతావరణంలో మార్పులు అటవీ విస్తీర్ణం, చెత్త నిర్వహణ, తదితర అంశాలపై దేశంలోనే ప్రముఖ నగరాల్లో జరిపిన సర్వేలో వాయుకాలుష్యం నగరజీవి ఊపిరితిత్తులకు తూట్లు పొడుస్తున్నదనే విషయం వెలుగు చూసింది. కొన్ని నగరాల్లో వాయుకాలుష్యం తీవ్రంగా ఉన్నట్లు వెల్లడయింది. మరికొన్ని నగరాల్లో పారిశ్రామిక కాలుష్యం అగ్రస్థానంలో ఉంది. హైదరాబాద్ నగరంలో నీటి, వాయు కాలుష్యంతోపాటు నిర్మాణరంగం వల్ల పీల్చేగాలిలో ధూళి కణాలు అధికంగా ఉన్నట్లు బయటపడ్డాయి. గ్రామాల నుండి నగరాలకు వలసలు పెరిగిపోవడం ఒక క్రమబద్ధ ప్రణాళిక లేకుండా కాలనీలు వెలుస్తున్నాయి. మురికివాడల నిర్మూలనకు ప్రత్యేక కార్యక్రమాలు తీసుకుంటున్నా పెరిగిపోతున్న కాలనీలఅవసరాలు తీర్చలేకపోతున్నాయి. కాలుష్యాన్ని తగ్గించేందుకు చేస్తున్న ప్రయత్నాలు అంతగా సఫలీకృతం కావడం లేదు. 2019లో భారత్ ఎంపిక చేసిన 102 నగరాల్లో ధూళికణాలు ముప్పును ఇరవై నుండి ముప్పై శాతంమేర తగ్గించడానికి జాతీయ వాయు శుద్ధి కార్యక్రమం ఆరంభించారు. ఆ తర్వాత క్రమేపీమరో ముప్పై నగరాలకు విస్తరించారు. 2025-26 నాటికి సూక్ష్మ కణాలను నలభైశాతం దాకా నియంత్రిస్తామంటూ లక్ష్యాన్ని నిర్ణయించుకొని ఏడువేల కోట్ల రూపాయలకు పైగా వెచ్చించినా పెద్దగా మార్పురాలేదు. పంజాబ్, పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర, యుపి, తదితర రాష్ట్రాల్లో నిబంధనలను పట్టించుకోవడం లేదు. ప్రపంచవ్యాప్తంగా కూడా కాలుష్యం పరిస్థితి ఆందోళనకరంగానే ఉన్నది.


ప్రపంచ వాయుస్థితి నివేదిక ప్రకారం 2021లో ప్రపంచ వ్యాప్తంగా ఎనభైఒక్క లక్షల మంది కేవలం వాయుకాలుష్యం వల్లనే అసువులు కోల్పోయారు. మరణించిన వారిలో దాదాపు ఇరవైశాతం మంది భారతీయులే ఉన్నారు. భారతదేశంలో ప్రతిరోజూ నాలుగువందల అరవైనాలుగు మంది పసిపిల్లలు వాయుకాలుష్యానికి బలైపోతున్నారని ఆ నివేదిక వెల్లడించింది. అంతర్జాతీయంగా ముఖ్యంగా చైనా, అమెరికా లాంటి దేశాలు వాయుకాలుష్యాన్ని నియంత్రించడంలో సఫలీకృతం అవుతున్నట్లు అనేక అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. కాలుష్యానికి మూలమైన దాదాపు ఐదువందలకుపైగా కార్ల మోడళ్లను నిషేధించి ప్రజారవాణా వ్యవస్థను కాలుష్యరహితంగా మార్చేందుకు చైనా తీసుకున్న చర్యలు సత్ఫలితాలను ఇచ్చాయి. బొగ్గు ఆధారిత విద్యుత్ కర్మాగారాల నిర్మాణాలకు దాదాపు ఫుల్‌స్టాప్ పెట్టింది. అడవుల సంరక్షణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లతో ప్రత్యేక దృష్టిసారిస్తున్నది. మనదేశంలో పర్యావరణాన్ని కాలుష్యం చేస్తూ మోతాదుకు మించి పొగను వదులుతున్నవారి సంఖ్య కోట్లసంఖ్యలో ఉండొచ్చు. వాటిని నియంత్రించేందుకు ఎన్నో చట్టాలు తీసుకువచ్చారు. నిబంధనలను విధించారు. జరిమానాలు వేస్తున్నారు. అయినా యేడాది యేడాదికి కాలుష్యం పెరిగిపోతూనే ఉన్నది. వాతావరణంలో కార్బన్ మోనాక్సైడ్, నైట్రిక్ ఆసిడ్, దుమ్ముధూళి అదుపు తప్పుతున్నది. పెట్రోలు, డీజిల్ లాంటి ఇంధనాల్లో జరుగుతున్న కల్తీ కూడా ఈ కాలుష్యాన్ని మరింత పెంచుతున్నది. ఈకల్తీని నిరోధించేందుకు అధికారగణం తీసుకుంటున్న చర్యలు ఫలితాలు ఇవ్వడం లేదు. మొత్తంమీద తీవ్రస్థాయిలోవెలువడుతున్న విషవాయువుల వల్ల పర్యావరణం విషతుల్యమై ప్రజారోగ్యాన్ని కాటేస్తున్నది. గతంలో ఒక విశ్వవిద్యాలయ పర్యావరణ పరిశోధన శాస్త్రజ్ఞులు చేసిన అధ్యయనంలో 132 దేశాలకంటే భారత్ అట్టడుగునున్నట్లు వెల్లడైంది. భారత్‌లో ధూళికణాలు ఉండాల్సిన స్థాయి కన్నా అధికంగా ఉండి శ్వాసకోస సమస్యల నుండి కేన్సర్‌దాకా అనేక వ్యాధులకు కారణమవుతున్నాయని ఆ నివేదిక వెల్లడించింది. ప్రత్యేకించి భావిభారత బాలబాలికల బతుకు దీపాలను కాలుష్యం చిదిమేస్తున్నట్లు బయటపడుతుంది. వాయుకాలుష్యం మంచి కొలెస్ట్రాల్‌ను చెడు కొలెస్ట్రాల్‌గా మారుస్తూ గుండెజబ్బులకు కారణమవుతూ పక్షవాతానికి, ఊపిరితిత్తులకు కేన్సర్‌కు మూలమవుతుందనే విషయం ఆ పరిశోధనల్లో బయటపడింది. ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్న ఈ కాలుష్యభూతాన్ని నియంత్రించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. సమస్య తీవ్రతను గుర్తించి నివారణకు ఆచరణయోగ్యమైన విధానాలను ప్రకటించడమేకాదు అమలుకు త్రికరణశుద్ధిగా కృషి చేయాలి. అన్నింటికంటే ముఖ్యంగా పర్యావరణంపట్ల అన్ని వర్గాల ప్రజల్లో అవగాహన పెంచేందుకు ప్రయత్నం చేయాలి.

పొగిడేవారు లేనప్పుడు, కష్టాలు చుట్టుముట్టినప్పుడు మనల్ని మనం బాగా తెలుసుకోగలం.



శామ్యూల్ జాన్సన్

తన కోపాన్ని అదుపులో పెట్టుకోలేనివాడు తన మనస్సును శరీరాన్ని కూడా అదుపు చేయలేడు.



బైరన్

# భవిష్యత్తు పునరుత్పాదక వనరులదేనా?

**పారిశ్రామిక కాలుష్యాన్ని నియంత్రించడానికి కఠినమైన నిబంధనలు రూపొందించడమేకాదు! వాటిని సమర్థవంతంగా అమలు చేయాలి. నీటి సంరక్షణ పద్ధతులను అవలంబించాలి. కాలుష్య నివారణ చర్యలు చేపట్టాలి. 'చిన్న చిన్న రాళ్లే పెద్ద కొండను చేస్తాయి' అన్నట్లుగా ప్రతి ఒక్కరూ తమవంతు కృషి చేస్తే గొప్ప మార్పును తీసుకురావచ్చు. స్థిరమైన శక్తి వనరులను అభివృద్ధి చేయడం, శక్తి సామర్థ్యాన్ని పెంచడం, సహజ వనరులను బాధ్యతాయుతంగా ఉపయోగించి మన భూమిని కాపాడుకోవచ్చు. భవిష్యత్ తరాలకు సురక్షితమైన, ఆరోగ్యకరమైన ప్రపంచాన్ని అందించగలం. 'మనం మారితేనే యుగం మారుతుంది' అని గుర్తుంచుకోవాలి. 'చేయి కలిపితేనే విజయం'. ప్రభుత్వం, పరిశ్రమలు, ప్రజలందరూ కలిసి పనిచేస్తేనే స్వచ్ఛమైన శక్తి రంగంలో స్థిరమైన అభివృద్ధిని సాధించగలం.**

డి జె మోహన రావు

తల్లిని మించిన దైవం లేదు, భూమిని మించిన స్వర్గం లేదు. మన జీవనాధారమైన ఈ భూమిని కాపాడుకోవడం మనందరి కర్తవ్యం. తల్లి భూమిని కాపాడుకుంటేనే మనం సుఖంగా ఉండగలం. మన భూమి ఆరోగ్యం, మన శక్తి భవిష్యత్తు పరస్పరం ముడిపడి ఉన్నాయి. పునరుత్పాదక వనరులు అనగా సహజంగా తిరిగి నింపబడే శక్తి వనరులు. వీటిలో సౌరశక్తి (సూర్యకాంతి నుండి లభించే శక్తి), పవనశక్తి (గాలినుండి లభించేశక్తి), జలవిద్యుత్ (నీటి ప్రవాహం నుండి లభించేశక్తి), బయోమాస్ (సేంద్రియ పదార్థాల నుండి లభించేశక్తి), భూఉష్ణశక్తి (భూమి అంతర్గత వేడి నుండి లభించేశక్తి) ముఖ్యమైనవి. ఈ వనరులు శిలాజ ఇంధనాల (బొగ్గు, చమురు, సహజ వాయువు) వలె కాకుండా వినియోగించిన తర్వాతకూడా తిరిగి ఉత్పత్తి అవుతాయి. కాబట్టి ఇవి పర్యావరణానికి తక్కువ హాని కలిగిస్తాయి. దీర్ఘకాలికంగా స్థిరమైన శక్తిని అందిస్తాయి. మన దేశంలో పునరుత్పాదక వనరుల శాతం, భవిష్యత్తు ప్రణాళికలు పరిశీలిస్తే, ప్రస్తుతం భారతదేశంలో మొత్తం విద్యుత్ ఉత్పత్తిలోపునరుత్పాదక వనరుల వాటా గణనీయంగా పెరుగుతోంది. 2024నాటికి ఇది సుమారుగా 42శాతానికి చేరుకుంది (ఇందులో పెద్ద జలవిద్యుత్ ప్రాజెక్టులు కూడా ఉన్నాయి). అయితే సౌర,పవన శక్తి వంటి ఇతర పునరుత్పాదక వనరుల వాటా ఇంకా తక్కువగా ఉంది. కానీ వేగంగా పెరుగుతోంది. భారతదేశం 2030నాటికి తన విద్యుత్ ఉత్పత్తిలో పునరుత్పాదక వనరుల వాటాను 50 శాతానికి పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ లక్ష్యాన్ని సాధించడానికి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోంది. అవి పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులలో పెట్టుబడులు పెట్టడానికి ఆర్థిక ప్రోత్సాహకాలు, రాయితీలు అందిస్తోంది. సౌర, పవన విద్యుత్ ఉత్పత్తిని పెంచడానికి అనుకూలమైన విధానాలను రూపొందిస్తోంది. పునరుత్పాదక ఇంధన వనరుల నుండి ఉత్పత్తి అయిన విద్యుత్‌ను సరఫరా చేయడానికి అవసరమైన గ్రిడ్ మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తోంది. కొత్త, మెరుగైన పునరుత్పాదక ఇంధన సాంకేతికతలను అభివృద్ధి చేయడానికి పరిశోధన అభివృద్ధి కార్యక్రమాలకు మద్దతు ఇస్తోంది. "నేడు నాటిన విత్తనం రేపటి ఫలం' అన్నట్లుగా పునరుత్పాదక ఇంధన రంగంలో మనం చేసే పెట్టుబడులు భవిష్యత్తులోస్వచ్ఛమైన శక్తిని, ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందిస్తాయి. పునరుత్పాదక ఇంధన రంగంలో పెట్టుబడులను పెంచడం, సౌర, పవన, జల, బయోమాస్ వంటి స్వచ్ఛమైన ఇంధన వనరుల అభివృద్ధి వినియోగాన్ని ప్రోత్సహించడం, స్థిరమైన వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడం, పర్యావరణానికి హాని కలిగించని నేల ఆరోగ్యాన్ని కాపాడే వ్యవసాయ విధానాలను అవలంబించడం, హరిత రవాణా వ్యవస్థను అభివృద్ధి చేయడం, స్థిరమైన వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడం, పర్యావరణానికి హాని కలిగించని నేల ఆరోగ్యాన్ని కాపాడే వ్యవసాయ విధానాలను అవలంబించడం, ఎలక్ట్రిక్ వాహనాలు, ప్రజా రవాణా వ్యవస్థలను ప్రోత్సహించడం ద్వారా కర్బన ఉద్గారాలను తగ్గించడం, వృత్తాకార ఆర్థిక వ్యవస్థను ప్రోత్సహించడం, వ్యర్థాలను తగ్గించడం, వస్తువులను తిరిగి ఉపయోగించడం, రీసైక్లింగ్‌ను ప్రోత్సహించడం ద్వారా సహజ వనరులపై ఒత్తిడిని తగ్గించడం, పర్యావరణ పరిరక్షణ సాంకేతికతల్లో పెట్టుబడులను ఆకర్షించడం, పునరుత్పాదక ఇంధనరంగంలో పెట్టుబడులను పెంచడం, సౌర, పవన, జల, బయోమాస్ వంటి స్వచ్ఛమైన ఇంధన వన



రుల అభివృద్ధి, వినియోగాన్ని ప్రోత్సహించడం. కాలుష్యాన్ని తగ్గించే వనరులను సమర్థవంతంగా ఉపయోగించే కొత్త సాంకేతికతలను అభివృద్ధి చేయడం, అమలు చేయడం, లాంటి లక్ష్యాలున్నాయి. 2025 నాటికి ఈ దినోత్సవ లక్ష్యాలు మరింత నిర్దిష్టమైన చర్యలపై దృష్టిసారిస్తున్నాయి. ఇందులో పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగాన్ని పెంచడం, ప్లాస్టిక్ కాలుష్యాన్ని తగ్గించడం, అటవీ నిర్మూలనను అరికట్టడం, నీటి వనరులను సంరక్షించడం, జీవ వైవిధ్యాన్ని కాపాడటం వంటి అంశాలున్నాయి. దేశం తన జిడిపిలో సుమారు 2.5శాతం పర్యావరణ క్షీణతవల్ల నష్టపోతోందని అంచనా. పునరుత్పాదక ఇంధన వనరులలో పెట్టుబడులు పెట్టడం, స్థిరమైనపద్ధతులను అవలంబించడం, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా మనం ఆరోగ్యకరమైన భవిష్యత్తును నిర్మించగలం. అయితే సౌర, పవనశక్తి వంటి వనరులు వాతావరణ పరిస్థితులపై ఆధారపడి ఉంటాయి. నిరంతరాయంగా విద్యుత్‌సరఫరాను నిర్ధారించడం ఒక సవాలు. పెద్దఎత్తున పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టుల కోసం తగినంత భూమిని గుర్తించడం, సేకరించడం కష్టంగా ఉంది. ఉత్పత్తి అయిన పునరుత్పాదక శక్తిని నిల్వ చేయడానికి సమర్థవంతమైన సరసమైన సాంకేతికతలను అభివృద్ధి చేయడం మరో సవాలు. పేదరికం నిరక్షరాస్యత వల్ల ప్రజల్లో పర్యావరణ స్పృహ తక్కువగా ఉండటం ఒక ప్రధాన సమస్య. అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ కావడంతో, పర్యావరణ నిబంధనలను అమలు చేయడంలో ఆర్థికాభివృద్ధిని కొనసాగించడంలో సమతుల్యతను సాధించడం కష్టంగా మారుతోంది. అంతే కాకుండా పర్యావరణ పరిరక్షణ కోసం కేటాయించే నిధులు, సాంకేతిక పరిజ్ఞానం కూడా పరిమితంగా ఉన్నాయి. "ఒక వైపు ఏరు, ఒకవైపు పులి' లా అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ రెండింటినీ సమన్వయం చేయడం ఒక క్లిష్టమైనపని. దేశంలో సుమారుగా 17శాతం అటవీ ప్రాంతం ఉంది. అయితే పెరుగుతున్న జనాభా, అభివృద్ధి ప్రాజెక్టుల కారణంగా ఈ శాతం తగ్గుముఖం పడుతోంది. "చెట్టు లేని చోట గాలి లేదు, నీరు లేదు, సుఖం లేదు" అని గుర్తించాలి. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం, ప్రపంచంలోని అత్యంత కాలుష్యపూరితమైన 30 నగరాల్లో 21 భారతదేశంలోనే ఉన్నాయి. "పొగలేని ఊరు, రోగం లేని మనిషి అరుదు" అనే సామెత ప్రస్తుత పరిస్థితికి అద్దంపడుతోంది. నీటి కొరత దేశంలో ఒకతీవ్రమైన సమస్యగా మారుతోంది. నీతిఆయోగ్ నివేదిక 2030నాటికి దేశంలోని అనేక ప్రాంతాలుతీవ్రమైన నీటి ఎద్దడిని ఎదుర్కొంటాయి అని తెలిపింది. ఈ సవాళ్లను అధిగమించడానికి సమగ్రమైన వ్యూహాలను అమలు అవసరం. "నీరు లేని జీవితం నిస్సారం" అని గ్రహించాలి. "ఆదాయం కంటే ఆరోగ్యం మిన్న' అన్నట్లుగా పర్యావరణాన్ని కాపాడుకోవడం ఆర్థికంగా కూడా లాభదాయకం. పునరుత్పాదక శక్తిని సమర్థవంతంగా అనుసంధానించడానికి స్మార్ట్ గ్రిడ్ సాంకేతికతలను అభివృద్ధి చేయాలి. గ్రిడ్‌పై ఒత్తిడిని తగ్గించేందుకు చిన్నతరహా పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులను ప్రోత్సహించాలి. బ్యాటరీ, ఇతర శక్తినిల్వ సాంకేతికతలలో పెట్టుబడులు పెట్టాలి. ఇతర దేశాల సాంకేతిక పరిజ్ఞానాన్ని పంచుకోవాలి. వీటికి సమగ్రమైన, దీర్ఘకాలిక పరిష్కారాలను అమలుచేయడం అవసరం. శిలాజ ఇంధనాలపై ఆధారపడటాన్ని తగ్గించి సౌర, పవన, జల విద్యుత్ లాంటి పునరుత్పాదక ఇంధనవనరుల వినియోగాన్ని ప్రోత్సహించాలి. పారిశ్రామిక కాలుష్యాన్ని నియంత్రించడానికి కఠినమైన నిబంధనలు రూపొందించడమేకాదు!వాటిని సమర్థవంతంగా అమలు చేయాలి. నీటి సంరక్షణ పద్ధతులను అవలంబించాలి. కాలుష్య నివారణ చర్యలు చేపట్టాలి. 'చిన్న చిన్న రాళ్లే పెద్ద కొండను చేస్తాయి' అన్నట్లుగా ప్రతి ఒక్కరూ తమవంతు కృషి చేస్తే గొప్ప మార్పును తీసుకురావచ్చు. స్థిరమైన శక్తి వనరులను అభివృద్ధి చేయడం, శక్తి సామర్థ్యాన్ని పెంచడం, సహజ వనరులను బాధ్యతాయుతంగా ఉపయోగించి మన భూమిని కాపాడుకోవచ్చు. భవిష్యత్ తరాలకు సురక్షితమైన, ఆరోగ్యకరమైన ప్రపంచాన్ని అందించగలం. 'మనం మారితేనే యుగం మారుతుంది' అని గుర్తుంచుకోవాలి. 'చేయి కలిపితేనే విజయం'. ప్రభుత్వం, పరిశ్రమలు, ప్రజలందరూ కలిసి పనిచేస్తేనే స్వచ్ఛమైన శక్తి రంగంలో స్థిరమైన అభివృద్ధిని సాధించగలం. •

# ఆల్కహాల్ మత్తు వదిలేదెలా?

ఎల్. ఉపేందర్

ఆల్కహాల్ సేవించడం అనేది ఆయా దేశాల భిన్న సంస్కృతులు, నియమాలు, అక్కడి ప్రభుత్వాలా పాలసీల మీద ఆధారపడి ఉంటుంది. అందులో భాగంగానే తెలంగాణలో దేశంలోనే అన్ని రాష్ట్రల కంటే కొంత ముందు వరసలో ఉందని చెప్పవచ్చు. పురుషులు దాదాపు 46శాతం సేవిస్తే, మహిళలు 7శాతం సేవిస్తున్నారు. ఈ విషయంలో తగిన ఆలోచనలు, విశ్లేషణలు అవసరం. మానవ జీవితంలో ఆనందాన్ని అన్వేషించడం సహజం. కానీ కొన్ని సందర్భాల్లో, ఈ ఆనందాన్ని తప్పుదారి పట్టే మార్గాల్లో వెతకడం మన ఆరోగ్యానికే కాకుండా సమాజానికీ ముప్పుగా మారుతుంది. అలాంటి వాటిలో ఆల్కహాల్ మద్యం ఒకటి. ఇది ప్రస్తుత సమాజంలో మత్తుకు ప్రధాన పెనుభూతంగా నిలిచింది. అయితే, ప్రశ్న ఏమిటంటే – ఆల్కహాల్ మత్తుకు మందు ఏది? ఇది కేవలం శరీరాన్ని మాత్రమే కాక, మనస్సు, కుటుంబం, ఉద్యోగం, సమాజం ఇలా అన్ని కోణాల్లోనూ ప్రభావితం చేసే సమస్యగా మారింది. దీనికి పరిష్కారం శాస్త్రీయంగా, మానసికంగా, సమాజపరంగా, ప్రభుత్వ ఆలోచనలను వెతకాల్సిన అవసరంఉంది. ఆల్కహాల్ మత్తు అంటే, మద్యం సేవించడం వల్ల ఏర్పడే శారీరక, మానసిక ప్రభావాలు. మద్యం అతిగా సేవించడం వల్ల కేంద్ర నాడీ వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతుంది. మెదడలోని న్యూరో ట్రాన్స్ మీటర్ల సమతుల్యతను దెబ్బతీస్తుంది. ఫలితంగా మానసిక స్థితిలో మార్పులు వస్తాయి. చురుకుదనం తగ్గిపోవడం, నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం తగ్గిపోవడం, స్థిరత్వం లేకపోవడం, దీర్ఘకాలంలో కాలేయం, గుండె, జీర్ణ వ్యవస్థ వంటి అవయవాలు కిడ్నీ, మెదడు వంటి అవయవాలను దెబ్బతీయగలదు. మానసికంగా డిప్రెషన్, ఎంగ్జైటీ వంటి సమస్యలకు కారణం అవుతుంది. చాలామందిమొదట మద్యం తాగడం ని 'ట్రై చేయడం'గా చూస్తారు. ఇది కొన్ని సందర్భాల్లో సరదా, ఒత్తిడి నుంచి రిలీఫ్ అనే మాయా భ్రమతో మొదలవుతుంది. స్నేహితులు, కుటుంబ సభ్యులు లేదా సినిమా, టీవీ మీడియా ప్రభావంవల్ల కూడా మద్యం వైపు ఆకర్షణ పెరుగుతుంది. ఒత్తిడి, డిప్రెషన్, ఉద్యోగ ఒత్తిడి, కుటుంబ సమస్యలు వంటి వాటినుంచి తప్పించుకోవడానికి తాత్కాలిక ఉపశమనం కోసం మద్యం వైపు వెళ్తున్నారు. మత్తు నుంచి బయటపడాలంటే మందు ఏంటి? ఆల్కహాల్ మత్తుకు మందు శారీరకంగా మాత్రమే కాకుండా మానసిక, సామాజిక కోణాల్లోనూ ఉండాలి. కాబట్టి దీన్ని విస్తృతంగా నాలుగు ప్రధాన మార్గాల్లో చూడొచ్చు. స్వీయ అవగాహన అవసరం. ముందుగా, మత్తు వల్ల కలిగే నష్టాన్ని పూర్తిగా గ్రహించాలి. ఇది జీవితాన్ని ఎలా నాశనం చేస్తుందో తెలుసుకోవాలి. ఒకసారి స్పష్టమైన అవగాహన వస్తే, మానసికంగా దాన్ని నివారించేందుకు చొరవ తీసుకోవచ్చు. "నాకు ఇది అవసరమా?' అనే ప్రశ్నను రోజూ అడుగుకుంటూ మద్యం మీద ఆధారపడే అలవాట్లను విడిచిపెట్టడం మొదలు పెట్టాలి. బాధ్యతాయుతంగా చెప్పాలంటే, ఆల్కహాల్ మత్తుకు శరీరంలో సహాయపడే కొన్ని ఔషధాలు ఉన్నాయి. ఇవి డిటాక్స్ ట్రీట్మెంట్ నుంచి బిహేవియరల్ థెరపీవరకు విస్తరించబడ్డాయి. ఉదాహరణకు నాల్ట్రెక్సోన్ ఇది మద్యం తాగాలనే ఆకాంక్షను తగ్గిస్తుంది. ఆకంప్రోసేట్ మానసికంగా మద్యం మీద ఉన్న ఆధారాన్ని తగ్గించేందుకు సహాయపడుతుంది. డిసల్ఫిరామ్ మద్యం తాగిన తర్వాత శరీరంలో అసహన ప్రభావాలను కలిగించే ఔషధం. ఈ మందులను వైద్యుల పర్యవేక్షణలోనే వాడాలి. స్వీయ వైద్యం ప్రమాదకరం. కౌన్సెలింగ్, థెరపీ ఒక వ్యక్తి మత్తునుంచి బయట పడాలంటే, అతని మనస్తత్వాన్ని మార్చడం అత్యవసరం. మానసిక ఆరోగ్య నిపుణుల సహాయంతో కౌన్సెలింగ్ తీసుకోవడం, థెరపీలకు హాజరవడం వలన మత్తుకు పునరాగమనాన్ని అడ్డుకోవచ్చు. సైకోథెరపీ, బిహేవియరల్ థెరపీ, వంటి విధానాలు ఎంతోప్రయోజనకరంగా ఉంటాయి. సమాజ, కుటుంబ మద్దతు వ్యక్తి పునరుద్ధరణలో కుటుంబం, స్నేహితుల పాత్ర ఎంతోకీలకం. వారికి మద్దతుగాఉండటం, విముఖత చూపకుండా సానుకూలంగా సహాయం చేయడం, అతనిలో మార్పురావడానికి ఆత్మవిశ్వాసం నింపడం అవసరం. అలాగే, సమాజస్థాయిలో మత్తు వ్యసనంపై అవగాహన కల్పించేందుకు కార్యక్రమాలు నిర్వహించాలి. ధ్యానం, యోగా, ఇవి మానసికంగా స్థిరత కలిగించి మత్తు మీద ఉన్న ఆకర్షణను తగ్గిస్తాయి. ఇది మత్తుమీద ఉన్న మక్కువను తగ్గించుతుంది. అవసరమైన సందర్భాల్లో రిహాబిలిటేషన్ సెంటర్లు, డీఅడిక్షన్ సెంటర్ల సహాయం తీసుకోవాలి. ప్రజల మానసిక, ఆరోగ్యస్థితులను బట్టి ప్రభుత్వాల ప్రచారాలు ఉండాలి. కట్టుదిట్టమైన ఏర్పాట్లు జరగాలి. ఆల్కహాల్ మత్తుకు మందు ఏది?' అనేది కేవలం ఔషధంపైనో, ప్రభుత్వాల పైనో ఉండరాదు. వ్యక్తిగత సంకల్పం, కుటుంబ మద్దతు, వైద్య సహాయం సమాజ కట్టుబాట్లపై ఆధారపడు తుంది. మత్తు నుంచి బయట పడేందుకు శక్తివంతమైన మందు అంటే – అవగాహన, ఆశ, మారాలనే సంకల్పమే. అలాంటి సంకల్పం కలిగినప్పుడు ఎలాంటి మత్తు నుండి అయినా విముక్తి సాధ్యమే. •

# ప్రజావాక్కు



## మాట తప్పటం సరికాదు

ఎమ్.పి.లు అందరు లక్షాధికారులు. కోటీశ్వరులు వారికి జీతాలు కూడా లక్షల్లోఇస్తుంటారు. వాటిని తరచూ పెంచుతుంటారు. వారికి సకల సదుపాయాలు కల్పిస్తారు. రాజభోగాలు అందిస్తారు. వారికి ఏచిన్న కష్టం రాకుండా చూస్తారు. అదే పేదవారికి సాయం చేయడానికి పాలకులకి మనసు రాదు. పది రూపాయలు ఇవ్వాలంటే పదిసార్లు ఆలోచిస్తారు. ఎన్నో ఆంక్షలుపెడతారు. సవాలక్ష కారణాలు చూపుతారు. ఎలాగోలా ఎగొట్టాలనిచూస్తారు. వారి ఖాతాల్లో 15 లక్షలు జమ చేయడం, పెన్షన్లను నాలుగువేలకు పెంచుతామనటం అంతా ఒట్టిదే. ఇచ్చిన మాట తప్పటం రాజకీయ నాయకులకు వెన్నతో పెట్టిన విద్య.

- ఎం.శ్రీనివాస్, హైదరాబాద్

## ఎస్జిటీలను నియమించాలి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మోడల్ ప్రైమరీ స్కూల్‌లలో ప్రధానోపాధ్యాయులుగా సెకండరీ గ్రేడ్‌టీచర్లను మాత్రమే నియమించాలి. 6,7,8 తరగతుల ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌లను నియమించాలి. ఉన్నత పాఠశాలల్లో ప్రాథమిక తరగతులకు ప్రతిపాదించిన ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తిప్రకారమే పోస్టులు కేటాయింపును మోడల్ ప్రైమరీ, బేసిక్, ప్రైమరీ ఫౌండేషన్ స్కూళ్లకు వర్తింపజేయాలి. ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తి 1:40 ఉండేలా స్కూల్ అసిస్టెంట్‌లను నియమించాలి.

-వాసిలి సురేష్, నెల్లూరు జిల్లా

## అవకాశవాదులు

కొందరు రాజకీయ నాయకులకి సిద్ధాంతాలు, నైతిక విలువలు అనేవి ఉండవు. గాలిఎటువైపు వీస్తే అటువైపు వెళతారు. పదవుల కోసం ఎవరితోనైనా స్నేహం చేస్తారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీతో కలిసి పనిచేస్తారు. వారి సాయంతో అధికారంలోకి వస్తారు. పదవులు పొందుతారు. ఆనకవారి అడుగులకి మడుగులొత్తుతు ఇంద్రుడని చంద్రుడని పొగడుతారు. బాకాలు ఊదుతూ వారి వెంట తిరుగుతారు. నీరున్న చెరువులోకి కప్పలు సిరిసంపదలు ఉన్నవారి వద్దకు బంధువులు చేరినట్లు ఎవరి వేవ్ ఉంటే వారితో జతకడతారు. రాజకీయాలు ఇలాంటి వారికె అనుకూలంగా ఉంటున్నాయి.

-మిథునం, హైదరాబాద్

## జీవ వైవిధ్యాన్ని కాపాడుదాం

ఆధునిక నిర్మాణాలు, వాతావరణ మార్పుల నేపథ్యంలో చాలా పక్షిజాతులు నశిస్తున్నాయి. అందులో పిచ్చుకలు అంతరించిపోయే పక్షి జాతుల్లో మొదటివరుసలో ఉన్నాయి. నగరీ కరణ, పల్లెల్లో కూడా మారుతున్న జీవన శైలి, పర్యావరణం వల్ల అంతటా ఈ ప్రమాదం ముంచుకు వస్తోంది. దానికి తోడు వాతావరణంలో మార్పులు, విపరీతమైన ఎండలు, తగ్గుతున్న హరితంవల్ల కూడా అవి అంతరించిపోయే దశ వేగవంతంగా తయారైంది. జీవవైవిధ్యం కోల్పోవడం మరిన్ని కొత్త ప్రకృతి పరమైన ఉపద్రవాలకు కారణభూతమోతుంది. ఉదాహరణకు కొన్ని పక్షులు కీటకాల సంతతిని అదుపులో ఉంచుతాయి. తద్వారా పంటల పెరుగుదలకు ఊతమిస్తాయి. ఒకపక్షిజాతిలేదా జంతుజాతి నశిస్తే, దానితోపాటు పర్యావరణ సమతుల్యత అదుపు తప్పుతుంది. మరిన్ని విపరిణామాల్ని మానవాళినెత్తిపై రుద్దుతుంది. కాబట్టిసమాజం అలాంటి విపత్తురాకుండా జాగ్రత్త వహించాలి.

- డా.డి.వి.జి. శంకరరావు, విజయనగరం

## విలువల పతనం

బిజెపి నాయకులకి కావలసింది అధికారం దాని కోసం వారు ఏమయినాచేస్తారు. అడ్డదారుల్లో వెళతారు. అక్రమాలకు పాల్పడ తారు. ఎవరు ఏమనుకున్నా లెక్క చేయరు. రాజ్యాంగానికి వ్యతిరేకంగా పనిచేయడానికి వెనుకాడరు. అనేక రాష్ట్రాలలో వారు నడిపిన రాజకీయాలు గమనిస్తే వారికి అధికార దాహం ఎంతలా ఉందో అర్థం అవుతుంది. పార్టీల మధ్య చీలికలు తెచ్చి లబ్ధిపొందటంలో వారిని మించిన వారు మరొకరు లేరు.

-ఎమ్.ఎస్.శర్మ, హైదరాబాద్

## రుణాలు మంజూరు చేయాలి

ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన రాజీవ్ యువవికాసం పథకం యువకులకు ఒక వెలుగు రేఖ గ్రామీణ ప్రాంత ప్రజలకు ఒక ఆశారేఖ ఒకవైపు కోటి మంది మహిళలను రుణాలు మంజూరు చేస్తూ యువకులకు రుణాలు మంజూరు చేస్తూ రాష్ట్రం సిద్ధించిన జూన్ 2న కొత్త ప్రయానంలోకి యువకులను తీసుకెళ్లే ప్రయత్నం జరుగుతున్నది. యువకులకు వివిధ అవకాశాలు వ్యాపారాలకు అధిపతులు చేసే ప్రయత్నం ఈ పథకం ద్వారా సాగుతుంది. దీనిప్రధాన ఉద్దేశం వినియోగాన్నిపెంచడం ద్వారా ఉత్పత్తికి అవకాశం కల్పించడమే. ఒకవైపు మహిళలకు రుణాల పంపిణీయువతి యువకులకు రుణాలపంపిణీ చేయడం ద్వారా యువ, మహిళ వికాసానికి ప్రభుత్వం ప్రయత్నం చేస్తోంది.

-భారత అవినాష్, జనగామ

మన వి

ఎడిట్ పేజీకి..


ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# పుస్తకం మస్తిష్క వికాస సాధనం!

బి.మధుపాళి

స్మార్ట్‌ఫోన్ వచ్చాక సామాజిక మాధ్యమాల్లోంచి బయట పడడం అసాధ్యంగా తోస్తున్నది. చదవడం అనే కళ క్రమంగా కళావిహీనం అయిపోతున్నది. చదవడం అంటే తెలియని విషయాలను తెలుసుకోవడం, అజ్ఞాన చీకట్ల నుంచి జ్ఞాన వెలుగుల వైపు అడుగులు వేయడం. చదవడానికి ఏకాగ్రత, తపన కావాలి. చదవడాన్ని అమితంగా ఇష్టపడితే ఏకాగ్రత దానంతట అదే వస్తుంది. నేటి డిజిటల్ యుగంలో లుకింగ్ కల్చర్ పెరుగుతూ, రీడింగ్ కల్చర్ సన్నగిల్లుతోంది". ప్రతి నెల లేదా సంవత్సరంలో ఇన్ని పుస్తకాలు చదవాలనే నియమం పెట్టుకోవాలి. పుస్తకాలు కొనడం అలవాటు చేసుకోవాలి. ప్రపంచ పోకడలకు అనుగుణంగా మనం ఎదగడానికి అవసరమైనది చదువు అని నమ్మాలి. విద్యార్థులు పాఠ్య పుస్తకాల చదువుకు తప్పని సరిగా సమయం ఇవ్వాలి. వారు ఇతర ఆసక్తిగల అంశాలకు సంబంధించిన పుస్తకాలను కూడా చదవడం అలవాటు చేసుకోవాలి. పుస్తకాల ప్రాధాన్యం, వాటి అపార శక్తి సామర్థ్యాలను ప్రపంచ మానవాళికి అవగాహన కల్పించేందుకు ప్రతి యేటా 23 ఏప్రిల్ రోజున ప్రపంచ పుస్తకం, కాపీరైట్ దినోత్సవం (వరల్డ్ బుక్ అండ్ కాపీరైట్ డే)" నిర్వహించుకోవడం ఆనవాయితీగా మారింది. 2025 వరల్డ్ బుక్ అండ్ కాపీరైట్ దినోత్సవ ఇతివృత్తంగా ఐరాస సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో సాహిత్య పాత్ర" అని అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహించడం జరుగుతున్నది. ప్రపంచ పుస్తకం, కాపీరైట్ దినోత్సవ వేదికగా విద్య, సాహిత్యం, అవగాహన, సమగ్రాభివృద్ధి సాధనలో పుస్తకాల పాత్ర వెలకట్టలేనిది ప్రచారం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగడం జరుగుతున్నది. చదువును నమ్మినవాడు ఎన్నటికీ చెడిపోడని, మనం నేర్చుకున్న ప్రతి విషయం మనకు జీవితంలో ఎంతగానో ఉపయోగపడుతుందని, విద్యావేత్తలు మాత్రమే సమాజంలో గుర్తింపు, గౌరవాలను పొందుతారని తెలుసుకోవాలి. 'పుస్తకం ఓ నిశ్శబ్ద విజ్ఞాన విస్ఫోటనం' అని గుర్తించిన వారు జీవితంలో ఎత్తు పల్లాలను సునాయాసంగా అధిగమిస్తారు. ప్రముఖుల జీవిత చరిత్రలు చక్కని మార్గాన్ని చూపుతాయి. 'స్వానుభవంతో నేర్చుకున్న వారుఅవివేకులు, ఇతరుల తప్పుడు అనుభవాలతో నేర్చుకున్నవారు వివేకవంతులు" అనే నినాదం విన్నాం. నేను పుస్తకాలు కొన్న తర్వాత డబ్బు మిగిలితేనే తినుబండారాలు కొంటాను" అనే



సూత్రం పాటిస్తూ పుస్తకాలు కొనడానికి, వ్యక్తిగత లైబ్రరీ నిర్వహణకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. చదివితే తెలివి పెరుగుతుంది, మెదడు చురుకుగా పనిచేస్తుంది. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన మేధావుల జీవిత చరిత్రలు మనకు చక్కని మార్గనిర్దేశనం చేస్తూ, ప్రేరణగా నిలుస్తాయి. పుస్తక పఠనంతో విజ్ఞాన సముపార్జన జరిగి సరైన ఉద్యోగం, సమాజంలో గుర్తింపు దొరుకుతాయి. ఉద్యోగంతో జీవితంలో స్థిరత్వం పెరుగుతుంది. స్థిరత్వంతో పౌర సమాజంలో మంచి గౌరవం లభిస్తుంది. పుస్తకాలు కొనడం, చదవడానికి సమయం ఇవ్వడం మంచి ప్రతిఫలాలను, జీవన సాఫల్య ఫలితాలను ఇస్తుందని తెలుసుకోవాలి. పుస్తకాలు కొని చదవకపోయిన యెడల మనం వెచ్చించిన ధనం వృథా అవుతుంది. ఇంట్లో పుస్తకాలు ఉంటే రోజు ఒకటి లేదా రెండు గంటలైనా చదవడం మంచిదని గమనించాలి. ప్రతి ఏటా వంద వరకు పుస్తకాలు చదివే విధంగా మనజీవనశైలి ఉండాలి. వారాంత సెలవుల్లో చదవడానికి కొంత ఎక్కువ సమయాన్ని కేటాయించాలి. మీ జీవనశైలిని బట్టి చదవడానికి సమయం కేటాయించాలి. మీరు ఎక్కువగా ప్రయాణాలు చేసేవారయితే ప్రయాణ సమయాన్ని పుస్తక పఠనానికి కేటాయించవచ్చు. బిడ్డకు పాలు పట్టే తల్లి కూడా పుస్తకాలను చదవవచ్చు. మనం తినేటప్పుడు, కార్యాలయాల్లో, పని ప్రదేశంలో, చివరికి వాష్ రూమ్‌లో కూడా ఆసక్తిగల వారు చదవవచ్చు. వారానికి సగటున 10 గంటలు చదివే అలవాటు ఉన్నవారు ఏడాదికి దాదాపు వంద పుస్తకాలు చదవవచ్చు. స్మార్ట్‌ఫోన్ లేదా ల్యాప్‌టాప్ తెరలపై సమయాన్ని వృథా చేయడం కన్న పుస్తక పఠనానికి అధిక సమయం ఇవ్వడం సముచితంగా ఉంటుంది. అందరు అన్ని రకాల పుస్తకాలను చదువలేరు. మనకు ఆసక్తి ఉన్న రంగాలకు సంబంధించిన పుస్తకాలను చదవడం మనకు ఇష్టంగా ఉంటుంది. ప్రముఖుల జీవిత చరిత్రలు, వ్యక్తిత్వ వికాస పుస్తకాలు, సమకాలీన సమస్యల గూర్చి చర్చించే పుస్తకాలు, మనం ఎంచుకున్న రంగానికి లేదావృత్తికి సంబంధించినవి, ప్రముఖ నవలలు, పేరెన్నికగన్న రచనలు లాంటివి ఏవైనా చదవవచ్చు. కౌమార దశ నుంచే చదవడాన్ని ముఖ్య అలవాటుగా చేసుకోవాలి. విద్యార్థులు పాఠ్యపుస్తకాలతో పాటు ఇతర పుస్తకాలను చదవడం ఒక మంచి అలవాటు. పుస్తకాలు చదివేటప్పుడు ముఖ్యమైన విషయాలను నోట్ చేసుకోవడం మరువరాదు. పాక్షికంగా చదివిన పుస్తకం పేజీని పేపర్ ముక్క పెట్టి లేదా పేజీ మూల మలిచి గుర్తుంచుకోండి. మనకు నచ్చిన కొటేషన్లను నోట్ చేసుకోవాలి. •

# కార్నీతో పుంజుకున్న లిబరల్ పార్టీ

## కెనడా పోల్ సర్వేలో వెల్లడి




**ఒట్టావా, ఏప్రిల్ 22:** దశాబ్దకాలం పాటు కెనడాకు ప్రధానిగా ఉన్న జస్టిన్ ట్రూడోకు సొంత పార్టీ నుంచే తీవ్ర వ్యతిరేకత రావడంతో ప్రధాని పదవితోపాటు, పార్టీ నాయకత్వానికి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. ఆయన స్థానంలో నూతన ప్రధాన మంత్రి మార్క్ కార్నీ నియమితులయ్యారు. అయితే ట్రూడో నిష్క్రమణ తర్వాత లిబరల్ పార్టీ తిరిగి పుంజుకున్నట్లు పలు ఒపీనియన్ పోల్స్ వెల్లడిస్తున్నాయి. పార్టీని ముందుకు తీసుకెళ్లడంలో మార్క్ కార్నీ తనదైన మార్క్‌ను చూపిస్తున్నారని రాజకీయ నిపుణులు పేర్కొన్నారు. ట్రూడో నుంచి మార్క్ కార్నీ బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి పార్టీకి ప్రజాబలం క్రమంగా పెరుగుతున్నట్లు తెలుస్తోంది. ఏప్రిల్ 28న కెనడాలో ఎన్నికలు జరగనున్నాయి. నెల రోజుల క్రితం ప్రతిపక్ష కన్జర్వేటివ్ పార్టీ కంటే చాలా వెనకబడపోయిన లిబరల్స్ ఎన్నికలకు ముందు తిరిగి పుంజుకోవడంతో ఆ పార్టీ మరోసారి అధికారం చేపట్టే అవకాశం ఉన్నట్లు పోల్స్ పేర్కొంటున్నాయి. తాజాగా విడుదలైన నానోస్ పోల్స్ లిబరల్స్‌కు 43.7 శాతం ప్రజామద్దతు లభించగా.. కన్జర్వేటివ్స్‌కు 36.3 శాతం మద్దతు ఉన్నట్లు వెల్లడించాయి. ఓటింగ్ రోజు వరకు ఈ మద్దతు ఇలాగే ఉంటే 343 మంది సభ్యులున్న కెనడియన్ పార్లమెంట్‌లో లిబరల్ పార్టీ అధిక మెజారిటీతో విజయం సాధించే అవకాశం ఉన్నట్లు అంచనా వేశాయి. కార్నీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కెనడా అభివృద్ధి కోసం తీవ్రంగా కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా తమ దేశంపై అమెరికా అధ్యక్షుడు విధించిన టారిఫ్‌లను ధీటుగా ఎదుర్కోవడానికి ప్రణాళికలు రచిస్తున్నారు. కెనడా అమెరికాపై ఆధారపడటాన్ని తగ్గించుకొని, తన ఆర్థిక వ్యవస్థను పూర్తిగా పునర్నిర్మించుకో వాల్సిన అవసరం గురించి ప్రజలకు పిలుపుని చ్చారు. కెనడాను తమలో కలుపుకుంటామని అగ్రరాజ్యం చేస్తున్న బెదరింపులను ఎదుర్కో వాలంటే దేశంలో బలమైన పార్టీ అధికారంలో ఉండాలని ఆయన పేర్కొన్నారు. కెనడా పార్లమెంట్‌లోని 338 స్థానాలకు ఈ నెల 28న ఎన్నికలు నిర్వహించనున్నారు. ప్రధాని కార్నీ కెనడా రాజధాని ఒట్టావా నుంచి బరిలోకి దిగుతున్నారు. అతిపెద్ద వాణిజ్య భాగస్వా ములైన కెనడా, మెక్సికో నుంచి వచ్చే దిగుమ తులపై మార్చి 4 నుంచి అమెరికా 25 శాతం సుంకాలు వసూలు చేస్తున్న సంగతి తెలిసిందే. వలసలు,డ్రగ్స్ అక్రమ రవాణాను సరిహద్దుల్లోనే కట్టడి చేయడంలో విఫలమైతే కెనడా యుఎస్‌లో 51వ రాష్ట్రంగా చేరాలని ట్రంప్ ఆ దేశానికి హెచ్చరికలు చేశారు. ఈ హెచ్చరికల నేపథ్యంలో ఆ దేశంలో జరగనున్న ఎన్నికలు కీలకంగా మారాయి.



## ప్రధాని మోడీ విమానానికి సౌదీ జెట్ విమానాల భద్రత

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 22:** భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రెండు రోజుల పర్యటన నిమిత్తం సౌదీ అరేబియా చేరుకున్నారు. సౌదీలో ప్రధాని మోదీకి ఆపూర్వ స్వాగతం లభించింది. క్రౌన్ ప్రిన్స్ మొహమ్మద్ బిన్ సల్మాన్ ఆహ్వానం మేరకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మంగళవారం రెండురోజుల పర్యటన కోసం జెడ్డాలో అడుగుపెట్టారు. ప్రధాని విమానానికి రాయల్ సౌదీ వైమానిక దళానికి చెందిన ఎఫ్ 15 విమానాలు భద్రత కల్పించాయి. మోడీ సౌదీ గగనతలంలోకి ప్రవేశించగానే ఆదేశ రక్షణరంగ అత్యాధునిక జెట్ విమానాలు ప్రధాని మోడీ విమానానికి భద్రతగా వెంట వచ్చాయి. ఇదొక అపూర్వమైన ఘట్టంగా విదేశాంగశాఖ వెల్లడించింది. అంతేకాకుండా ఈ పర్యటన 40 సంవత్సరాలలో ఒక భారత ప్రధానమంత్రి జెడ్డాకు చేసిన మొదటి పర్యటన. భారతదేశం, సౌదీ అరేబియా మధ్య పెరుగుతున్న సంబంధాల గురించి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సౌదీ అరేబియాను విశ్వసనీయ స్నేహితుడుగా, వ్యూహాత్మక మిత్రదేశంగా అభివర్ణించారు. 2019లో వ్యూహాత్మక భాగస్వామ్య మండలి ఏర్పడినప్పటి నుండి, ద్వైపాక్షిక సంబంధాలలో గణనీయమైన విస్తరణ జరిగిందని ఆయన అన్నారు. సౌదీ అరేబియా క్రౌన్ ప్రిన్స్, ప్రధానమంత్రి హిజ్ రాయల్ హైనెస్ ప్రిన్స్ మొహమ్మద్ బిన్ సల్మాన్ ఆహ్వానం మేరకు తన రెండు రోజుల సౌదీ అరేబియా పర్యటన గురించి ప్రధాని నరేంద్ర మోదీ ఒక పోస్ట్‌లో తెలియజేశారు. ప్రధానమంత్రి మోదీ తన రెండు రోజుల గల్ఫ్ దేశ పర్యటనలో భాగంగా త్వరలో జెడ్డా చేరుకుంటారు. రక్షణ, వాణిజ్యం, పెట్టుబడి, ఇంధనం, ప్రజల మధ్య సంబంధాల రంగాలలో రెండు దేశాలు పరస్పరం ప్రయోజనకరమైన, బలమైన భాగస్వామ్యాన్ని అభివృద్ధి చేసుకున్నాయని ప్రధాని మోదీ అన్నారు.

భారతదేశం – సౌదీ అరేబియా కలిసి ముందుకు సాగుతాయని ప్రధాని మోదీ చెప్పినట్లు అరబ్ న్యూస్ తెలిపింది. ఇరు దేశాల ప్రజలకే కాకుండా మొత్తం ప్రపంచం కోసం శాంతి, పురోగతి, శ్రేయస్సు కోసం కలిసి పనిచేస్తారన్నారు.

సౌదీ అరేబియా రక్షణ మార్కెట్‌పై గ్లోబల్‌డేటా సమాచారం ప్రకారం, మధ్యప్రాచ్య ప్రాంతంలో బోయింగ్‌నిర్మిత రక్షణ వేదికల అతిపెద్ద ఆపరేటర్లలో కింగ్‌డమ్ ఒకటి. దాని రాయల్ ఎయిర్ ఫోర్స్‌లో 207 ఎఫ్15 ఈతి , 62 ఎఫ్15 ఈగిల్ జెట్ ఫైటర్లు ఉన్నాయి. ప్రధాని మోదీ ఏప్రిల్ 22 – 23 తేదీలలో సౌదీ అరేబియా పర్యటనలో ఉంటారు.

ప్రధానమంత్రి మోదీ, క్రౌన్ ప్రిన్స్ మొహమ్మద్ బిన్ సల్మాన్ భారతదేశంసౌదీ వ్యూహాత్మక భాగస్వామ్య మండలి రెండవ సమావేశానికి సహ అధ్యక్షత వహించనున్నారు. ఈ సమావేశం ద్వైపాక్షిక సంబంధాలలో కొత్త అధ్యాయాన్ని జోడిస్తుందని విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది. సౌదీ అరేబియాతో తన దీర్ఘకాల, చారిత్రక సంబంధాలకు భారతదేశం గొప్ప ప్రాముఖ్యతను ఇస్తుందని బయలుదేరే ముందు ప్రధానమంత్రి మోదీ అన్నారు. రక్షణ, వాణిజ్యం, శక్తి,ప్రజల మధ్య సంబంధాలు వంటి రంగాలలో భాగస్వామ్యం కొత్త ఊపు సాధించింది.

# బోనస్ ఐదువేల డాలర్లు..

## జనాభా పెంపుపై యుఎస్ దృష్టి



**వాషింగ్టన్, ఏప్రిల్ 22:** దేశంలో జననాల రేటు తగ్గుదలపై అమెరికా ప్రభుత్వం దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఎక్కువ మంది పిల్లలను కనేలా ప్రోత్సహించేందుకు ట్రంప్ యంత్రాంగం ప్రతిపాదనలు రూపొందిస్తున్నట్లు సమాచారం. ఇందులో భాగంగా జన్మనిచ్చిన మహిళకు 5వేల డాలర్ల 'బేబీ బోనస్' వంటి అంశాలపై అధికారులు కసరత్తు చేస్తున్నట్లు అమెరికన్ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. క్షీణిస్తున్న జననాల రేటును అధిగమించేందుకు అవసరమైన ప్రణాళికలకు సంబంధించి వైట్‌హౌస్‌లో ఇటీవల అంతర్గతంగా ఓ కీలక సమావేశం నిర్వహించినట్లు తెలిసింది. సంతాన సాఫల్యంపై మహిళలకు అవగాహన, బిడ్డల్నికనే కుటుంబాలకు ప్రోత్సాహకాలు చర్చకు వచ్చాయి. ఇందులో భాగంగా బిడ్డకు జన్మనిచ్చే ప్రతి అమెరికన్ మాతృమూర్తికి 'బేబీ బోనస్' కింద 5వేల డాలర్లు, పన్ను మినహాయింపుల వంటి అంశాలు ప్రతిపాదించినట్లు తెలిసింది. వివాహం చేసుకున్న లేదా పిల్లలున్న వారికి ప్రతిష్ఠాత్మక స్కాలర్‌షిప్‌లలో 30 శాతం స్లాట్లు కేటాయించాలనే ప్రతిపాదనలు ఉన్నప్పటికీ వీటిపై కొంత వివాదం నడుస్తున్నట్లు సమాచారం. ఉపాధ్యక్షుడు జెడి వాన్స్, బిలియనీర్ ఎలాన్ మస్క్ వంటి నేతలు పాల్గొన్న ఈ సమావేశంలో జనాభా పెరుగుదలపై ప్రణాళికకు సంబంధించి ఎటువంటి నిర్ణయాలు తీసుకోనప్పటికీ.. దీనిపై అనేకమంది ఆసక్తి కనబరిచినట్లు తెలుస్తోంది. దేశంలో క్షీణిస్తున్న సంతానోత్పత్తిపై పలు సందర్భాల్లో ప్రస్తావించిన వాన్స్ నాగరికత సంక్షోభం తలెత్తే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. మరోవైపు ఎలాన్ మస్క్ కూడా అధిక సంతానానికి మద్దతు తెలుపుతున్న సంగతి తెలిసిందే.

**క్షీణిస్తోన్న జననాల రేటు:** అమెరికాలో 1990ల నుంచి జననాల రేటు క్రమంగా క్షీణిస్తోంది. సిడిసి నివేదిక ప్రకారం 2023లో సంతా నోత్పత్తి రేటు 1.62గా ఉంది. రీప్లేస్‌మెంట్ రేటు కంటే చాలా తక్కువ. పెరుగుతున్న జీవన వ్యయం, శ్రామిక రంగంలో మహిళలు భాగస్వామ్యం పెరగడం, సామాజిక విలువల్లో మార్పులు వంటివి ఈ తగ్గుదలకు కారణంగా నిపుణులు పేర్కొంటున్నారు.



## నిన్నుకూడా చంపేస్తాం

### సిద్ధిఖీ తనయుడికి ఇమెయిల్ బెదరింపులు..

**ముంబయి, ఏప్రిల్ 22:** మహారాష్ట్ర మాజీమంత్రి, ఎన్సీపీ నేత బాబాసిద్ధిఖీ హత్య తర్వాత ఇపుడు ఆయన కుమారుడు జీషాన్ సిద్ధిఖీని లారెన్స్ గ్యాంగ్ లక్ష్యంగా చేసుకుంది. గుర్తుతెలియని వ్యక్తులు జీషాన్‌కు మెయిల్స్ పంపుతూ బెదిరిస్తున్నారు. జీషాన్ సిద్ధిఖీకి బెదిరింపు మెయిల్స్ వచ్చాయని, నీతండ్రిలాగే నిన్నూ చంపేస్తాం అని అలా కాకూడదంటే రూ.10 కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేసారు. ప్రతి ఆరుగంటలకు ఒక బెదిరింపు మెయిల్‌ను పంపిస్తున్నారని దీనిపై కేసునమోదుచేసి దర్యాప్తుచేస్తున్నామని ఇక ఈ బెదిరింపులపై జీషాన్‌మాట్లాడుతూ 'డీ' అనే కంపెనీనుంచి ఈ మెయిల్ వచ్చిందని తెలిపారు. గత ఏడాది అక్టోబరులో సిద్ధిఖీ హత్యజరిగింది. తన కుమారుడి ఆఫీసులోనే ఈ హత్యజరిగింది. గుర్తుతెలీని దుండగులు ఆయనపై కాల్పులు జరిపి హత్య చేసారు. ఆరురౌండ్లు కాల్పులు జరపడంతో బాబా సిద్ధిఖీ స్పాట్‌లోనే చనిపోయారు. అదే సమయంలో నవరాత్రి ఊరేగింపులో బాణాసంచా కాలుస్తుండటంతో కాల్పుల శబ్దం బయటకు రాలేదు. ఈ హత్య తామే చేసామని లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ వెల్లడించింది. సుమారు 20 మంది నిందితులను పోలీసులు అరెస్టు చేసారు. ప్రధాన షూటర్ అని భావిస్తున్న శివకుమార్ కూడా పోలీసులకు చిక్కాడు. అయితే బిష్ణోయ్‌గ్యాంగ్‌తో తనకు సంబంధం ఉందని విచారణలో అంగీకరించాడు. అన్మోల్ బిష్ణోయ్ ఆదేశాల మేరకే హత్య చేసామని పోలీసుల వద్ద అంగీకరించాడు.




## జూన్ 30నుంచి మానససరోవర్ యాత్ర

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 22:** ఐదేళ్ల విరామం తర్వాత కైలాస మానసరోవర్ యాత్ర ప్రారంభం కానుంది. జూన్ 30న దిల్లీ నుంచి 50 మందితో కూడిన తొలి బృందం కైలాస శిఖర దర్శనానికి వెళతాయని కేంద్రం ప్రకటించింది. ఉత్తరాఖండ్‌లోని పిథోర్‌గఢ్ జిల్లాలో ఉన్న లిపులేక్ పాస్ గుండా యాత్ర కొనసాగుతుందని వెల్లడించాయి. యాత్ర ఏర్పాట్లపై చర్చించేందుకు దిల్లీలో కేంద్ర విదేశాంగ శాఖ, ఉత్తరాఖండ్‌కు చెందిన అధికారులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తీర్థయాత్ర నిర్వహణను కుమావ్ మండల్ వికాస్ నిగమ్‌కు అప్పగించాలని నిర్ణయించారు. మెత్తం ఐదు గ్రూపులు కైలాస యాత్రకు వెళతాయని అధికారులు తెలిపారు. ఒక్కొ గ్రూపులో 50 మంది ఉంటారని వెల్లడించారు. మొదటి బృందం జూలై 10న లిపులేఖ్ పాస్ ద్వారా చైనాలో ప్రవేశిస్తుంది. చివరి బృందం ఆగస్టు 22న తిరిగి వస్తుంది. దిల్లీనుంచి బయలుదేరినప్రతిబృందం టనక్‌పుర్, ధార్చులాలో ఒక్కొక్క రాత్రి, గుంజీ, నభిదాంగ్‌లో రెండు రాత్రులు బస చేసిన తర్వాత చైనాలోకి ప్రవేశిస్తుంది. కైలాస యాత్ర తర్వాత తిరిగి చైనా నుంచి బయలుదేరి బుండి, చౌకోరి, అల్మోరాలో ఒక రాత్రి బస చేసిన తర్వాత దిల్లీకి చేరుకుంటుంది. మొత్తం యాత్ర పూర్తవడానికి ఒక్కొ బృందానికి 22 రోజుల సమయం పడుతుంది. కైలాస మానసరోవర్ యాత్రకు వెళ్లే భక్తులకు దిల్లీతో పాటు ఉత్తరాఖండ్‌లోని గుంజిలో వైద్య పరీక్షలు నిర్వహిస్తామని అధికారులు చెప్పారు. ఏటా నిర్వహించే కైలాస పర్వతం, మానస సరోవర్ సరస్సు పర్యటనలను కొవిడ్ కారణంగా 2020లో నిలిపివేశారు. ఆ తర్వాత గల్వాన్ ఘర్షణతో ఇరు దేశాల మధ్య సంబంధాలు దెబ్బతినడం వల్ల యాత్ర పునరుద్ధరణ చర్యలు ముందుకు సాగలేదు. తాజాగా ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాల పునరుద్ధరణ చర్యలకు మార్గం సుగమైంది. అయితే, ఈ యాత్రలో పాల్గొనేందుకు వయసు 1870 సంవత్సరాల వరకు ఉండొచ్చు. కానీ ఫిట్‌గాఉంటేనే ఈ యాత్ర చేయాలి. రిజిస్ట్రేషన్లు అధికారిక ఎంఇఎ పోర్టల్ ద్వారా నిర్వహించబడతాయి. ఇక ఈ యాత్ర ప్రాథమికంగా రెండు మార్గాలద్వారా నిర్వహిస్తుంది. వాటిల్లో యాత్రికులు ఏదైనా ఎంచుకోవచ్చు. ఒకటి లిపులేఖ్ పాస్(ఉత్తరాఖండ్), నాథులా పాస్(సిక్కిం). అయితే ఎంచుకున్న మార్గం బట్టి ఖర్చులు ఉంటాయి. లిపులేఖ్ పాస్‌రూట్ అయితే ఒక్కొక్కరికి రూ.1.8 లక్షలురూ.2లక్షలు, నాథు లా పాస్ అయితే రూ.2.2 లక్షల రూ.2.4 లక్షల వరకు ఉండొచ్చు. అయితే మూడో మార్గం నేపాల్ నుంచి ఉంటుంది కానీ, ఖర్చు రూ.3.2 లక్షలు, అంతకంటే ఎక్కువగా ఉంటుంది.

# ఏకకాలంలో ఆరు జంటలకు పెళ్లిళ్లు



**హిస్సార్(హర్యానా), ఏప్రిల్ 22:** హంగు ఆర్భాటాలతో భారీ ఎత్తున జరిగే పెళ్లిళ్లు ఇటీవలి కాలంలో భారీ స్థాయిలోను సంఖ్యాపరంగా కూడా చూస్తున్నాం. 16 రోజుల పెళ్ళిళ్లు కూడా జరుగుతున్నాయి. ఇలాంటి తరుణంలో హర్యానాకు చెందిన ఓ కుటుంబం తీసుకున్న నిర్ణయం అన్ని వర్గాలను ఆనందింపచేస్తోంది. హర్యానాలోని హిసార్ జిల్లాలోని గవాద్ గ్రామంలో ఈ నెల 18, 19వ తేదీల్లో పెళ్లిళ్ల జరిగాయి. మొత్తం 6 పెళ్లిళ్లు జరగ్గా అందులో నలుగురు అమ్మాయిలు, ఇద్దరు అబ్బాయిలు ఉన్నారు. ఇందులో విచిత్రం ఏంటంటే వారంతా ఒకే కుటుంబానికి చెందినవారు కావడం గమనార్హం. ఆ గ్రామానికి చెందిన పూనియా కుటుంబంలోని అన్నాదమ్ముల పిల్లలకు ఒకే మండపంలో రెండు రోజుల్లో ఆరు పెళ్లిళ్ల జరిపించారు. దీంతో గవాద్ గ్రామంలో ప్రత్యేకమైన సందడి నెలకొంది. రాజేష్ పూనియా, అమర్ సింగ్ పూనియా అనే ఇద్దరు అన్నాదమ్ములకు మొత్తంగా ఆరుగురు పిల్లలు ఉన్నారు. ఒక్కొక్కరికీ ఇద్దరు అమ్మాయిలు, ఒక అబ్బాయి ఉన్నారు. అయితే వీరిద్దరి అన్నాదమ్ములకు చెందిన ఆరుగురు పిల్లలకు ఒకేసారి పెళ్లిళ్ల చేయాలని వారు నిర్ణయించుకున్నారు. దీంతో డబ్బు, సమయాన్ని కూడా ఆదా చేయాలనే ఉద్దేశ్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. వీరి కుటుంబంలోని ఇద్దరు కుమారుల పెళ్లి ఏప్రిల్ 18వ తేదీన జరగ్గా ఆ తర్వాతి రోజు అంటే ఏప్రిల్ 19వ తేదీన నలుగురు కుమార్తెల వివాహాలు అదే కళ్యాణ మండపంలో నిర్వహించారు. ఇక పూనియా ఇంట పెళ్లి బాజాలకు ఈ గవాద్ గ్రామం మొత్తం తరలివచ్చింది. పూనియా కుటుంబం చేసిన ఈ కుటుంబ పెళ్లిళ్లపై గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేశారు. తాను కూడా ఇలాగే పెళ్లిళ్ల చేస్తానని గవాద్ గ్రామ నివాసి అయిన రమేష్ హవల్దార్ మీడియాకు వెల్లడించారు. తాము కూడా భవిష్యత్‌లో అలాగే చేస్తామని ఇలా కుటుంబాలు కలిసి వివాహం చేసుకోవడం ద్వారా డబ్బు ఆదా కావడమే కాకుండా, సమాజంలో సోదరభావాన్ని పెంపొందించే సందేశం ఇచ్చినట్లు అవుతుందని పేర్కొన్నారు. భవిష్యత్తులో ద్రవ్యోల్బణం తట్టుకోవడానికి, సమయాన్ని ఆదా చేసుకోవడానికి కలిసి నిర్ణయాలు తీసుకోవడం చాలా అవసరం అని రమేష్ హవల్దార్ తెలిపారు. తాము గ్రామంలోని గుడిసెల్లో నివసిస్తున్నామని తమ ఊరికి చెందిన సోదరులు రాజేష్ పూనియా, అమర్ సింగ్ పూనియా తమ ఆరుగురు కుమారులు, కుమార్తెలను ఒకేసారి వివాహం చేశారని స్థానికులు చెబుతున్నారు. రాజేష్ పూనియాకు కవిత, ప్రియాంక అనే ఇద్దరు కుమార్తెలు సందీప్ అనే కుమారుడు ఉన్నాడు. అమర్ సింగ్ పూనియాకు మోనికా, ప్రీతి కుమార్తె, సంజయ్ అనే కుమారుడు ఉండగా వారి పెళ్లిళ్ల ఈనెల 18, 19 తేదీల్లో జరగ్గా ఆ వివాహాలకు ఊరంతా హాజరయ్యారై తమ సంపూర్ణ మద్దతు పలికి కానుకలు ఇచ్చారు.



## ఠారెత్తిస్తోన్న ఎండలు

### పలు రాష్ట్రాల్లో వడగాడ్పులు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 22:** దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో వడగాడ్పులు వీస్తాయని భారత వాతావరణ హెచ్చరించింది. ముఖ్యంగా ఉత్తర, మధ్య భారతదేశంలో వీటి ప్రభావం ఎక్కువగా ఉన్నట్లు వెల్లడించింది. ఇందులో దక్షిణ ఉత్తర్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్, హరియాణా, విదర్భ ప్రాంతాలు ఉన్నాయి. వీటికి ఏప్రిల్ 25 వరకు యెల్లో ప్రమాద హెచ్చరికలు జారీ చేసింది. గుజరాత్, తమిళనాడు, మహారాష్ట్రతో పాటు మధ్యప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాల్లో వడగాలులు ప్రభావం ఉంటుందని ఐఎండి తెలిపింది. ఏప్రిల్ 25 వరకు వేడి, ఉష్ణోగ్రతలు అధికంగా ఉంటాయని వివరించింది. అయితే, ఈశాన్య రాష్ట్రాలైన అసోం, మణిపుర్, మేఘాలయ్, నాగాలాండ్, త్రిపుర, మిజోరంలో భారీ వర్షాలు పడనున్నట్లు తెలిపింది. దక్షిణాది రాష్ట్రాల్లో బలమైన ఎదురుగాలు, మెరుపులు, పిడుగులు పడే అవకాశం ఉన్నట్లు అంచనా వేసింది. ఉత్తరాఖండ్‌లోని కొన్ని ప్రాంతాల్లోనూ పిడుగుల పడే ఛాన్స్ ఉందని చెప్పింది. వర్షాలు పడుతాయట. మరోవైపు ఇటీవలే వ్యవసాయ రంగానికి తీపి కబురు చెప్పింది భారత వాతావరణ శాఖ ఐఎండీ. ఈ ఏడాది నైరుతి రుతుపవనాల కాలం అంటే జూన్ నుంచి సెప్టెంబరు నెలల్లో దేశ వ్యాప్తంగా సాధారణానికి మించి వర్షాలు కురుస్తాయని పేర్కొంది. తెలుగు రాష్ట్రాల్లోనూ మంచి వానలు పడే అవకాశంఉందని ప్రటించింది. 1971 నుంచి 2020వరకు ఉన్న గణాంకాలను పరిశీలిస్తే దేశవ్యాప్తంగా దీర్ఘకాలంలో సగటున 87 సెంటీమీటర్ల వర్షం కురుస్తోందని, ఇప్పుడు అందులో 105 దాకా ర్షాలు పడొచ్చని అంచనా వేసింది. అలాగే సాధారణానికి మించి, అధిక వర్షపాత అంచనాలను కలిపి చూస్తే 56.మంచి వర్షాలకు అవకాశం ఉందని చెప్పింది. అలానే ఈ ఏడాదిలో ఎల్‌నినో ఏర్పడే పరిస్థితులు లేవని వివరించింది. డిసెంబరుమార్చి మధ్య హిమాలయాలు, యూరో ఏసియా ప్రాంతంలో మంచు తక్కువగా ఉందని, ఇవన్నీ మంచి వర్షాలు కురవడానికి శుభపరిణామాలని ఐఎండి వివరించింది. అలాగే ఈశాన్యరాష్ట్రాలు, జమ్మూ కశ్మీర్, లద్దాఖ్, తమిళనాడు, బీహార్‌లలో సాధారణం కంటే తక్కువ వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపింది. మిగిలిన అన్ని ప్రాంతాల్లో సాధారణం, అంతకంటే ఎక్కువ వానలు కురిసే వీలుందని వివరించింది.

# అంబర్‌కోటను సందర్శించిన జెడివాన్స్ ఫ్యామిలీ



**జైపూర్, ఏప్రిల్ 22:** నాలుగురోజుల పర్యటనలో భాగంగా అమెరికా ఉపాధ్యక్షుడు జెడావాన్స్ కుటుంబంతో సహా సోమవారంనుంచి భారత్‌లో పర్యటిస్తున్నారు. మంగళవారం వాన్స్ దంపతులు తమ కుమారులు ఇవాన్ వివేక్, కుమార్తె మీరాబెల్‌లతో జయపురలోని అంబర్‌కోటను సందర్శించారు. రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ, డిప్యూటీ సీఎం దియాకుమార్ వారికి స్వాగతం పలికారు. చంద, పుష్ప అనే ఏనుగులతో వారికి ప్రత్యేక ఆహ్వానాన్ని ఏర్పాటు చేసారు. కోటలోప్రదర్శించిన పలు రాజస్థానీ సాంస్కృతిక నృత్య ప్రదర్శనలను వీక్షిస్తూ వాన్స్ కుటుంబం కోటను సందర్శించారు. అనంతరం ఆయన రాష్ట్రగవర్నర్ హరిబావు కిషన్‌రావ్ బగాడేతో సమావేశం మధ్యాహ్నం రాజస్థాన్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో ప్రసంగించనున్నట్లు సమాచారం. సోమవారం ఢిల్లీ చేరుకున్న వాన్స్ దంపతులు ప్రధాని మోడీని కలిసారు. ఆయనతో విందు అనంతరం సోమవారం రాత్రికే జయపురలోని విలాసవంతమైన రాంబాగ్ ప్యాలెస్ హోటల్‌కు చేరుకున్నారు. 23వ తేదీ ఉదయం వాన్స్ కుటుంబం ఆగ్రాకు వెళుతుంది. అక్కడ తాజ్ మహల్‌ను భారతీయ కళలకు సంబంధించి శిల్పాగ్రామ్‌ను సందర్శిస్తారు. అదేరోజు మధ్యాహ్నం తర్వాత మళ్లీ వారు జయపురకు వెళతారు. 24న జయపురనుంచి బయలుదేరి అమెరికాకు వెళతారు.

# పార్లమెంటే సుప్రీం: ధన్‌ఖడ్ వ్యాఖ్యల దుమారం



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 22:** రాష్ట్రపతిని సుప్రీంకోర్టు ఆదేశించలేదంటూ ఉపరాష్ట్రపతి రాజ్యసభ ఛైర్మన్ జగదీప్‌ధన్‌ఖడ్ చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. అంతేకాకుండా మంగళవారం మరోసారి ఆయన సంచలన వ్యాఖ్యలుచేసారు. రాజ్యాంగపరమైన అంశాల్లో ఎన్నికైన ప్రజాప్రతినిధులే అల్టిమేట్ మాస్టర్స్ అని ధన్‌ఖడ్ వ్యాఖ్యానించారు. ఎన్నికైన ప్రజాప్రతినిధులు జవాబు దారీతనంగా ఉండాలి. ఎమర్జెన్సీని విధించిన ప్రధాని అయినా సరే ప్రజలకు రక్షణ కల్పించేందుకే ప్రజాస్వామ్యం, రాజ్యాంగపరమైన అంశాల్లో ప్రజాప్రతినిధులే అల్టిమేట్ మాస్టర్స్. పార్లమెంట్‌కంటే అత్యుత్తమమైనది ఉందని రాజ్యాంగంలో ఎక్కడా లేదు. పార్లమెంటేసుప్రీం అని ధన్‌ఖడ్ వ్యాఖ్యానించారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ విధించిన ఎమర్జెన్సీ సమయం గురించి కూడాధన్‌ఖడ్ ప్రస్తావించారు. ఎమర్జెన్సీ సమయంలోప్రాథమిక హక్కుల ఉల్లంఘన జరిగిందన్నారు. రాష్ట్ర గవర్నర్‌పంపిన బిల్లులకు రాష్ట్రపతి నిర్ణీత గడువులోపు సమ్మతి తెలపాలని గడువు ఇస్తూ ఇటీవల తీర్పునిచ్చింది. దీనిపై ధన్‌ఖడ్ కీలక వ్యాఖ్యలుచేసారు. ప్రజాస్వామ్యం అనేది ప్రజలకోసం మాత్రమే. అది ఎన్నికైన ప్రతినిధులకు రక్షణ కల్పించే ఓ భాండాగారం అని ధన్‌ఖడ్ మరోసారి తెగేసి చెప్పారు. రాజ్యాంగం ఎలా ఉండాలో నిర్ణయించడంలో ఎన్నికైన ప్రతినిధులే అంతిమ యజమానులు. పార్లమెంట్‌కంటే ఎక్కువ అధికారం ఉన్న వ్యవస్థ గురించి మన రాజ్యాంగంలో లేదు. కనుక మనం దేశంలో పార్లమెంటే సుప్రీం అని ధనఖడ్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేసి మరోసారి విపక్షాలకు అస్త్రం అందించారు. మరో అడుగు ముందుకేసి రాజ్యాంగ అధికారిగా తాను మాట్లాడే ప్రతిమాట అత్యున్నత జాతీయ ప్రయోజనాలకు అనుగుణంగా ఉంటుందని ఉపరాష్ట్రపతి జగదీప్‌ధన్‌ఖడ్ స్పష్టం చేసారు. సుప్రీంకోర్టుపై తానుచేసిన వ్యాఖ్యలకు విమర్శించిన వారిపై ఆయన మండిపడ్డారు. సుప్రీంకోర్టు సూపర్ పార్లమెంట్‌గా వ్యవహరించ కూడదని న్యాయవ్యవస్థ, కార్యనిర్వాహక వ్యవస్థపరిధిలోకి తలదూర్చకూడదని అలా జరిగితే అది రాజ్యాంగ విరుద్ధం అవుతుందని ధన్‌ఖడ్ అన్నారు.

## ఓం ప్రకాష్ హత్య కేసులో సంచలన నిజాలు

### హత్య కోసం గూగూల్‌లో శోధించిన భార్య పల్లవి



భార్య పల్లవితో కర్నాటక మాజీ డిజిపి ఓం ప్రకాష్(ఫైల్)

**హైదరాబాద్, ఏప్రిల్ 22, ప్రభాతవార్త:** కర్నాటక మాజీ డిజిపి ఓం ప్రకాష్ దారుణ హత్యలో మరిన్ని సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఓం ప్రకాష్‌ను హ త్య చేసిన ఆయన సతీమణి పల్లవి ఇందుకోసం గూగుల్‌లో శోధించినట్లు పోలీసుల విచారణలో తేలింది. ఒక మనిషిని చంపాలంటే ఒంటిపై ఏ ఏ భాగాలలో కత్తితో పొడవాలి, ఒంట్లోని ఏ ఏ భాగాల్లో గల నరాలను, రక్త నాళాలను తెంపాలి...? రక్తస్రా వం ఆగకుండా వుండాలంటే? ఎలా ఎలాంటి ఆయుధం వాడాలి? అనే విషయాలను పల్లవి గూగుల్‌లో శోధించినట్లు ఈ కేసును విచారి స్తున్న బెంగళూరు పోలీసుల విచారణలో తేలింది. ఆదివారం తెల్లవారు జామున ఓం ప్రకాష్ బెంగళూరులోని హెచ్ఆర్ఎస్ లే అవుట్‌లోని తన నివాసంలో హత్యకు గురవడం తెలిసిందే. మొదట అనుమానాస్పద మృతిగా భావించిన పోలీసులు ఆనక ఘటనా స్థలంలో ల భించిన ఆధారాలు, తన భర్తను చంపాక కొందరి ఫోన్లకు ఓం ప్రకాష్ భార్య పల్లవి పంపిన సందేశాల ఆధారంగా ఆమె స్వయంగా ఈ దారుణానికి ఒడిగట్టిందని పోలీ సులు నిర్ధారణకు వచ్చారు. ఈ దారుణంలో పల్లవికి కూతురు కృతి కూడా సహకరించిందని తేలింది. దీనిపై మరిన్ని విషయాలను వెలికి తీసేందుకు ఆదివారం నాడే తల్లి, కూతుళ్లను అదుపులోకి తీసుకున్న పోలీసులు వారిని విచారించగా కొత్త విషయాలు వెలుగు చూశాయి. కొంతకాలంగా మానసిక వ్యాధితో బాధపడుతున్న పల్లవికి ఇంట్లోనే వైద్యం అందిస్తు న్నారు. అయితే దీనిని ఆమె హౌస్ అరెస్టుగా భావించి భర్తపై అనుమానాలు పెంచుకుంది. ఇదే సమయంలో ఉత్తర కన్నడ జిల్లా దండేలి వద్ద ఓం ప్రకాష్‌కు వున్న 17 ఎకరాల భూమిని తన సోదరి సరిత, కుమారుడు కార్తికేష్ పేరిట బద లాయించాలని ఆయన నిర్ణయించడం పల్ల వికి నచ్చ లేదు. దీంతో పాటు ఓం ప్రకాష్ తన ఇంట్లో కంటే సోదరి సరిత, కుమారుడు కార్తికేష్ వద్ద ఎక్కువగా వుండేవారు. ఇది కూడా పల్లవికి నచ్చ లేదు.

ఈ కారణాల వల్ల పల్లవి తన భర్త ఓం ప్రకాష్‌ను హత్య చేసేందుకు నిర్ణయించుకుంది.


తెలంగాణ ప్రభుత్వం

అచ్చంపేట మునిసిపాలిటీ కార్యాలయం

కొటేషన్ ఆహ్వానిస్తూ ప్రకటన

ప్రకటన నం. E1/ACPT/Engage/2025 తేది: 22.04.2025

అచ్చంపేట మునిసిపాలిటీ కమిషనర్ వారు ఆ మునిసిపాలిటీలో క్రింది ఐటమ్‌ల నిమిత్తం సీల్డ్ కొటేషన్‌లు కోరుతున్నారు మరియు వివరాలు ఈ క్రింది విధంగా:–

| క్ర.సం. | ఐటమ్ వివరణ | యూనిట్ |
|---|---|---|
| 1 | ఇంజనీర్ ఇన్‌ఛార్జ్ నిర్దేశం ప్రకారం ఇంధనం, డ్రైవర్ ఛార్జీలు మరియు అన్ని ఇన్సిడెంటల్ ఛార్జీలు కలుపుకొని ఘన వ్యర్థ పదార్థాలు, చెత్తాచెదారం, మట్టి, అనవసర వృథా వస్తువులు, చెత్తకుప్ప, నరికిన పొదలు మరియు ముళ్లపొదలు వగైరా రవాణా నిమిత్తం ట్రాక్టర్ ఏర్పాటు (ఒక రోజు యొక్క 8 గంటలు) | ఒక్కొక్కటి/రోజు |
| 2 | పైన పేర్కొన్న వారి నిర్దేశం ప్రకారం పైన పేర్కొన్న విధంగానే ఛార్జీలు కలుపుకొని నీటి రవాణా నిమిత్తం ట్యాంకర్‌లు ఏర్పాటు (ఒక రోజు యొక్క 8 గంటలు) | ఒక్కొక్కటి/రోజు |
| 3 | పైన పేర్కొన్న వారి నిర్దేశం ప్రకారం అన్ని ఇన్సిడెంటల్ ఛార్జీలు కలుపుకొని పొదలు, ముళ్లకంపల తొలగింపు, చెత్తకుప్పల క్లీనింగ్, లెవెలింగ్ వగైరాకు JCB/బ్యాక్ హో లోడర్ నియామకం (ఒక రోజు యొక్క 8 గంటలు) | ఒక్కొక్కటి/రోజు |
| 4 | అదే వారి నిర్దేశం ప్రకారం పై విధంగా అన్ని ఛార్జీలు కలుపుకొని పైన పేర్కొన్నట్లు లెవెలింగ్, క్లీనింగ్, క్లియరింగ్ నిమిత్తం డోజర్ యొక్క నియామకం (ఒక రోజు యొక్క 8 గంటలు) | ఒక్కొక్కటి/రోజు |

కొటేషన్ దాఖలు ప్రారంభ తేదీ & సమయం: 23.04.2025 ఉ.10.00 గం. కొటేషన్ దాఖలు ముగింపు తేదీ & సమయం: 23.04.2025 సా.05.00 గం. మరిన్ని ఎక్కువ వివరాలకు అచ్చంపేట మునిసిపాలిటీ, నాగర్‌కర్నూలు జిల్లా, తెలంగాణ–509375 దర్శించండి. సెల్: 9398573135.

సం/- (జి. యాదయ్య)

DIPR.No.673-PP/CL/Advt/1/2025-26, తేది: 22.04.2025 కమిషనర్, అచ్చంపేట మునిసిపాలిటీ



మంగళవారం మంగపేట మండల కేంద్రంలో నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

# భూభారతి చట్టంతో రైతుకు మేలు

## ధరణి పేరుతో దగా చేసిన గత పాలకులు

## సాగురైతులందరికీ పట్టాలు అందజేస్తాం: మంత్రి సీతక్క

**మంగపేట, ఏప్రిల్ 22, ప్రభాతవార్త:** ధరణి పేరుతో రాష్ట్రంలోని రైతులందరినీ గత పాలకులు దగా చేశారని, అప్పటి అధికార పార్టీ నాయకులు లక్షలాది ఎకరాల భూమి పేరుతో కోట్లాది రూపాయలు దిగమింగారని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. మంగళవారం మంగపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో అదనపు కలెక్టర్ రెవిన్యూ మహేందర్ జి జిల్లా గ్రంథాలయ చైర్మన్ బానోతు రవిచందర్ లతో కలసి భూ భారతి చట్టంపై రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సుకు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ రాష్ట్రంలోని రైతుల సమస్యలను పరిష్కరించడం కోసం ఎవరి భూమి వారికి చెందే విధంగా పట్టాలు అందజేయడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భూభారతి చట్టాన్ని ప్రవేశపెట్టారని, గతంలోని ధరణి పోర్టల్ కారణంగా రైతులు అనేక ఇబ్బందులకు గురయ్యారని అన్నారు. 50 సంవత్సరాల నుండి సాగు చేసుకుంటున్న రైతులకు పట్టాలు అందకపోవడంతో వారికి ఎలాంటి లబ్ధి చేకూరలేదని, నేడు నిజమైన రైతులకు పట్టాలు అందజేసి ప్రభుత్వ ఫలాలు అందజేయడానికి చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

గ్రామాలలోని భూ సమస్యలు స్థానిక తహశీల్దార్‌తో పరిష్కారం కానిపక్షంలో ఆర్డిఓ, కలెక్టర్, సీసీఎల్ఏ ద్వారా భూ సమస్యలను పరిష్కరించుకోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పిం చిందని, భూముల విషయంలో రైతులెవ్వరు ఆందోళన చెందవద్దని అన్నారు. గత పది సంవత్సరాలుగా నిరుపేద రైతులకు ఒక్క ఎకరం భూమి సైతం అప్పటి పాలకులు ఇవ్వలేదని, నేటి ప్రజా ప్రభుత్వం ప్రభుత్వ భూములను గుర్తించి పేదలకు పంపిణీ చేయడానికి సిద్ధంగా ఉందని అన్నారు. వివిధ రకాల సమస్యలున్న భూములను భూ భారతి చట్టం ద్వారా పరిష్కరించు కోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పించిందని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం మంగపేట మండల పరిధి లోని 38 మంది కళ్యాణ లక్ష్మి ్మ, షాది ముభారాక్ లబ్ధిదారులకు చెక్కులను మంత్రి అందచేశారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవిన్యూ సి హెచ్ మహేందర్ జి, మండల ప్రత్యేక అధికారి శ్రీధర్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్, తహసిల్దార్ రవీందర్, ఎంపిడిఓ భద్రు నాయక్, మండల వ్యవసాయ శాఖ అధికారి చేరాలు, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, రైతులు, ప్రజలు, కళ్యాణ లక్ష్మి ్మ, షాది ముభారాక్ లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# మే 7 నుంచి జరిగే ఆర్టీసి సమ్మెకు అన్ని కార్మిక సంఘాలు కలిసి రావాలి

## జెఎసి చైర్మన్ ఈదురు వెంకన్న

**హైదరాబాద్ (చిక్కడపల్లి), ఏప్రిల్ 22, ప్రభాతవార్త:** మే 7 నుంచి జరిగే ఆర్టీసి సమ్మెకు అన్ని కార్మిక సంఘాలు కలిసి రావాలని మంగళవారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో జరిగిన టిజిఎస్ఆర్‌టిసి జేఏసీ సమావేశం పిలుపునిచ్చింది. జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఎస్ డబ్ల్యుఎఫ్ (సి.ఐ.టియు) ప్రధాన కార్యదర్శి వి.ఎస్. రావు. ఎస్‌డబ్ల్యుయు (ఐఎన్‌టియుసి) ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న, కోచైర్మన్ కె.హనుమంతు మూదిరాజ్, వైస్‌చైర్మన్ ఎం.థామస్‌రెడ్డి, కన్వీనర్ ఎం.డి. మౌలానా, కోకన్వీనర్‌లు కత్తుల యాదయ్య,సుద్దాల సురేష్ మాట్లాడుతూ విశాల ఐక్యత కోసం జేఏసీ ప్రయత్ని స్తోందన్నారు. ఎస్‌డబ్ల్యుఎఫ్ ప్రధాన కార్యదర్శి విఎస్.రావు మాట్లాడుతూ తమ కమిటీ తీసుకున్న నిర్ణయాలను వెల్లడించారు. కార్మిక ప్రయోజనాల కోసమే తమ నిర్ణయాలుంటాయన్నారు. ఎస్‌డబ్లుయు ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి మాట్లాడుతూ గతంలో జరిగిన అనుభవాల దృష్ట్యా కార్మికులందరినీ ఒకత్రాటిపై నడిపించడానికి జెఎసి నాయకత్వం విశాల ఐక్యత కొరకు సురొకసారి ప్రయత్నం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జెఏసి కోశాధికారి ది యాదయ్య. మీడియా ఇచ్చార్జి అప్పారావు ప్రతినిధులు ఎస్. కమలాకరీ గౌడి మొకటి గౌడ్, ఎస్ యు ఎఫ్ నాయకులు సి ఎస్.డబ్ల్యుము నాయకులు అబ్రహం, ఎస్.సాయిరెడ్డి. జి.ఎస్.పాల్, సి.ఎస్ కృష్ణ . రాండ ఎ. గౌరీ శంకర్, జి.రాములు, ఎస్. వెంకటేష్, రవీందర్, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత

## మంత్రి కొండా సురేఖ

**హైదరాబాద్, ఏప్రిల్ 22, ప్రభాతవార్త:** పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్క పౌరుడి బాధ్యత అని రాష్ట్ర పర్యావరణ, అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ గుర్తు చేశారు. మంగళవారం ప్రపంచ ధరిత్రీ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ లో ఎర్త్ డే స్టూడెంట్, యూత్ ఇన్ యాక్షన్ పోస్టర్‌ను ఆమె విడుదల చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూమి సమస్త జీవరాశులకూ ఆధారమని, పుడమి తల్లి మానవాళి జీవనానికి అవసరమై గాలి, నీరు, ఆహారం, ఉపాధి కల్పిస్తోందన్నారు.వాతావరణ మార్పులు వంటి ఇతరత్రా చర్యలతో ప్రకృతి వనరులు విధ్వంసానికి గురవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

ఇంధనాలు, గ్రీన్‌హౌస్ వాయువుల వినియోగాన్ని గణనీయంగా తగ్గించుకోవాలని సూచించారు.అలాగే, సౌరపవన విద్యుత్ వంటి పునరుత్పాదక ఇంధనాలను పెంచుకోవాలన్నారు.రానున్న రోజుల్లో భూమిని కాపాడుకునేందుకు సోలార్ ఎనర్జీ చాలా అవసరమని, సోలార్ ఎనర్జీని ప్రోత్సాహించేందుకు దేవాదాయ శాఖకు చెందిన భూముల వినియోగంపై చర్యలు తీసుకుంటున్నట్టు మంత్రి సురేఖ తెలిపారు.ప్రతి ఒక్కరూ సోలార్ ఎనర్జీని వినియోగించుకునే విధంగా అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని, తద్వారా పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాని ఆమె పిలుపునిచ్చారు.

# నేడు హైదరాబాద్ లోకల్‌బాడీ ఎమ్మెల్సీ ఎన్నిక

## బరిలో నిలిచిన ఎంఐఎం-బిజెపి అభ్యర్థులు

**హైదరాబాద్, ఏప్రిల్ 22, ప్రభాతవార్త:** హైదరాబాద్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక నేడు జరగనుంది. అందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. బుధవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 వరకు బ్యాలెట్ పద్దతిలో పోలింగ్ జరుగనుంది. అనంతరం ఏప్రిల్ 25న (శుక్రవారం) కౌంటింగ్ జరుగుతుంది. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలోనే పోలింగ్, కౌంటింగ్ నిర్వహించనున్నారు. ఎన్నికల కోసం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఒకటి కార్పొరేటర్లకు, మరొకటి ఎక్స్ ఆఫీషియో సభ్యులకు పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు.

హైదరాబాద్ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంఐఎం, బీజేపీ పార్టీలు పోటీలో ఉన్నాయి. ఎంఐఎం అభ్యర్థిగా మీర్జా రియాజ్ ఉల్ హాసన్, బీజేపీ అభ్యర్థిగా గౌతమ్‌రావు బరిలో ఉన్నారు. హైదరాబాద్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లుగా హైదరాబాద్ జిల్లాకు చెందిన జీహెచ్ఎంసీ కార్పొరేటర్లు, ఎక్స్ ఆఫీషియో మెంబర్స్‌గా జిల్లాలోని ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. మొత్తం ఓటర్లు 112, కార్పొరేటర్లు 81,ఎక్స్ ఆఫీషియో సభ్యులు 31 మంది ఓటు వేయనున్నారు.

# ఇంటర్ విద్యార్థులకు మంత్రి సీతక్క శుభాకాంక్షలు

**హైదరాబాద్, ఏప్రిల్ 22, ప్రభాతవార్త:** ఇంటర్ ఫలితాల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకి పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క శుభాకాంక్షలు తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ఇంటర్ సెకెండ్ ఇయర్ ఫలితాల్లో తన సొంత జిల్లా ములుగు మొదటి స్థానంలో, తాను ఇంచార్జ్‌గా ఉన్న ఆసిఫాబాద్ జిల్లా రెండో స్థానంలో నిలవడం పట్ల మంత్రి సీతక్క హర్షం వ్యక్తం చేశారు.

వెనకబడిన జిల్లాలు, గిరిజన ప్రాంతాలుగా పేరున్న ఈ రెండు జిల్లాల విద్యార్దులు ఇంటర్ ఫలితాల్లో సత్తా చాటడం తనకు ఎంతో సంతోషానిచ్చిందన్నారు. ఈ విజయానికి కారణమైన ఆయా జిల్లా కలెక్టర్లను, డీఈవోలను, ఇతర అధికారులకు మంత్రి సీతక్క అభినందనలు తెలిపారు. మొదటి స్థానంలో ములుగును నిలపడంలో కృషి చేసిన కలెక్టర్, ఐటీడీఏ అధికారులు, డీఈవోను మంత్రి సీతక్క ప్రత్యేకంగా అభినందించి వారిని కలెక్టర్ కార్యాలయంలో శాలువాలతో సన్మానించారు.

# ఇంటర్ ఫలితాల్లో శ్రీచైతన్య విజయభేరి

**హైదరాబాద్, ఏప్రిల్ 22, ప్రభాతవార్త:** మంగళవారం విడుదలైన తెలంగాణ ఇంటర్మీడియట్ ఫలితాల్లో శ్రీచైతన్య విజయభేరి మోగించింది. జూనియర్ ఇంటర్ ఎంపిసిలో 470 మార్కులకు గాను శ్రీచైతన్య స్టేట్ టాప్ మార్క్ 468తో 103 మంది, 467 ఆపైన 462 మంది, 466 ఆపైన 1073 మంది, 460 ఆపైన 4490 మంది, 450 ఆపైన 8479 మంది శ్రీచైతన్య విద్యార్థులే. జూనియర్ ఇంటర్ బైపిసిలో 440 మార్కులకుగాను శ్రీచైతన్య స్టేట్ టాప్ మార్క్ 438తో 26 మంది, 437 ఆపైన 136 మంది, 436 ఆపైన 304 మంది. 435 ఆపైన 459 మంది, 430 ఆపైన 1495 మంది శ్రీచైతన్య విద్యార్థులే. సీనియర్ ఇంటర్‌లో 1000 మార్కులకుగాను 996 స్టేట్ టాప్ మార్క్‌తోపాటు 995 ఆపైన 7 మంది 994 మార్కులు ఆపైన 46 మంది, 990 మార్కులు ఆపైన 610 మంది, 985 మార్కులు ఆపైన 1776 మంది, 980 మార్కులు ఆపైన 3050 మంది. 950 మార్కులు ఆపైన 9697 మంది శ్రీచైతన్య విద్యార్థులు సాధించారు.

ఇప్పటికే విడుదలైన జెఇఇ మెయిన్- 2025లో 300కి 300 మార్కులు సాధించి ఓపెన్ కేటగిరిలో రెండు ఆలిండియా 1st ర్యాంకులతో పాటు, ఆలిండియా ఓపెన్ కేటగిరిలో టాప్ 10లోపు 4 ర్యాంకులు, 100 లోపు ఆలిండియా ఓపెన్ కేటగిరిలో 31 ర్యాంకులు సాధించి సెన్సేషనల్ రికార్డ్ సృష్టించారు శ్రీచైతన్య విద్యార్థులు. జెఇఇ మెయిన్‌లో అత్యధిక ర్యాంకులు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ శ్రీచైతన్య విద్యార్థులకే రావడం పట్ల శ్రీచైతన్య విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ సుష్మశ్రీ హర్షం వ్యక్తం చేస్తూ... రేపటి ఐఐటి అడ్వాన్స్‌డ్, నీట్‌లలోనూ నంబర్ వన్ ర్యాంకులు సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సుష్మశ్రీ మాట్లాడుతూ... శ్రీచైతన్య సృష్టించిన పటిష్టమైన ప్రోగ్రాములు, సరైన ప్రణాళిక, అగ్రశ్రేణి అధ్యాపకుల శిక్షణతో, ఇంటర్మీడియేట్లో సబ్జెక్ట్స్‌పై మా విద్యార్థులకు కాన్సెప్ట్యువల్‌గా పట్టు సాధించడంతో జాతీయస్థాయి పోటీపరీక్షల్లో మా విద్యార్థులు టాపర్స్‌గా నిలుస్తున్నారని అన్నారు. స్ట్రాంగ్ ఫౌండేషన్ వల్లనే ఈ ఇంటర్మీడియెట్ మార్కులు సాధ్యమయిందని, దీనితో పాటు రాబోయే రిజల్ట్స్ అన్నీ శ్రీచైతన్యవే అనే నమ్మకం మాకుందని అన్నారు. అదేవిధంగా 2023వ సంవత్సరం ఐఐటి-జెఇఇ, నీట్ లాంటి జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో నంబర్ వన్ హ్యాట్రిక్ ర్యాంకులతో శ్రీచైతన్య రికార్డ్ బ్రేక్ చేసి తమ సత్తా చాటుకున్నారని ఈ సందర్భంగా ఆమె గుర్తుచేశారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను, మా విద్యాసంస్థపై నమ్మకం ఉంచిన తల్లిదండ్రులను, దోహదపడిన అధ్యాపక, అధ్యాపకేతర బృందాన్ని, శ్రీచైతన్య విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ సుష్మశ్రీ అభినందించారు.

# వివాహేతర బంధానికి అడ్డుగా ఉన్నాడని యువకుడి హత్య



## సుపారీ గ్యాంగ్‌తో చంపించిన నిందితుడు కానిస్టేబుల్ శ్రీనివాస్

## శవాన్ని బావిలో పడేసిన నిందితులు

## వివరాలు వెల్లడించిన వరంగల్‌సిటీ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్

**ములుగు జిల్లా క్రైమ్(వెంకటాపురం), ప్రభాతవార్త:** వారం రోజులుగా సంచలనం రేపిన చేయూత స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు చిడెం సాయి ప్రకాశ్ మిస్సింగ్ కేసు మిస్టరీ వీడింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడి పిన్ని నిర్మల.. తనను హాస్పిటల్‌కు తీసుకెళ్లమని చెప్పడంతో ఈ నెల 15వ తేదీ సాయంత్రం వెంకటాపురంలోని తన ఇంటి నుండి కారులో హన్మకొండలోని మ్యాక్స్ కేర్ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. ఆస్పత్రి నుంచి బయలుదేరిన సాయిప్రకాశ్ రెండురోజులు అయినా ఇంటికి రాకపోవడంతో వరంగల్ లోని పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు చేశారు. పోలీసులు కేసు దర్యా ప్తు ప్రారంభించారు. వరంగల్ సిటీ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ విలేకరులకు వెల్లడించిన వివరాల ప్రకారం.. మృతుడు చిడెం సాయిప్రకాష్ ఈ నెల 15వ తేదీ సాయంత్రం హాస్పిటల్ నుండి 10.30 గంటలకు తన కారులో వెళ్తూ ఉం డగా వెనకనే ఆటో అనుసరించినట్టు సీసీ పుటేజ్ ఆధారంగా గుర్తించినట్టు తెలి పారు. నయీమ్‌నగర్ దగ్గర ఆటోతో కారుని అడ్డగించి సాయిప్రకాష్‌పై దాడిచేసి అదే కారులో నిందితులం దరూ వెళ్లినట్టు సీపీ సన్‌ప్రీత్‌సింగ్ తెలిపారు. హసన్‌పర్తి సమీపంలో హుస్నాబాద్ దగ్గర చున్నీతో గొంతునొక్కి చంపి వ్యవసాయ బావిలో పడేశారని వివరించారు. హాస్పిటల్ నుండి సాయిప్రకాష్ వెళ్లిపోతున్న సమ యంలో ప్రధాన నిందితుడు కానిస్టేబుల్ బానబోయిన శ్రీనివాస్‌కు సెల్‌ఫోన్ ద్వారా నిర్మల తెలపడంతో దుండగులు ప్రకాష్‌ను అనుసరించారని తెలిపారు. వెంకటాపురంలో కానిస్టేబుల్ శ్రీనివాస్ పనిచేస్తున్న పోలీస్‌స్టేషన్‌కు భూ వివాదం కేసులో చిడెం నిర్మల తన భర్తతో ఫిర్యాదు చేసిన సమయంలోనే కానిస్టేబుల్ శ్రీనివాస్‌తో పరిచయం ఏర్పడి, ఆ పరిచయం వివాహేతర సంబంధంగా మా రింది. ఈ విషయం భర్తకు తెలిసి తన దగ్గర బంధువు వరుసకు కొడుకు అయిన చిడెం సాయిప్రకాష్ చెప్పాడు. దీనితో సాయిప్రకాష్ తన పిన్ని నిర్మలను మందలించి, కానిస్టేబుల్ శ్రీనివాస్‌పైన నిర్మల భర్త చేత ఎస్పీకి ఫిర్యాదు చేశాడు. ఉన్నతాధికారులు స్పందించి నిందితుడు శ్రీనివాస్‌ను సస్పెండ్ చేశారు. సస్పెన్షన్ తర్వాత ములుగులోని వెంకటాపూర్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తూ ఉన్నాడు. తమ వివాహేతర బంధానికి అడ్డుగా వచ్చి, తన సస్పెన్షన్‌కు కారణమైన సాయిప్రకాష్‌పైన నిందితులు ఇద్దరు పగ పెంచు కున్నారు. అవకాశం కోసం ఎదురుచూసి పథకం ప్రకారమే అనారోగ్యం నాటక మాడి హత్య చేయించారని పోలీసు కమిషనర్ తెలియజేసారు. హత్య చేశాక శవాన్ని బావిలో పడేసి మృతుడి కారును వరంగల్‌లోని చింతకుంట డంపింగ్ యార్డ్‌లో వదిలేసారని అన్నారు. స్థానికులు బావిలో నుండి శవాన్నితీసి సమీ పంలో ఉన్న ప్రభుత్వాస్పత్రికి సమాచారం ఇచ్చినప్పటికీ సంబంధికులు ఎవరూ రాకపోవడంతో గ్రామస్తులే శవాన్ని ఖననం చేసినట్టు సిపి వివరించారు. ఈ కేసులో ఆరుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ములుగు వెంటా పురం పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న కానిస్టేబుల్ బాషబోయిన శ్రీనివాస్, దేవిలిసాయి, ఆలోత్ అరుణ్‌కుమార్ ఆలియాస్ పండు, సబావత్ అఖిల్‌నాయక్, రాజు, చింతం నిర్మల పోలీసులు గుర్తించారు.



# శానిటరీ ప్యాడ్ల ఫ్యాక్టరీపై బిఐఎస్ దాడులు

## ఐఎస్ఐ ముద్రలేని 30 వేలు స్వాధీనం

**హైదరాబాద్, ఏప్రిల్ 22,ప్రభాతవార్త :** ఐఎస్ఐ మార్కు లేని శానిటరీ ప్యాడ్లు సరఫరా చేస్తున్న ఓ కేంద్రంపై బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్, హైదరాబాద్ శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. సోమవారం, కుషాయిగూడలోని ఓ కేంద్రంలో జరిగిన సోదాల్లో అమ్మకానికి సిద్ధంగా ఉన్న 30 వేలప్యాడ్లు, 7వేలకుపైగా లేబుల్ కవర్లకు ఐఎస్ఐ మార్కు లేనట్లు గుర్తించిన అధికారులు వాటన్నింటినీ జప్తు చేశారు. మహిళల ఆరోగ్య రక్షణ కోసం ఐఎస్ 5405:2019 ప్రమాణాలున్న శానిటరీ ప్యాడ్లను భారత ప్రభుత్వం క్వాలిటీ కంట్రోల్ ఆర్డర్ గెజిట్ ద్వారా బీఐఎస్ ధ్రువీకరణ తప్పనిసరి చేసింది. బీఐఎస్ ధ్రువీకరణ పొందకుండా అమ్మినా, తయారు చేసినా, నిల్వ చేసినా కఠిన చర్యలు తీసుకునేలా ఆదేశించింది. అయితే, ఈ కేంద్రంలో ఎలాంటి ధ్రువీకరణ లేకుండా పెద్దఎత్తున శానిటరీ న్యాప్‌కిన్లు నిల్వ ఉంచినట్లు సమాచారం అందడంతో అందడంతో సోదాలు నిర్వహించినట్లు బీఐఎస్ హైదరాబాద్ శాఖ అధిపతి, సంచాలకులు పీవీ శ్రీకాంత్ తెలిపారు. జాయింట్ డైరెక్టర్లు సవిత, రాకేశ్ తన్నీరు ఆధ్వర్యంలో బృందాలు ఈ దాడుల్లో పాల్గొన్నాయి.బీఐఎస్ చట్టం 2016లోని పలు సెక్షన్ 17 ప్రకారం భారత ప్రభుత్వం బీఐఎస్ ధ్రువీకరణ తప్పనిసరి చేసిన ఉత్పత్తులేవీ ఐఎస్ఐ మార్కు, ఎలక్ట్రానిక్ వస్తువులకు రిజిస్ట్రేషన్ మార్కు లేకుండా, బీఐఎస్ అనుమతి పొందకుండా తయారు చేసినా, విక్రయించినా, నిల్వ చేసినా రెండేళ్ల జైలు శిక్ష, రూ.2లక్షల జరిమానా మొదటిసారి, ఐదేళ్ల జైలు శిక్ష, రూ.5లక్షల వరకూ జరిమానా రెండోసారి, తదుపరి దీనికి పదిరెట్ల వరకూ శిక్ష పడే అవకాశం ఉంది. ఇప్పటివరకు భారత ప్రభుత్వం 679 ఉత్పత్తులను తప్పనిసరి చేస్తూ పలు క్వాలిటీ కంట్రోల్ ఆర్డర్లు విడుదల చేసింది. వీటిని ఎవరు ఉల్లంఘించినా కఠిన చర్యలు తప్పవని బీఐఎస్ హైదరాబాద్ శాఖాధిపతి పీవీ శ్రీకాంత్ వెల్లడించారు. భారతీయ ప్రమాణాలపై ప్రతీ ఒక్క వినియోగదారుడూ అవగాహన కలిగి ఉండాలని, బీఐఎస్ కేర్ యాప్ ద్వారా వస్తువుల నాణ్యతా ప్రమాణాలను గుర్తించాలని, ఉల్లంఘనలను గుర్తిస్తే అదే యాప్ ద్వారా ఫిర్యాదు చేయాలని కోరారు.

# లగచర్ల బాధితులకు ఇంకా తప్పని వేధింపులు

## చర్యలు తీసుకోకుంటే సుప్రీంకోర్టుకు వెళతాం: మాజీమంత్రి కెటిఆర్



మంగళవారం లగచర్లలో మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 22:** లగచర్ల బాధితులను ఇంకా కొందరు పోలీసులు వేధిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అలాంటి అధికారుల పేర్లను రాసిపెట్టుకుంటామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. మరో మూడేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, అప్పుడు అతిగా ప్రవర్తించిన అధికారులు రిటైర్ అయినా, ఎక్కడ ఉన్నా వారిని గుర్తించి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.మంగళవారం వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం లగచర్ల గ్రామానికి చెందిన మహిళలు బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ వేడుకల నిర్వహణకు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, లగచర్ల భూసేకరణ వివాదంలో మహిళలపై పోలీసులు వ్యవహరించిన తీరును తీవ్రంగా ఖండించారు. బాధ్యులైన పోలీసు అధికారులను వెంటనే విధుల్లోంచి తొలగించాలని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

ఈ ఘటనపై తాము జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ), జాతీయ మహిళా కమిషన్‌లను ఆశ్రయించినట్లు గుర్తు చేశారు. ప్రభుత్వ వైఖరిని, పోలీసుల తీరును ఎన్‌హెచ్‌ఆర్‌సీ తీవ్రంగా తప్పుబట్టిందని కేటీఆర్ గుర్తు చేశారు. మానవ హక్కుల కమిషన్ నివేదిక తర్వాత అయినా రేవంత్ రెడ్డి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. మహిళల పట్ల అనుచితంగా ప్రవర్తించిన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోని పక్షంలో సుప్రీం కోర్టును ఆశ్రయిస్తామని అన్నారు.ఎన్‌హెచ్‌ఆర్సీ సూచించిన విధంగా ఆరు వారాల్లోగా చర్యలు తీసుకోకుంటే రేవంత్ రెడ్డి సోదరుడు తిరుపతి రెడ్డి పాత్ర ఉందని భావించాల్సి ఉంటుందని వ్యాఖ్యానించారు. లగచర్లలో భూసేకరణపై హైకోర్టు స్టే విధించినప్పటికీ భూసేకరణ ప్రక్రియ కొనసాగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని కేటీఆర్ అన్నారు. దీనిని వెంటనే నిలిపివేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.లగచర్ల రైతులను పోలీసులు చిత్రహింసలు పెట్టి, దారుణంగా కొట్టారని ఎన్‌హెచ్‌ఆర్సీ రిపోర్ట్‌లో చెప్పారు. సొంత నియోజకవర్గ రైతులను దారుణంగా కొట్టించిన రేవంత్ రెడ్డికి సిగ్గు, ఇజ్జత్ ఉంటే ఈపాటికి రాజీనామా చేయాలి. కానీ రేవంత్ రెడ్డికి ఇజ్జత్ లేదు. పోలీసులు తమపై లైంగిక దాడి చేశారని లగచర్ల మహిళలు ఎన్‌హెచ్‌ఆర్సీ బృందానికి తెలిపారు. రాత్రిపూట గ్రామంపై పోలీసులు దాడి చేసి మహిళల తొడలపై దారుణంగా కొట్టి, కొట్టినట్టు జడ్జి ముందు చెప్తే ఇంకా దారుణంగా కొడతామని బెదిరించారని గిరిజన మహిళలు ఎన్‌హెచ్‌ఆర్సీ వాళ్లకు చెప్పారని కేటీఆర్ తెలిపారు.

# మనస్తాపంతో విద్యార్థిని ఉరివేసుకొని ఆత్మహత్య



అరుంధతి (ఫైల్)

**హైదరాబాద్ (ఎల్.బి.నగర్), ఏప్రిల్ 22, ప్రభాతవార్త:** ఇంటర్ పరీక్షలో ఫెయిల్ కావడంతో ఓ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన నాగోల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. నాగోల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సుక్కు అరుంధతి (17) ఇంటర్మీడియట్ బైపిసి మొదటి సంవ త్సరం చదువుతోంది. మంగళవారం వెలువడిన ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో బోటనీ సబ్జెక్టులో అరుంధతి ఫెయిల్ అయినట్లు ఫలితాల్లో వెల్లడయింది. దీంతో మనస్థాపానికి గురైన అరుంధతి మధ్యాహ్నం 1.20 గంటలకు ఇంటి పైనఉన్న రాడుకు చీరతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. అరుంధతి ఉరి వేసుకున్న విషయాన్ని గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే నాగోల్ సుప్రజ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఆసుపత్రిలో పరీక్షలు చేసిన వైద్యులు అప్పటికే అరుంధతి మరణించినట్లు వెల్లడించారు. అరుంధతి సోదరుడు సుక్కు గౌతం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

# వరుసగా రెండోసారి అత్యుత్తమ మార్కులతో నారాయణ ఆల్‌టైమ్ రికార్డ్!




**హైదరాబాద్, ఏప్రిల్ 22, ప్రభాతవార్త:** మంగళవారం ప్రకటించిన తెలంగాణ రాష్ట్ర ఇంటర్-2025 ఫలితాల్లో నారాయణ విద్యార్థులు సత్తా చాటారు. జూనియర్ ఇంటర్ ఎంపిసి విభాగంలో 470 మార్కులకు గాను 469 మార్కులతో స్టేట్ ఫస్ట్ మార్కు సాధించి విజయదుందుభి మోగించారు. అలాగే సీనియర్ ఇంటర్ ఎంపిసి విభాగంలో 1000 మార్కులకు గాను 995 మార్కులను 18 మంది నారాయణ విద్యార్థులు సాధించారు. అలాగే జూనియర్ ఇంటర్ బైపిసి విభాగంలో 440 మార్కులను గాను 438 మార్కులను ఏకంగా 13 మంది విద్యార్థులు సాధించారు. సీనియర్ ఇంటర్ బైపిసి విభాగంలోనూ 1000 మార్కులకు గాను 995 మార్కులను ఇద్దరు నారాయణ విద్యార్థులు కైవసం చేసుకున్నారు. ఫలితాలను గ్రూపుల వారీగా విశ్లేషిస్తే జూనియర్ ఇంటర్ ఎంపిసి విభాగంలో ఇంటర్ బోర్డ్ చరిత్రలోనే అత్యధికంగా 470 మార్కులకు గాను 469 మార్కులతో నారాయణ విద్యార్థి పి వర్షిణి చరిత్ర సృష్టించింది, 468 మార్కులు 132 మంది, 467 మార్కులు 487 మంది, 466 మార్కులు 866 మంది విద్యార్థులు సాధించారు. అలాగే సీనియర్ ఇంటర్ ఎంపిసి విభాగంలో 1000 మార్కులకు గాను 995 వంటి అత్యుత్తమ మార్కులను 13 మంది విద్యార్థులు కైవసం చేసుకున్నారు. అలాగే 994 మార్కులను 30 మంది, 993 మార్కులను 73 మంది, 992 మార్కులను 106 మంది సాధించారు. అదేవిధంగా జూనియర్ ఇంటర్ బైపిసి విభాగంలో 440 మార్కులకు గాను 438 మార్కులను మొత్తం 13 మంది విద్యార్థులు కైవసం చేసుకోగా.. 437 మార్కులను 27 మంది, 486 మార్కులను 44 మంది, 485 మార్కులను 84 మంది నారాయణ విద్యార్థులు సాధించారు. సీనియర్ ఇంటర్ బైపిసి విభాగంలో 995 మార్కులు ఇద్దరు సాధించగా, 994 మార్కులు నలుగురు, 993 మార్కులు ఇద్దరు, 992 మార్కులు ఐదుగురు సాధించారని నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ పి సింధూర నారాయణ, శరణి నారాయణ, రమా నారాయణ తెలిపారు. అదే విధంగా జూనియర్ ఇంటర్ హెచ్‌పిజిలోనూ నారాయణ విజయప్రస్థానం కొనసాగిందని తెలిపారు. 475 మార్కులకు గాను 470 మార్కులు ఒకరు, 469 మార్కులు ఒకరు, 468 మార్కులు నలుగురు, 467 మార్కులు 7 మంది.. అలాగే సీనియర్ ఇంటర్ హెచ్‌పిజి విభాగంలో స్టేట్ టాప్ మార్కు 988 మార్కులు కాగా, టాప్ మార్కును నారాయణ విద్యార్థి కైవశం చేసుకున్నారు. అలాగే 985 మార్కులను ముగ్గురు, 984 మార్కులను నలుగురు సాధించారన్నారు. హెచ్‌పిజిలో టాప్ మార్కులన్నీ నారాయణ విద్యార్థులే కైవసం చేసుకోవటం గమనార్హం. ఈ స్థాయి ఫలితాలు నారాయణ తప్ప మరి ఏ ఇతర సంస్థ సాధించలేదని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా రమా నారాయణ మాట్లాడుతూ జూనియర్ ఇంటర్లో ఆల్‌టైమ్ హయ్యస్ట్ మార్కులు వరుసగా రెండవ సారి నారాయణ సాధించటం ఎంతో గర్వకారణం అన్నారు. ఆరంభం నుండి ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రాము పటిష్టమైన మైక్రోషెడ్యూల్స్ రూపొందించి కాన్సెప్ట్యువల్ ఓరియంటేషన్లో విద్యాబోధన చేయటం వల్లనే తమ విద్యార్థులు ఇంతటి అద్భుత ఫలితాలను సాధించగలిగారని తెలిపారు. శరణి నారాయణ మాట్లాడుతూ తెలంగాణలోని నారాయణ విద్యాసంస్థల్లో జూనియర్, సీనియర్ ఇంటర్‌లో అత్యధిక పాస్ పర్సంటేజ్ సాధించటం జరిగిందని చెప్పారు. సబ్జెక్టుల వారీగా విశ్లేషణాత్మక ధోరణిలో విద్యార్థుల మేధోసంపత్తిని పెంపొందించే విధంగా పాఠ్యాంశాల బోధన చేయటం అనేది నారాయణ ప్రత్యేకతగా చెప్పారు. డాక్టర్ పి సింధూర నారాయణ మాట్లాడుతూ గత 46 సంవత్సరాల నారాయణ అప్రతిహత విజయప్రస్థానానికి కొనసాగింపుగా, నేటి ఇంటర్ ఫలితాలే నిదర్శనమన్నారు. నేటి ఈ ఫలితాలే రేపటి జేఈఈ అడ్వాన్స్‌డ్, నీట్ ఫలితాలకు సోపానమన్నారు. ప్రవేశ పరీక్షలన్నింటిలోనూ తను విద్యార్థులే అత్యద్భుత ర్యాంకులు సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇంతటి ఘనవిజయాన్ని సాధించిన తమ విద్యార్థులకు, తల్లిదండ్రులకు, ఆధ్యాపకబృందానికి నారాయణ విద్యాసంస్థల తరఫున అభినందనలు తెలిపారు.



మంగళవారం వలిగొండలో జరిగిన సభలో మాట్లాడుతున్న పొంగులేటి

# ప్రజల చెంతకు ప్రభుత్వం

## పైలట్ ప్రాజెక్ట్‌గా మండలానికి ఒక గ్రామం ఎంపిక

## త్వరలో 6 వేల సర్వేయర్ పోస్టులను భర్తీ చేస్తాం

### మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

**భువనగిరి ,ఏప్రిల్ 22 ప్రభాత వార్త :**ఎన్నో ఏళ్లుగా లక్షలల్లో పేరుకు పోయిన భూ సమస్యలకు భూభారతి చట్టంతో పరిష్కారం లభించనున్నదని రాష్ట్ర రెవెన్యూ,గృహనిర్మాణ,సమాచారపౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మంగళవారం యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో భూ భారతి(ఆర్ఓ ఆర్)చట్టం పై నిర్వహించిన అవగాహన సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు.ఈ కార్యక్రమానికి స్థానిక భువనగిరి శాసన సభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి అధ్యక్షత వహించగా ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య, భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, నకిరికల్ శాసనసభ్యులు వేముల వీరేశం లు పాల్గొన్నారు. ఈసందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ భూ భారతి చట్టాన్ని పటిష్టంగా అమలు పరిచేందుకు తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్ మినహాయించగా మిగిలిన 32 జిల్లాలలో 4జిల్లాలను పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసామని, ఆయా జిల్లాలలో జిల్లాకు ఒక మండలము ఎంపికచేసి భూ భారతి (రికార్డ్స్ ఆఫ్ రైట్స్) చట్టం అమలు చేస్తున్నామ న్నారు.2025, మే 1వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా మిగతా 28 జిల్లాలోనూ జిల్లాకు ఒక మండలము ఎంపిక చేసి భూభారతి చట్టాన్ని పకడ్బందీగా అమలు పరుస్తామన్నారు. ధరణి క్రింద స్వీకరించిన పరిష్కారం కాని 9.26 లక్షల దరఖాస్తులను భూభారతి లో పరిష్కరిస్తామన్నారు. కబ్జాకు గురైన ప్రభుత్వ రెవెన్యూ, ఫారెస్ట్, భూదాన్,వక్ఫ్, దేవాదాయ భూములపై పోర్టల్ ద్వారా ఫిర్యాదులు అందించవచ్చునని, ఆక్రమించిన వారు ఎవరైనా విడిచిపెట్టే ప్రసక్తి లేదని, కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎం.హనుమంతరావు, అదనపు కలెక్టర్(రెవెన్యూ) జి.వీరారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అవేజ్ చిస్తీ, భువనగిరి మార్కెట్ చైర్మన్ రేఖ బాబురావు, వలిగొండ మార్కెట్ కమిటీ ఛైర్మన్ భీమ నాయక్, ఆర్డీఓ లు కృష్ణారెడ్డి, శేఖర్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# లగచర్ల ఘటనలో గీత దాటిన పోలీసులు

## ఘటనతో సంబంధం లేని వ్యక్తులనూ అరెస్ట్ చేశారని ఎన్‌హెచ్ఆర్సీ స్పష్టీకరణ

### 3 అంశాలపై నివేదిక సమర్పించాలని సీఎస్, డీజీపీలకు ఆదేశం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్.ఏప్రిల్22:** వికారాబాద్ జిల్లా లగచర్లలో భూసేకరణ సమయంలో పోలీసులు వ్యవహరించిన తీరు మాత్రం చట్టప్రకారం లేదు. వారు గీత దాటి వ్యవహరించారు. గ్రామస్థుల మానవ హక్కులను పోలీసు సిబ్బంది ఉల్లంఘించడం నిజమని దర్యాప్తులో తేలింది. ప్రజా సేవకులైన పోలీసు అధికారులు, జిల్లా అధికారులు బాధిత గ్రామ ప్రజల మధ్య సుహృద్భావ వాతావరణాన్ని సృష్టించాల్సి ఉన్నా, వారు భూసేకరణ ప్రక్రియను సున్నితంగా పూర్తి చేయలేకపోయారని జాతీయ మానవ హక్కుల సంఘం దర్యాప్తు బృందం స్పష్టం చేసింది.సున్నితమైన అంశాన్ని చక్కదిద్దే విషయంలో పోలీసులు వ్యవహరించిన తీరు చట్టప్రకారం లేదని స్పష్టం చేసింది.ఘర్షణలు జరిగినప్పుడు ఊర్లోలేని మైనర్లు, విద్యార్థులు, ప్రభుత్వ ఉద్యోగులపై కేసులు పెట్టడాన్ని తప్పుబట్టింది. ప్రభుత్వ అధికారులపై దాడిచేసిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకూడదనేది ఎన్‌హెచ్ఆర్సీ, వారి విషయాలను ప్రభుత్వ సంస్థలు పునఃపరిశీలించాలని సూచించింది.ఆయా ప్రజల జీవనోపాధితో నేరుగా సంబంధం ఉన్న సున్నితమైన అంశంపై పోలీసులు, ఇతర అధికారులు చర్యలు తీసుకొనే సమయంలో వారి మానవ హక్కులకు భంగం కలగకుండా చూడాలంది. అధిక బలగాలను మోహరించి వేధించ కూడదన్న ఎన్‌హెచ్ఆర్సీ, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలంది. మూడు అంశాలపై నివేదిక సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీలను ఆదేశించింది.

# మహేష్ బాబుకు ఇడి నోటీసులు

## 28వ తేదీన విచారణకు రావాలని ఆదేశం

**హైదరాబాద్, ఏప్రిల్ 22, ప్రభాతవార్త:** టాలీవుడ్ హీరో మహేష్ బాబుకు కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఈడీ) నోటీసులు జారీ చేసింది. నగరంలో ఇటీవల సాయి సూర్య డెవలపర్స్‌తో పాటు సురానా సంస్థలపై ఈడీ దాడులు చేయడం తెలిసిందే. ఈ రెండు సంస్థల్లో అక్రమాలు జరిగినట్లు ఈడీ వెల్లడించడం విదితమే. ఈ రెండు సంస్థల ప్రాజెక్టులకు మహేష్ బాబు ప్రచారకర్తగా వ్యవహరించారని ఈడీ గుర్తించింది. ఇందుకుగానూ ఆయన 2.5 కోట్ల రూపాయల నగదు, 3.4కోట్ల మేరకు చెక్ రూపంలో అందుకున్నట్లు ఈడీ నిర్ధారించింది. ఈ సంస్థల నుంచి అంత మొత్తం అందుకున్న తరువాత సామాన్య ప్రజలను ఆ సంస్థల్లో పెట్టుబడులు పెట్టే విధంగా మహేష్ బాబు విస్తృతంగా ప్రచారం చేశారని ఈడీ గుర్తించింది. మహేష్ బాబు ప్రచారం చేయడం వల్లే తాము ఈ సంస్థల్లో కోట్లాది రూపాయలు పెట్టుబడులు పెట్టి మోసపోయామని కొందరు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు సాయి సూర్య డెవల పర్స్‌తోపాటు సురానా సంస్థలపై ఈడీ దాడులు చేబట్టింది. దీని తరువాత మంగళవారం సినీ నటుడు మహేష్ బాబుకు నోటీసులు జారీచేసి ఈ నెల 28వ తేదీన బషీర్‌బాగ్‌లోని తమ కార్యాలయానికి విచారణకు రావాలని కోరింది.

# సత్ఫలితాన్ని ఇచ్చిన రాజీవ్ గాంధీ సివిల్స్ అభయ హస్తం

## సివిల్స్‌కి ఎంపికైన 7 గురు అభ్యర్థులు

### అభినందించిన సిఎం రేవంత్, డి.సిఎం భట్టి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్.ఏప్రిల్22:** రాష్ట్ర ప్రభుత్వ మార్గనిర్దేశంలో సింగరేణి కార్పోరేట్ సామాజిక బాధ్యతతో చేపట్టిన రాజీవ్ గాంధీ సివిల్స్ అభయ హస్తం పథకం ప్రారంభించిన మొదటి ఏడాదిలోనే సత్ఫలితాలను సాధించింది. మంగళవారం యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ విడుదల చేసిన ఫలితాల్లో రాజీవ్ గాంధీ సివిల్స్ అభయ హస్తం పథకం కింద ఇంటర్వ్యూకి ఎంపికైన 20 మందికి ఆర్థిక సాయం చేయగా.. అందులో 7 తెలంగాణ యువతీ యువకులు ఉండటం విశేషం. ఇందులో దేశ వ్యాప్తంగా 11 వ ర్యాంకు తెలుగు రాష్ట్రాల నుంచి మొదటి ర్యాంకు సాధించిన సాయి శివాని కూడా ఉన్నారు. అలాగే హరి ప్రసాద్ పోతరాజు (255 వ ర్యాంకు), ప్రీతి రాపర్తి (451 వ ర్యాంకు), నాగరాజ నాయక్ బానోత్ (697వ ర్యాంకు), తొగరు సూర్య తేజ (799వ ర్యాంకు), ఆంజనేయులు గోకమల్ల (934వ ర్యాంకు), రామటెంకి సుధాకర్ (949వ ర్యాంకు) ఉండటం విశేషం. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు సివిల్స్ అభ్యర్థులకు ఉపయుక్తకరంగా ఉండేలా రాష్ట్రంలోని సీనియర్ సివిల్స్ సర్వీసెస్ అధికారుల నేతృత్వంలో మాక్ ఇంటర్వ్యూలను కూడా నిర్వహించారు. ఈ ఇంటర్వ్యూల్లో పాల్గొన్న కర్ణాటకకు చెందిన ప్రీతి(263వ ర్యాంక్), మహారాష్ట్రకు చెందిన రాజు వాఘ్ (871వ ర్యాంక్) సాధించడం విశేషం. సివిల్స్ ప్రాథమిక పరీక్షలో పాసై మెయిన్స్‌కు హాజరవుతున్న అర్హులైన అభ్యర్థులకు ఒక్కొక్కరికి లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందించి ప్రోత్సహించాలని నిర్ణయిం చామని, ఈ మేరకు మొత్తం 140 మందికి సహాయం అందించామన్నారు. మహాత్మ జ్యోతిరావు ఫూలే భవన్‌లో వీరికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేతుల మీదుగా చెక్కులు అందజేశామన్నారు. అలాగే రాష్ట్ర వారి సూచన మేరకు మెయిన్స్‌లో కూడా పాస్ అయి ఫైనల్ ఇంటర్వ్యూకు హాజరవుతున్న వారికి కూడా ఒక్కొక్కరికి లక్ష రూపాయల చొప్పున ప్రోత్సాహకాన్ని ఇదే స్కీంలో భాగంగా ప్రకటించామని, ఎంపికైన 20 మందికి ఈ విధంగా ఆర్థిక సహాయం అందించామన్నారు.

# ఇంటర్ ఫలితాల్లో బాలికలదే హవా

## ప్రైవేటు కంటే గురుకులాల్లోనే ఉత్తీర్ణత శాతం అధికం, విత్‌హెల్డ్‌లో 10, మాల్‌ప్రాక్టీస్ కేసుల్లో 116 మంది

**హైదరాబాద్, ఏప్రిల్ 22, ప్రభాతవార్త:** రాష్ట్రంలో గత 5, 6 ఏళ్లగా ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షా ఫలితాల ఉత్తీర్ణతలో బాలికలే ముందంజలో ఉంటున్నారు. ఉత్తీర్ణత శాతంలో సెకండియర్ తోపాటు మొదటి సంవత్సరం ఫలితాల్లోనూ బాలికలే ముందుంటున్నారు. సెకండియర్ ఫలితాల్లో బాలుర కంటే బాలికలు ఉత్తీర్ణత 16.90 శాతం ఎక్కువగా ఉండగా మొదటి సంవత్సరంలో 16 శాతం ఉత్తీర్ణత ఎక్కువగా సాధించారు. మొదటి సంవత్సరంలో 31 మంది విద్యార్థులపై మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు చేయగా నలుగురి ఫలితాలను విత్‌హెల్డ్‌లో పెట్టారు. ఇక ద్వితీయ సంవత్సరంలో 85 మందిపై మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు చేయగా.. 6మంది విద్యార్థుల ఫలితాలను విత్‌హెల్డ్‌లో పెట్టారు.

**ఇంటర్ ఫలితాల్లో వివిధ గణాంకాలు:** మొదటి సంవత్సరంలో 4,88,430 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా వారిలో 3,22,191 మంది ఉత్తీర్ణత సాధించారు. ఉత్తీర్ణత శాతం 65.96శాతం. వారిలో బాలికలు 73.83 శాతం కాగా బాలురు 57.83 శాతంగా ఉన్నారు. ద్వితీయ సంవత్సరంలో 5,08,582 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా వారిలో 3,33,908 మంది పాసయ్యారు. వారిలో బాలికలు 74.21 శాతం ఉత్తీర్ణత సాధించగా.. బాలురు 57.31 శాతం పాసయ్యారు.

**గ్రూపు వారీగా ఉత్తీర్ణత శాతం**

**మొదటి సంవత్సరం ఫలితాలు**

| గ్రూపు | హాజరు | ఉత్తీర్ణత | శాతం |
|---|---|---|---|
| ఎంపీసీ | 2,23,996 | 1,71,691 | 76.65 |
| బైపీసీ | 98,646 | 66,962 | 67.88 |
| సీఈసీ | 92,745 | 42,259 | 45.56 |
| హెచ్ఈసీ | 8959 | 3092 | 34.51 |
| ఎంఈసీ | 14,600 | 9567 | 65.53 |

**రెండవ సంవత్సరం ఫలితాలు**

| గ్రూపు | హాజరు | ఉత్తీర్ణత | శాతం |
|---|---|---|---|
| ఎంపీసీ | 2,34,916 | 1,69,686 | 72.23 |
| బైపీసీ | 98,958 | 71,181 | 71.93 |
| సీఈసీ | 1,03,713 | 48,658 | 46.92 |
| హెచ్ఈసీ | 9031 | 4178 | 46.26 |
| ఎంఈసీ | 15,316 | 8724 | 56.96 |

**5 సంవత్సరాలుగా ఇంటర్ ఫలితాల వివరాలు..**

**ఇంటర్(జనరల్) మొదటి సంవత్సరం ఫలితాలు**

| సంవత్సరం | హాజరు | ఉత్తీర్ణత | శాతం |
|---|---|---|---|
| 2021 | 4,09,911 | 4,09,911 | 100 |
| 2022 | 4,14,380 | 2,68,763 | 64.86 |
| 2023 | 4,33,082 | 2,72,208 | 62.85 |
| 2024 | 4,30,413 | 2,62,829 | 61.06 |
| 2025 | 4,39,302 | 2,93,852 | 66.89 |

**ఇంటర్(జనరల్) ద్వితీయ సంవత్సరం ఫలితాలు**

| సంవత్సరం | హాజరు | ఉత్తీర్ణత | శాతం |
|---|---|---|---|
| 2021 | 4,07,684 | 4,07,684 | 100 |
| 2022 | 3,92,258 | 2,69,431 | 68.68 |
| 2023 | 3,80,920 | 2,56,243 | 67.27 |
| 2024 | 4,01,445 | 2,78,856 | 69.46 |
| 2025 | 3,99,943 | 2,85,435 | 71.37 |

# ఆర్వియుఎన్ఎల్ ఒప్పందం ఫెడరల్ స్ఫూర్తికి నిదర్శనం

## రాజస్థాన్ విద్యుత్‌శాఖ మంత్రి హీరాలాల్ నగర్‌తో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క భేటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్.ఏప్రిల్22:** దేశంలో ఇంధన రంగంలో విప్లవాత్మక మార్పులకు రాష్ట్రాల మధ్య పరస్పర సహకారం అత్యంత కీలకమని, ఇందుకు తెలంగాణ ప్రభుత్వ రంగ సంస్థ సింగరేణి, రాజస్థాన్ విద్యుత్ ఉత్పాదన్ నిగమ్ లిమిటెడ్ మధ్య ఇటీవల జరిగిన 3100 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటు ఒప్పందమే గొప్ప నిదర్శనమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. తెలంగాణ రాజస్థాన్ మధ్య గతంలో చేసుకున్న సోలార్, థర్మల్ విద్యుత్ ఒప్పందాలను ముందుకు తీసుకువెళ్లే క్రమంలో బి.ఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో రాజస్థాన్ విద్యుత్ శాఖ మంత్రి హీరాలాల్ నగర్‌తో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు మంగళవారం సాయంత్రం భేటీ అయ్యారు. తెలంగాణ,రాజస్థాన్ ప్రభుత్వ రంగ సంస్థల మధ్య జరిగిన ఒప్పందం ఫెడరల్ స్ఫూర్తికి గొప్ప నిదర్శనమని పేర్కొంటూ దీన్ని వీలైనంత త్వరగా ముందుకు తీసుకెళ్లేలా ఈ సమావేశంలో కీలక నిర్ణయాలను భట్టి విక్రమార్క ప్రకటించారు. ముఖ్యంగా ఒప్పందంలో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో నెలకొల్పనున్న 1600 మెగావాట్ల థర్మల్ ప్లాంట్లలో ఒకటైన సింగరేణి 800 మెగావాట్ల అల్ట్రా సూపర్ క్రిటికల్ థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణపు పనులకు వచ్చే నెల 2వ వారంలో శంకుస్థాపన చేసేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే 3100 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటు కోసం చేసుకున్న ఒప్పందంలో భాగంగా ఇరు కంపెనీలు సంయుక్త భాగస్వామ్య కంపెనీని నెలకొల్పడానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. అలాగే రాజస్థాన్ లో ఏర్పాటు చేయనున్న 1500 మెగావాట్ల సోలార్ ప్లాంట్ల కోసం భూ పరిశీలన ఒక సారి పూర్తయిందని, మరోసారి అధికారుల బృందం అక్కడికి వెళ్లి ప్లాంట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. ఇరు రాష్ట్రాల్లోని భౌగోళిక పరిస్థితులను గొప్ప అవకాశంగా మార్చుకోవడానికి చేసుకున్న ఈ ఒప్పందంలో పేర్కొన్న విధంగా విద్యుత్ ప్లాంట్లను వీలైనంత త్వరగా ఏర్పాటు చేయడం ద్వారా ఇంధన రంగంలో స్వయం సమృద్ధిని సాధించ డానికి వీలవుతుందని అభిప్రాయపడ్డారు. ఇరు రాష్ట్రాలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఈ ప్రాజెక్టుపై మంచి పురోగతి ఉండటంతో రాజస్థాన్ విద్యుత్ శాఖ మంత్రి హీరాలాల్ నగర్ సంతృప్తిని వ్యక్తం చేశారు. ఇప్పటికే ఈ ఒప్పందం అమలులో భాగంగా ఆర్ వియుఎన్ఎల్ నుంచి కూడా సమన్వయ అధికారులను నియమించినట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఆర్థిక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, రాష్ట్ర ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్, సింగరేణి డైరెక్టర్లు,రాజస్థాన్ ఆర్వియూఎన్ఎల్ చీఫ్ ఇంజినీర్ విపి గార్గ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# దొంగ దెబ్బతో ఆత్మస్థైర్యం దెబ్బతీయలేరు: సిఎం రేవంత్‌రెడ్డి

## పిరికిపంద చర్యగా అభివర్ణించిన కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, ఏప్రిల్22:** జమ్ము కశ్మీర్‌లోని పహల్గాం ఉగ్రవాద దాడి ఘటనపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా మంగళవారం సాయంత్రం ట్వీట్ చేశారు. ఉగ్రవాదుల కాల్పుల్లో పర్యాటకులు మృతి చెందిన ఘటన తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందని పేర్కొన్నారు. ఈ దుశ్చర్యను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

**పిరికిపంద చర్య: కిషన్‌రెడ్డి** పహల్గాంలో ఉగ్రవాద దాడి ఘటనపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కలత చెంది నట్లు తెలిపారు. మృతుల కుటుంబాలకు ఆయన సంతాపం తెలియజేశారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా జాతి మొత్తం ఏకతాటిపై ఉంటుందని అన్నారు. అమాయక పౌరులపై ఉగ్రవాద దాడి పిరికిపంద చర్యగా అభివర్ణించారు. ఉగ్రవాద కారకులను వదిలిపెట్టే ప్రసక్తి లేదని హెచ్చరించారు.ఉగ్ర దాడిపై మరో కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ కిరాతక దాడికి పాల్పడిన వారు తీవ్రమైన పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

**అమాయకుల ప్రాణాలు తీయడం హేయమైన చర్య: అసదుద్దీన్ ఓవైసి :** జమ్ము కశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రవాద దాడిపై హైదరాబాద్ ఎంపీ, మజ్లిస్ పార్టీ అధినేత అసదుద్దీన్ ఓవైసీ స్పందించారు. ఈ దాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. అమాయకులైన పర్యాటకులను లక్ష్యంగా చేసుకుని కాల్పులు జరపడం అత్యంత దుర్మార్గమైన చర్య అని అభివర్ణించారు. సైనిక దుస్తులు ధరించి వచ్చి అమాయక ప్రజల ప్రాణాలు తీయడం హేయమైన చర అన్నారు. ఈ దుశ్చర్యకు బాధ్యులైనవారిని గుర్తించి,కఠినంగా శిక్షించా లని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు.

**ఉగ్రదాడిని ఖండించిన కెసిఆర్**

జమ్ము కాశ్మీర్ పహల్గావ్ లో ఉగ్రవాదుల దాడిలో పలువురు పర్యాటకుల మరణం పట్ల బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ,సంతాపం ప్రకటించారు. శోకతప్తులైన వారి కుటుంబసభ్యులకు కేసీఆర్ తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

# జత్వానీ కేసులో ఎపి మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్ ఆంజనేయులు అరెస్టు



**హైదరాబాద్, ఏప్రిల్ 22, ప్రభాతవార్త:** ఎపిలో సంచలనం రేపిన ముంబాయి నటి జత్వానీ వేధింపుల కేసులో ఆ రాష్ట్ర ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ పెండ్యాల సీతారా మాంజనేయులు (పిఎస్ఆర్ ఆంజనేయులు) మంగళవారం హైదరాబాద్‌లో అరెస్టయ్యారు. వైకాపా హయాంలో జత్వానీ కేసు సంచలనం రేపడం తెలిసిందే. వైకాపా నేత కుక్కల విద్యాసాగర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు జత్వానీపై విజయవాడ పోలీసులు ఫోర్జరీ, చీటింగ్ కేసు నమోదు చేసి ముంబాయిలో వున్న ఆమెను, ఆమె తల్లిదండ్రులను అప్పట్లో అరెస్టు చేయడం విదితమే. అయితే తనను అన్యాయంగా అరెస్టు చేశారని జత్వానీ ఎపిలో కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక పోలీసులకు ఫిర్యాదు చే యగా దీనిపై కేసు నమోదు చేసుకుని విచారణ చేబట్టారు. ఈ కేసులో వైకాపా నేత విద్యాసాగర్‌ను ఇప్పటికే అరెస్టు చేయగా ఆయన నెలన్నర పాటు జైల్లో వుండి బె యిలుపై విడుదలయ్యారు. ఇదే కేసులో రెండవ నిందితుడుగా నాటి ఎపి ఇంటెలిజెన్స్ చీఫ్ పిఎస్ఆర్ ఆంజనేయులు వున్నారు. పిఎస్ఆర్ ఆంజనేయులుతో పాటు నాటి విజయవాడ కమిషనర్ కాంతిరాణా టాటా, ఎస్పి విశాల్ గున్నిలు కూడా నిందితులుగా వున్నారు. ఈ కేసులో పిఎస్ఆర్ ఆంజనేయులుతో పాటు కాంతి రాణా టాటా, విశాల్ గున్నిలను ఎపి సర్కారు ఎనిమిది నెలల క్రితం సస్పెండ్ చేసి విచారణకు ఆదేశించింది. ఈ కేసు విచారణలో భాగంగా పిఎస్ఆర్ ఆంజనేయులును అరెస్టు చేసేందుకు ఎపి సిఐడి పోలీసులు మంగళవాంం తెల్లవారు జామున నాలుగు గంటల ప్రాంతంలో హైదరా బాద్‌కు వచ్చారు. మొయినాబాద్‌లోని తన ఫాం హౌజ్‌లో వు న్న పిఎస్ఆర్ ఆంజనేయులుకు ఈ విషయం తెలియడంతో తెల్లవారుజామున ఐదు గంటల సమయంలో బేగంపేట్‌లోని తన వియ్యంకుడి ఇంటికి వెళ్లారు. ఎపి సిఐడి పోలీసులు కూడా బేగంపేట్‌కు వెళ్లి తన వియ్యంకుడి ఇంట్లో వున్న పిఎస్ఆర్ ఆంజనేయులును అరెస్టు చేశారు. అనంతరం ఆయనను మొయినాబాద్‌లోని ఫాం హౌజ్‌కు తీసుకువెళ్లిన ఎపి సిఐడి పోలీసులు తాము ఎందుకు వచ్చింది ? వివరించారు. జత్వానీ కేసులో విచారణకు సంబంధించి అరెస్టు చేస్తున్నామని, ఈ విషయంలో స హకరించాలని పిఎస్ఆర్ ఆంజనేయులును కోరారు. అనంతరం మొయినాబాద్‌లోని పిఎస్ఆర్ ఆంజనేయులు ఫాం హౌజ్‌లో ఆయనను మూడు గంటల పాటు విచారి ంచి అనంతరం కారులో విజయవాడకు తరలించారు. ఈ సందర్భంగా మొయినాబాద్‌లోని పిఎస్ఆర్ ఆంజనేయులు ఫాం హౌజ్ నుంచి ఎపి సిఐడి పోలీసులు జత్వా నీ కేసుకు సంబంధించిన కొన్ని పత్రాలను తమ వెంట తీసుకువెళ్లారు. కాగా పిఎస్ఆర్ ఆంజనేయులు అరెస్టు సందర్భంగా ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా వుండేందుకు తెలంగాణ పోలీసులు ఎపి పోలీసులకు సహకరించారు. 1992 బ్యాచ్‌కు చెందిన పిఎస్ఆర్ ఆంజనేయులు ఉమ్మడి ఎపి కేడర్ అధికారి. తెలుగు రాష్ట్రాలలో పలు చోట్ల ఆయన పనిచేశారు. జత్వానీ కేసులో కాంతి రాణా టాటా, విశాల్ గున్నిలు ఎపి హైకోర్టులో ముందస్తు బెయిల్ తీసుకోగా పిఎస్ఆర్ ఆంజనేయులు బెయిల్‌కు ప్రయత్నించలేదు. తెలుగు రాష్ట్రాల్లో డిజి స్థాయి అధికారి ఒకరు అరెస్టవడం ఇదే తొలిసారి కావడం గమనార్హం.

# మయన్మార్‌లో సైబర్ క్రైమ్ వెట్టిచాకిరి: కేంద్రమంత్రి సంజయ్ చొరవతో స్వదేశానికి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్.ఏప్రిల్22:** బ్యాంకాక్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి మయన్మార్‌లో సైబర్ ఉచ్చులో చిక్కుకుపోయిన ముగ్గురు తెలంగాణ వాసులు, ఒక ఆంధ్రప్రదేశ్ వ్యక్తిని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ స్వదేశానికి రప్పించారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఆదేశాల మేరకు ఆయన చొరవ తీసుకుని వీరిని భారత్‌కు రప్పించారు. బండి సంజయ్ చొరవతో స్వదేశానికి చేరుకున్న బాధితుల్లో రంగారెడ్డి జిల్లా కొహెడకు చెందిన రాకేష్‌రెడ్డి,ఏ.శివశంకర్, కరీంనగర్ జిల్లాకు చెందిన కానూరి గణేశ్, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఆకుల గురు యువ కిశోర్ ఉన్నారు.వివరాల్లోకి వెళితే,అధిక వేతనాలతో బ్యాంకాక్‌లో ఉద్యోగాలంటూ కొందరు బ్రోకర్లు ఈ యువకులను నమ్మించారు. తీరా వారిని మయన్మార్‌కు తరలించి, అక్కడ సైబర్ మోసాలు చేసేందుకు బలవంతం చేశారు. రోజుకు 16 గంటల పాటు పనిచేయించుకుంటూ, ఎదురు తిరిగితే చిత్రహింసలకు గురిచేసేవారని బాధితులు వాపోయారు.

# ముగిసిన సిఎం రేవంత్ జపాన్ పర్యటన

## పెట్టుబడులు: 12,062 కోట్లు, 30,500 ఉద్యోగాలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్.ఏప్రిల్22:**ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నేతృత్వంలో తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం జపాన్ పర్యటన మంగళవారంతో ముగిసింది. బుధవారం ఉదయం జపాన్ నుంచి సిఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌కు తిరిగి వస్తున్నారు.జపాన్ పర్యటనలో ఇప్పటి వరకు సాధించిన పెట్టుబడులు: రూ.12,062కోట్లు, ఈ మేరకుదాదాపు 30,500 ఉద్యోగాలు లభించనున్నాయి. మారుబెని కంపెనీ: హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో నెక్స్ట్ జనరేషన్ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు ఒప్పందం; రూ.1,000 కోట్లు ప్రారంభ పెట్టుబడి, తర్వాత మొత్తం 5,000 కోట్ల పెట్టుబడుల అంచనా. 30,000 ఉద్యోగాలు. ఎన్‌టీటీ డేటా, నెయిసా: హైదరాబాద్‌లో అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ డేటా సెంటర్ క్లస్టర్ ఏర్పాటుకు ఒప్పందం; రూ.10,500 కోట్ల పెట్టుబడులు. తోషిబా ట్రాన్స్‌మిషన్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్స్ ఇండియా:రుద్రారంలో విద్యుత్ పరికరాలు, సామాగ్రి తయారీ ఫ్యాక్టరీ; 562 కోట్ల పెట్టుబడులు. టామ్‌కామ్‌తో టెర్న్, రాజ్ గ్రూప్: జపాన్‌లో 500 ఉద్యోగ నియామకాలకు ఒప్పందం.



# జపాన్‌లో జయ జయహే తెలంగాణ గీతం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్.ఏప్రిల్22:** జపాన్ దేశం హిరోషిమా నగరంలోని జాతిపిత మహాత్మగాంధీ విగ్రహం వద్ద ఇద్దరు తెలుగు అమ్మాయిలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రతినిధి బృందం ఎదుట 'జయ జయహే తెలంగాణ.. జననీ జయకేతనం' ఆలపించడం అందరినీ ఆకట్టుకుంది. హర్షిణి (8వ తరగతి), హరిణి (7 వ తరగతి) వారి కుటుంబ సభ్యులతో కలిసొచ్చి ముఖ్యమంత్రికి స్వాగతం పలికారు. రేవంత్ రెడ్డి చిత్రాన్ని గీసిన పెన్సిల్‌స్కెచ్ పెయింటింగ్స్‌ను అందించగా సిఎం ఆనందం వ్యక్తం చేసిన వారితో కొద్దిసేపు ముచ్చటించారు. అనంతరం ఆ పిల్లలిద్దరూ గాంధీ విగ్రహం వద్ద జయ జయహే తెలంగాణ.. గీతాన్ని ఆలపించారు.

# సమగ్ర విత్తన చట్టం దిశగా చర్యలు

## 3 నెలల కాలపరిమితితో కమిటీ: మంత్రి నాగేశ్వరరావు



**హైదరాబాద్, ఏప్రిల్ 22, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని రైతు ప్రయోజనాల పరిరక్షణే ధ్యేయంగా సమగ్ర విత్తనచట్టం తెచ్చే దిశగా చర్యలు చేపట్టనున్నట్లు వ్యవ సాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు తెలిపారు. ప్రస్తుతం ఉన్న చట్టంలో నష్ట పరిహారం గురించి ఎలాంటి ప్రస్తావన లేదన్నారు. ఈమేరకు దీనికి సంబంధించి మంగళవారం హైదరాబాద్‌లో రైతు కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డితో కలిసి విత్తన చట్టంపై చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమగ్ర చట్టంపై 3 నుండి 5సభ్యులతో కమిటీ ఏర్పాటు చేసిన ఒక నిర్దిష్టమైన కాల పరిమితిలో 3నెలలలో ముసాయిదా సిద్ధం అయ్యేట్లు చూడాలన్నారు. ఉమ్మడి కాంగ్రెస్ ప్రభుత్వ కాలములో విత్తన చట్టంలో మార్పుల కోసం కొన్ని ప్రయ త్నాలు జరిగాయన్నారు. కోదండరెడ్డి మాట్లాడుతూ వివిధ రాష్ట్రాలలో అమల వుతున్న చట్టాల వివరాలు ముఖ్యంగా మహారాష్ట్రంలో అమలవుతున్న పరి హారం చెల్లింపు వంటివి పరిశీలించాలని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం విత్తనో త్పత్తి రాష్ట్రంగా ఉందని, విత్తన రైతుల ప్రయోజనాలు కూడా కాపాడేవిధంగా చట్టంలో మార్పులు తీసుకురావాల్సి న ఆవశ్యకత ఉందని తెలిపారు. ఈ సమావేశంలో వ్యవసాయ సెక్రటరీ రఘునందన్ రావు, డైరెక్టర్ గోపి తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణిలో మెరిట్ స్కాలర్ షిప్ పెంపు

**హైదరాబాద్, ఏప్రిల్ 22, ప్రభాతవార్త:** ఎంసెట్, నీట్, జేఈఈ మెయిన్స్, ఎయిమ్స్ తదితర కోర్సుల ప్రవేశ పరీక్షల్లో అత్యుత్తమ ర్యాంకులు సాధించిన సింగరేణి కార్మికుల, అధికారుల పిల్లలకు ఇప్పటివరకు ఇస్తున్న వార్షిక స్కాలర్ షిప్ మొత్తాన్ని రూ.10 వేల నుండి రూ.16 వేలకు పెంచుతూ యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే కనీస ర్యాంక్ 2వేల లోపు నుండి 8 వేల లోపువరకు పెంచినట్లు మంగళవారం విడుదలచేసిన ప్రకటనలో తెలియజేసింది. కార్మికుల పిల్లలను ఉన్నత చదువుల పట్ల ఆసక్తి పెంచడానికి, ప్రోత్సహించడానికి 1998లో ఈ స్కాలర్ షిప్ పథకాన్ని ప్రవేశ పెట్టారు. స్కాలర్ షిప్ మొత్తాన్నిపెంచాలని వచ్చిన విజ్ఞప్తి మేరకు 2010లో దీనిని రూ.10వేలకు పెంచారు. ఇటీవల కార్మికుల వినతికి స్పందించి సంస్థ సీఎండీ ఎన్.బలరామ్ ఆదేశంమేరకు సవరించిన సర్క్యులర్‌ను డైరెక్టర్ పా జారీ చేశారు.

# సిసిటిఎన్ఎస్‌పై దృష్టి పెట్టండి

## ఎస్‌పిలు, కమిషనర్లకు డిజిపి ఆదేశం

**హైదరాబాద్, ఏప్రిల్ 22, ప్రభాతవార్త:** నేరాల నివారణ, అసాంఘీక శక్తుల పీచమణచడంలో కీలకంగా వున్న సిసిటిఎన్ఎస్‌పై దృష్టి సారించాలని జిల్లాల ఎస్‌పిలు, పోలీసు కమిషనర్లను డిజిపి జితేందర్ కోరారు. సిసిటిఎన్ఎస్‌కు సంబంధించి అందుబాటులో వున్న అధునాతన టెక్నాలజిని వినియోగించుకోవాలని ఆయన ఆదేశించారు. మంగళవారం తన కార్యాలయం నుంచి ఎస్‌పిలు,కమిషనర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో డిజిపి మాట్లాడారు. సిసిటిఎన్ఎస్ ప్రాజెక్టు అమలులో తెలంగాణ రాష్ట్రం జాతీయ స్థాయిలో ఇప్పటికే అనేక అవార్డులు సాధించిందని, దీనిని ఇలాగే నిలుపుకునేందుకు మరింత కృషి చే యాలని డిజిపి తెలిపారు. ఈ సమావేశంలో శాంతి భద్రతల అదనపు డిజి మహేష్ భగవత్ సహా ఇతర అధికారులు పాల్గొన్నారు.

**సివిల్స్‌లో మెరిసిన డిఎస్‌పి కుమారుడు:డిజిపి అభినందన**

యుపిఎస్‌సి మంగళవారం విడుదల చేసిన సివిల్స్ ఫలితాల్లో డిజిపి కార్యాలయంలో డిఎస్‌పిగా వున్న వేణుగోపాల్ కుమారుడు అన్ను కౌశిక్ నరసింహా 225 ర్యాంకు సాధించాడు. ఈ సందర్భంగా డిఎస్‌పి వేణుగోపాల్‌కు డిజిపి జితేందర్ మంగళవారం తన కార్యాలయానికి పిలిపించుకుని పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు.225ర్యాంకు సాధించిన నరసింహాకు ఐపిఎస్ లేదా ఐఎఫ్ఎస్ రావచ్చని భావిస్తున్నారు. కేరళలోని కోచిలో జరిగిన అఖిల భారత పోలీసు బ్యాట్మింటన్ టోర్న మెంట్‌లో తెలంగాణ పోలీసు క్రీడాకారులకు 14 పతకాలు దక్కాయి.ఇందులో రెండు బంగారు,రెండువెండి, పది కాంస్య పతకాలు వున్నాయి.పతకాలు సాధించిన వారిని డిజిపి ప్రత్యేకంగా అభినందించారు.

# చెన్నమనేని రమేష్‌పై సిఐడి కేసు

## డిజిపికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఫిర్యాదు

**హైదరాబాద్, ఏప్రిల్ 22, ప్రభాతవార్త:** వేములవాడ మాజీ ఎంఎల్ఎ చెన్నమనేని రమేష్‌పై సిఐడి కేసు నమోదు చేసింది. జర్మని పౌరసత్వం కలిగి వుండి, తప్పుడు పత్రాలతో భారతీయుడుగా చెబుతూ ఎన్నికల్లో పోటీచేసినందుకుగానూ ఆయనపై సిఐడిలో మంగళవారం ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. రమేష్‌పై కొన్నేళ్లుగా పోరా టం చేస్తున్న వేములవాడ ఎంఎల్ఎ, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ డిజిపికి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సిఐడిలో కేసు నమోదయ్యింది. రమేష్ భారత పౌరుడు కాదని గతంలో కేంద్రం ఇచ్చిన ఉత్తర్వులను సమర్థిస్తూ హైకోర్టు ఇటీవలే ఆదేశాలు వెలువరించడం తెలిసిందే. దీంతో పాటు ఈ విషయమై పోరాటం చేసిన ఆది శ్రీనివాస్‌కు 25 లక్షల రూపాయలు, లీగల్ అథారిటికి ఐదు లక్షలరూపాయలు చెల్లించాలని కూడా హైకోర్టు ఉత్తర్వులు ఇవ్వడం విదితమే. హైకోర్టు ఆదేశాల మేరకు రమేష్ సోమవారం ఈ చెల్లింపులు జరిపారు. దీని తరువాత ఆది శ్రీనివాస్ రమేష్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. ఇదే విషయమై ఆయన మంగళవా రం డిజిపి జితేందర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఇదే విషయమై వివరాలు అందించేందుకు ఆది శ్రీనివాస్‌ను బుధవారం లక్‌డికాపూల్‌లోని సిఐడి కార్యాలయానికి రావాలని సిఐడి అధికారులు కోరారు.

# కౌశిక్ రెడ్డి పిటిషన్‌పై హైకోర్టు తీర్పు రిజర్వు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్.ఏప్రిల్22:** బిఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి పిటిషన్‌పై హైకోర్టులో విచారణ పూర్తయింది. కౌశిక్ రెడ్డి పిటిషన్‌పై తీర్పును హైకోర్టు రిజర్వు చేసింది. కమలాపురం పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసు కొట్టేయాలని కౌశిక్‌రెడ్డి పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. గతేడాది నవంబర్ 1న ఎన్నికల ప్రచార సభ నిర్వహించిన కౌశిక్ రెడ్డి తనకు ఓటు వేయకపోతే ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించినట్లు ఎన్నికల అధికారి కమలాపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.దీంతో ఆయనపై కేసు నమోదు అయింది.దర్యాప్తు నిర్వహించిన పోలీసులు అభియోగపత్రం దాఖలు చేశారు. నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టులో ఈ కేసు విచారణ పెండింగ్‌లో ఉంది. అయితే రాజకీయ కక్షలవల్లే కేసు నమోదు చేశారన్న కౌశిక్ రెడ్డి తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు. పోలీసులు తప్పుడు సెక్షన్లు నమోదు చేశారని న్యాయవాది రమణారావు తెలిపారు. మరోవైపు ఎన్నికల ప్రచారసభలో ఆత్మహత్య పేరుతో కౌశిక్ రెడ్డి ఓటర్లను బెదిరించారని పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదించారు. కోడ్ ఉల్లంఘించినందుకే నోడల్ అధికారి ఫిర్యాదుతో కేసు పెట్టారని పిపి అన్నారు. అయితే సాక్షులుగా ఓటర్ల వాంగ్మూలం ఎందుకు నమోదు చేయలేదని లాయర్‌ని హైకోర్టు ప్రశ్నించింది. ఇరువైపులా వాదనలు ముగియడంతో హైకోర్టు తీర్పును రిజర్వు చేసింది.

# కాశ్మీరేతరులను టార్గెట్ చేయడమే ఉగ్రమూకల లక్ష్యం

**హైదరాబాద్, ఏప్రిల్ 22, ప్రభాతవార్త:** జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాంలోని బైసరీన్ ప్రాంతంలో మంగళవారం మధ్యాహ్నం పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన కా ల్పుల్లో 27 మందికి పైగా చనిపోవడం దేశ వ్యాప్తంగా సంచలనం రేపింది. కాగా దీనికి తామే బాధ్యులమని ప్రకటించిన ది రెసిస్టెన్స్ ఫ్రంట్ (టిఆర్ఎఫ్) పాక్ కేంద్రంగా పనిచేసే బడా ఉగ్రవాద సంస్థ లష్కర్ ఏ తోయిబాకు అనుబంధ సంస్థ. లష్కర్ ఏ తోయిబాకు సహకరించేందుకు జమ్మూ కాశ్మీర్‌లో టిఆర్ఎఫ్ తరహాలో అనేక ఉగ్రమూకలు వున్నాయని నిఘా వర్గాలు ఇప్పటికే గుర్తించాయి. కాగా 2019లో జమ్మూ కాశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు చేసిన తరువాత పుట్టుకొచ్చిన చోటా ఉగ్రవాద సం స్థల్లో టిఆర్ఎఫ్ కూడా ఒకటి. ఈ సంస్థకు సాజిద్ జట్, సజ్జద్ గుల్ సలీం రెహమాని అనే ఉగ్రవాదులు నాయకులుగా వున్నారు. ఈ సంస్థ లష్కర్ ఏ తోయిబా అండ దండలతో జమ్మూ కాశ్మీర్‌లో ముఖ్యంగా పాక్ ఆక్రమిత కాశ్మీర్ లోయకు దగ్గరగా వుండే అనంతనాగ్, పహల్గాం, ద్రాస్ సెక్టార్‌లో కాశ్మీరేతరులను టార్గెట్ చేసుకుని దాడులకు పాల్పడుతోంది. ఆర్టికల్ 370 రద్దు చేశాక జమ్మూ కాశ్మీర్‌లో ఇతర రాష్ట్రాలకు చెందిన అనేక మంది కూలీలు, ఇతరులను పథకం ప్రకారం వివరాలు తెలుసు కుని మరీ కాల్చి చంపిన ఉదం తాలు వున్నాయి. ఈ క్రమంలో ఇతర ప్రాంతాలకు చెందిన పలువురు అధికారులు కూడా ప్రాణా లు కోల్పోయారు. టిఆర్ఎఫ్ సహా కొత్తగా పుట్టుకువచ్చిన ఉగ్రమూకలతో పోరాడిన జమ్మూ కాశ్మీర్ కు చెందిన పోలీసులను, వారి కుటుంబీకులను కూడా ఉగ్రవాదులు టార్గెట్ చేసి, కొందరిని కాల్చి చంపారు. అయితే రెండేళ్లుగా జమ్మూ కాశ్మీర్‌లో ఉగ్రవాదులపై పోలీసులు పైచేయి సాధించడంతో అంతా సాఫీగా వుందని భావిస్తుండగా ఉగ్రమూకలు పక్కాగా వ్యూహం పన్ని అమాయకులైన పర్యాటకులను టార్గెట్ చేసుకుని వారిని కాల్చి చంపాయి.

# మే 9న 'శుభం'

ప్రముఖ నటి సమంత నిర్మాతగా మారిన సంగతి తెలిసిందే. సమంత సొంత ప్రొడక్షన్ కంపెనీ ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ బ్యానర్ మీద శుభం అనే సినిమాను నిర్మించారు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన విడుదల తేదీని ప్రకటించారు. శుభం చిత్రాన్ని మే 9న శుక్రవారం ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ చేయబోతోన్నట్టుగా ప్రకటించారు. ఆల్రెడీ శుభం టీజర్‌కు మంచి రెస్పాన్స్ వచ్చిన సంగతి తెలిసిందే. సెన్సిబుల్, హ్యూమర్‌తో శుభం చిత్రం అందరినీ పాత కాలానికి తీసుకు వెళ్లేలా ఉంది. ఫ్యామిలీ మొత్తం కలిసి చూడదగ్గ చిత్రంగా శుభంను మేకర్లు రూపొందించినట్టుగా కనిపిస్తోంది. ఈ చిత్రానికి యువ ప్రతిభావంతులంతా కలిసి పని చేశారు. వివేక్ సాగర్ ఆకర్షణీయమైన నేపథ్య సంగీతం, క్లింటన్ సెరెజో అందించిన మెలోడీ పాటలు ఈ చిత్రానికి హైలెట్ కాబోతోన్నాయి. ఆకర్షణీయమైన కథ చెప్పడంలో 'శుభం' సినిమాతో నిర్మాణంలోకి అడుగు పెట్టిన సమంత నిబద్ధత అందరికీ అర్థం అవుతోంది. ట్రా లా లా మూవింగ్ పిక్చర్స్‌తో వినోదాన్ని అందించే చిత్రాలను రూపొందించడమే తన లక్ష్యం. శుభం ఆ కోవలోకి చెందే చిత్రం అవుతుంది. శుభం కోసం తన టీం ఎంతో కష్టపడింది. ఈ ప్రత్యేకమైన కథను అందరితో పంచుకోవడానికి మేము సంతోషిస్తున్నాము అని సమంత అన్నారు. మే 9న ప్రపంచ వ్యాప్తంగా శుభం విడుదలకు సిద్ధమవుతోంది. ఇది ప్రేక్షకులను పూర్తిగా సంతృప్తిపరిచే చిత్రం అవుతుందని మేకర్లు చెబుతున్నారు. ట్రా లా లా మూవింగ్ పిక్చర్స్ నుంచి మరిన్ని ఎంటర్టైన్మెంట్ చిత్రాలు రానున్నాయని, ఇలానే వినోదాన్ని అందిస్తామని మేకర్లు చెబుతున్నారు.



# వచ్చే యేడాది 'మర్దానీ 3'

యష్ రాజ్ ఫిల్మ్స్ నిర్మాతణంలో వచ్చిన మర్దానీ ఫ్రాంచైజీ ఎంతగా విజయం సాధించిందో అందరికీ తెలిసిందే. ఈ పదేళ్లలో వచ్చిన రెండు సీజన్లకు ఆడియెన్స్‌ను మంచి ఆదరణ లభించింది. భారత దేశంలో అతిపెద్ద, ఏకైక మహిళా కాప్ ఫ్రాంచైజీగా మర్దానీ రికార్డులు క్రియేట్ చేసింది. ప్రస్తుతం మర్దానీ మూడో సీజన్‌కు సంబంధించిన అప్డేట్ వచ్చింది. మర్దానీ 3లోనూ రాణి ముఖర్జీ న్యాయం కోసం నిస్వార్థంగా పోరాడే డేర్‌డెవిల్ కాప్ శివానీ శివాజీ రాయ్ పాత్రను తిరిగి పోషించనున్నారు. సోమవారం (ఏప్రిల్ 21) నాడు మర్దానీ 3 విడుదల తేదీని ప్రకటించారు. మర్దానీ 3 వచ్చే ఏడాది




ఫిబ్రవరి 27న రిలీజ్ కానుంది. పవిత్రమైన హోలీ పండుగ సందర్భంగా మర్దానీ 3ని రిలీజ్ చేయబోతున్నారు. మార్చి 4న వచ్చే హోలీ సందర్భంగా చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా మర్దానీ 3ని విడుదల చేయబోతోన్నారు. ఈ మేరకు రిలీజ్ చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్ అందరినీ ఆకట్టుకుంటోంది.

# మోహిత్ సూరి తెరకెక్కిస్తున్న మూవీ 'సయారా'

అహాన్ పాండే, అనీత్ పద్దా జంటగా యష్ రాజ్ ఫిల్మ్స్ నిర్మాణంలో మోహిత్ సూరి తెరకెక్కిస్తున్న చిత్రం సయారా. తాజాగా ఈ మూవీకి సంబంధించిన అప్డేట్‌ను ఇచ్చారు. ఈ సినిమాను జూలై 18, 2025న ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేయబోతోన్నారు. ఆదిత్య చోప్రా సమర్పణలో అక్షయ్ విద్వానీ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సయారా చిత్రాన్ని ఓ ఇంటెన్స్ ఎమోషనల్ లవ్ స్టోరీగా తెరకెక్కిస్తున్నారు. ఈ మూవీతో హిందీ చిత్ర పరిశ్రమలో అహాన్ పాండే అడుగు పెడుతున్నారు. అనీత్ పద్దా కథానాయికగా నటించిన సయారా చిత్రం యూత్ ఫుల్ రొమాంటిక్ లవ్ ఎంటర్టైనర్‌గా జూలై 18, 2025న ప్రపంచ వ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.






# 'శివ శంభో' ప్రీరిలీజ్

తెలుగు వెండితెరపై మరో భక్తిరస చిత్రం కనువిందు చేయబోతోంది. అనంత ఆర్ట్స్ బ్యానర్‌పై కృష్ణ ఇస్లావత్, సాయి చక్రవర్తి, కేశవర్ధిని బేబీ రిషిత ప్రధాన పాత్రల్లో, నర్సింగ్ రావు దర్శకత్వంలో బొజ్జ రాజ గోపాల్, దోరవేటి సుగుణ నిర్మించిన చిత్రం శివ శంభో. తనికెళ్ళ భరణి, సుమన్ ముఖ్యపాత్రల్లో నటించారు. ఈ చిత్రం (ఏప్రిల్) 25న థియేటర్‌లలో విడుదల కాబోతోంది. ఈ సందర్భంగా చిత్రయూనిట్ ప్రీరిలీజ్ ఈవెంట్‌ను ఘనంగా నిర్వహించింది. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ డా. గోరటి వెంకన్న, బీజేపీ నేత, జంతు ప్రేమికుడు చీకోటి ప్రవీణ్, ప్రముఖ నటుడు, రచయిత డా. తనికెళ్ల భరణి, బర్దీపుర పీఠాధిపతులు శ్రీ శ్రీ శ్రీ సిద్ధేశ్వర గిరి స్వామీజీ, ఫిల్మ్ ఛాంబర్ కార్యదర్శి దామోదర ప్రసాద్, చిత్రపురి కాలనీ అధ్యక్షుడు వల్లభనేని అనిల్ కుమార్, తదితరులు పాల్గొని చిత్రయూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రముఖ నటుడు, రచయిత తనికెళ్ల భరణి మాట్లాడుతూ, చిత్రయూనిట్ సభ్యులందరికి పేరుపేరున శుభాకాంక్షలు, అభినందనలు. ఇలాంటి భక్తిరస చిత్రాలు చాలా అరుదుగా వస్తాయి. భారతీయ కళలైన సంగీతం, సాహిత్యం, నృత్యం ప్రధానాంశాలుగా కలిగిన ఈ సందేశాత్మక చిత్రాన్ని ప్రతి ఒక్కరు ఆదరించగలరనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. బీజేపీ నేత, జంతు ప్రేమికుడు చీకోటి ప్రవీణ్ మాట్లాడుతూ, నర్సింగ్ రావు దర్శకత్వం వహించిన ఈ చిత్రం ప్రతి ఒక్కరి హృదయాల్లో నిలిచిపోతుంది. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలకు మంచి స్పందన వచ్చింది. తెలుగు చిత్రసీమలో ఇది



చెప్పుకోదగ్గ సినిమాగా నిలవాలని కోరుకుంటున్నాను. అని అన్నారు. ఎమ్మెల్సీ గోరటి వెంకన్న మాట్లాడుతూ, సంగీతం, సాహిత్యం, నృత్యం ప్రధానాంశాలుగా కలిగిన ఈ అరుదైన సినిమాను మనమంతా గౌరవించాలి. ఇటువంటి చిత్రాలను ఉత్తమ అభిరుచి గల ప్రేక్షకులు తప్పక ఆదరిస్తారు. చిత్రయూనిట్ సభ్యులందరికి పేరుపేరున శుభాకాంక్షలు, అభినందనలు. అని అన్నారు. చిత్ర నిర్మాతల్లో ఒకరు, రచయిత, సంగీత దర్శకులు దోరవేటి మాట్లాడుతూ, ఏప్రిల్ 25న శివ శంభో చిత్రం విడుదల చేస్తున్నాం. ప్రతి ఒక్కరూ థియేటర్‌కు వెళ్లి చూసి సినిమాను ఆదరించాలని కోరుతున్నాము. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలకు మంచి స్పందన వచ్చింది. ప్రతి ఒక్కరూ అభినందిస్తున్నారు అని అన్నారు. దర్శకుడు నర్సింగ్ ఎంతో శ్రమకోర్చి ఈ సినిమా ను నిర్మించామని, తప్పకుండా మంచి స్పందన వస్తుందని తెల్పుతూ, చిత్ర నిర్మాణానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమం చివర స్వామీజీ ఆశీఃప్రసంగం చేసి, అందరికీ జ్ఞాపికలు బహూకరించారు. బ్యానర్: అనంత ఆర్ట్స్

నిర్మాతలు: బొజ్జ రాజ గోపాల్, సుగుణ దోరవేటి. డైరెక్టర్: నర్సింగ్ రావు
డిఓపి: కారె సతీశ్ కుమార్, హీరో హీరోయిన్: కృష్ణ ఇస్లావత్, సాయి చక్రవర్తి, కేశవర్ధిని బేబీ రిషిత. పాటలు మాటలు, సంగీతం: దోరవేటి, ముఖ్యపాత్రలో: తనికెళ్ళ భరణి, సుమన్, టార్జాన్, విజయ్ రంగరాజన్, చిల్లర వేణు.

# '6జర్నీ' ట్రైలర్ లాంచ్

పాల్యం శేషమ్మ, బసిరెడ్డి సమర్పణలో అరుణ కుమారి ఫిలింస్ బ్యానర్‌పై రూపొందుతున్న చిత్రం '6జర్నీ'. రవి ప్రకాష్ రెడ్డి, సమీర్ దత్త, టేస్టీ తేజ, పల్లవి, రమ్యా రెడ్డి తదితరులు ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. బసీర్ అలూరి దర్శకత్వంలో పాల్యం రవి ప్రకాష్ రెడ్డి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ మూవీ ట్రైలర్‌ను మేకర్స్ విడుదల చేశారు. సెన్సార్ సహా అన్నీ కార్యక్రమాలను పూర్తి చేసుకున్న ఈ చిత్రాన్ని ఏప్రిల్ 25న గ్రాండ్ రిలీజ్ చేయబోతున్నారు. ఈ సందర్భంగా దర్శకుడు బసీర్ మాట్లాడుతూ, 'మా హీరో సమీర్ ఎంతో కష్టపడి నటించారు. రవి ప్రకాష్ రెడ్డి ఈ మూవీని ముందుండి నడిపించారు. మా హీరోయిన్లు అద్భుతంగా నటించారు. టేస్టీ తేజ ఎనర్జీతో నటించాడు. మాకు సింహా మంచి పాటలు ఇచ్చారు. సురేందర్ రెడ్డి మమ్మల్ని ముందుకు నడిపించారు. ఈ మూవీ ఇక్కడకు వచ్చిందంటే అది ఆయన వల్లే. ఆయనకు ఎప్పుడూ రుణపడి ఉంటాను. నాకు ఇంత మంచి ఛాన్స్ ఇచ్చిన మా నిర్మాతకు థాంక్స్. ట్రైలర్‌ను రిలీజ్ చేయండి ఆనందంగా ఉంది. సినిమాను ఏప్రిల్ 25న విడుదల చేస్తున్నాం. సినిమా తప్పకుండా మెప్పిస్తుంది అని అన్నారు. హీరో సమీర్ దత్త మాట్లాడుతూ, డిఫరెంట్ లవ్, యాక్షన్ థ్రిల్లర్‌గా 6జర్నీ తెరకెక్కింది. ఎంటైర్ టీమ్ ఎంతో కష్టపడ్డాం. బసీర్‌గారు సినిమాను బాగా తెరకెక్కించారు. నిర్మాత పాల్యం రవిప్రకాష్‌రెడ్డికి థాంక్స్. ఏప్రిల్ 25న రిలీజ్ కాబోతున్న మా సినిమాను ఆశీర్వదించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అన్నారు. హీరోయిన్ పల్లవి రాథోడ్ మాట్లాడుతూ, ఏప్రిల్ 25న మా 6జర్నీ మూవీ మీ ముందుకు రానుంది. బసీర్‌గారు, రవిప్రకాష్ సపోర్ట్‌తో సినిమాను ఎంతో బాగా తెరకెక్కించారు. సినిమాలో అన్నీ ఎలిమెంట్స్ ఉన్నాయి. తప్పకుండా సినిమా అందరికీ నచ్చుతుంది అన్నారు. టేస్టీ తేజ మాట్లాడుతూ, ఫుల్ లెంగ్త్ రోల్‌లో నటించిన 6 జర్నీ నటుడిగా మంచి గుర్తింపునిస్తుంది. ఈ ప్రయాణాన్ని ఇంత సక్సెస్‌ఫుల్‌గా పూర్తి చేశామంటే కారణం బసీర్‌గారు, నిర్మాత రవిప్రకాష్‌గారు. ఏప్రిల్ 25న వస్తోన్న ఈ సినిమాను తప్పకుండా ఆదరించాలని కోరుకుంటున్నాం అన్నారు. నిర్మాత పాల్యం రవి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ, లవ్, యాక్షన్, మిస్టరీ ఇలా అన్ని ఎలిమెంట్స్‌తో 6జర్నీ మూవీని రూపొందించాం. ట్రైలర్‌కు చాలా మంచిరెస్పాన్స్ వచ్చింది. బసీర్ సినిమాను చాలా బాగా తెరకెక్కించారు. ఏప్రిల్ 25న సినిమాను గ్రాండ్ రిలీజ్ చేస్తున్నాం. మంచి చిత్రాలను ఆదరించే తెలుగు ప్రేక్షకులు మాసినిమాను సపోర్ట్ చేస్తారని నమ్ముతున్నాం అన్నారు.



# 'డియర్ ఉమ' సక్సెస్ మీట్

సుమ చిత్ర ఆర్ట్స్ బ్యానర్ మీద సుమయ రెడ్డి రచయితగా, నిర్మాతగా, హీరోయిన్‌గా నటించిన చిత్రం డియర్ ఉమ. ఈ సినిమాను సాయి రాజేష్ మహదేవ్ తెరకెక్కించాడు. రధన్ సంగీత దర్శకుడిగా, రాజ్ తోట కెమెరామెన్‌గా పని చేశారు. ఇక ఈ చిత్రం ఏప్రిల్ 18న విడుదలై మంచి ఆదరణను దక్కించుకుంది. ప్రేక్షకులు డియర్ ఉమ చిత్రానికి మంచి విజయాన్ని అందిస్తున్నారు. ఈ క్రమంలో చిత్రయూనిట్ సక్సెస్ మీట్ నిర్వహించి ప్రేక్షకులకు థాంక్స్ చెప్పింది. ఈ కార్యక్రమంలో..

సుమయ రెడ్డి మాట్లాడుతూ, డియర్ ఉమ చిత్రానికి మీడియా ఎంతగానో సపోర్ట్ చేసింది. ఈ చిత్రానికి వస్తున్న రెస్పాన్స్ చూసి నాకు ఎంతో ఆనందమేస్తుది. ఎన్నో సినిమాలు ఇంకా బయటకు రావడం లేదు. కానీ మేం మాత్రం సక్సెస్ ఫుల్‌గా సినిమాను రిలీజ్ చేశాం. అదే నాకు పెద్ద సక్సెస్. మా సినిమాకు మంచి రెస్పాన్స్ వస్తోంది. ఆడియెన్స్ మా చిత్రాన్ని ఆదరిస్తున్నారు. రాష్ట్రంలో ఉన్న మహిళలందరికీ ఈ చిత్రాన్ని అంకితం చేస్తున్నాను. మా అమ్మ, తమ్ముడు, మా టీం సహకారం వల్లే ఈ స్థాయి వరకు వచ్చాను. రధన్ గారి సంగీతం అందరినీ ఆకట్టుకుంది. హాస్పిటల్‌లోనే మన జీవితం ప్రారంభం అవుతుంది.. అక్కడే మన జీవితం ముగుస్తుంది. ఇలాంటి ఓ మంచి సబ్జెక్ట్ మీద తీసిన మా డియర్ ఉమ చిత్రాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని కోరుతున్నాను. మా సినిమాను ఆదరిస్తున్న ప్రతీ ఒక్కరికీ థాంక్స్ అని అన్నారు. దర్శకుడు సాయి రాజేష్ మహదేవ్ మాట్లాడుతూ, ప్రస్తుతం జనాలు థియేటర్లకు రావడం లేదు. కానీ మీడియా, మౌత్ టాక్ వల్లే థియేటర్లకు ఆడియెన్స్ వస్తున్నారు. మా సినిమాను ఇంతగా సపోర్ట్ చేస్తున్న మీడియాకు థాంక్స్. మా చిత్రానికి మంచి రివ్యూలు ఇచ్చిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్. తెలుగు ప్రేక్షకులు ఎప్పుడూ కూడా మంచి సినిమాను ఎంకరేజ్ చేసి సక్సెస్ చేస్తూనే ఉంటారు. మా చిత్రాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని మీడియాని, ఆడియెన్స్‌ని కోరుతున్నాను. మా చిత్రానికి పని చేసిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్ అని అన్నారు. రాజీవ్ కనకాల మాట్లాడుతూ, సుమయ రెడ్డి ఎంతో కష్టపడి డియర్ ఉమ సినిమాని చేశారు. ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా నిర్మించారు. రాజ్ తోట కెమెరా వర్క్ బాగుందని అంతా మెచ్చుకుంటున్నారు. రధన్ మ్యూజిక్‌కు ప్రశంసలు వస్తున్నాయి.



# గుర్తుండిపోయే మూవీ 'సారంగపాణి జాతకం'

ప్రముఖ నిర్మాణ సంస్థ శ్రీదేవీ మూవీస్ పతాకంపై శివలెంక కృష్ణ ప్రసాద్ నిర్మాణంలో మోహనకృష్ణ ఇంద్రగంటి తెరకెక్కించిన చిత్రం సారంగపాణి జాతకం. ప్రియదర్శి, రూపా కొడువయూర్ హీరో హీరోయిన్లుగా నటించారు. ఈ సినిమా ఏప్రిల్ 25న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా నిర్మాత శివలెంక కృష్ణ ప్రసాద్ మీడియాతో ముచ్చటించారు. ఆయన చెప్పిన విశేషాలివే..

సారంగపాణి జాతకంలో అన్ని రకాల అంశాలు ఉంటాయి. యాక్షన్, సస్పెన్స్, థ్రిల్లర్, కామెడీ, లవ్ ఇలా అన్ని రకాల అంశాలుంటాయి. ఇంద్రగంటి కథను చెప్పినప్పుడు చాలా ఎగ్జైట్ అయ్యాను. థియేటర్లో అందరూ హాయిగా నవ్వుకు నేలా ఈ చిత్రం ఉంటుంది. ఓ ఫుల్ లెంగ్త్ కామెడీ మూవీ చేయాలనే లోటు ఈ చిత్రంతో తీరిపోయింది. జంధ్యాలతో ఇలాంటి ఓ పూర్తి వినోదాత్మక సినిమా చేయలేదే? అనే లోటు ఇప్పుడు తీరిపోయింది. కొన్ని చిత్రాలు ఆడియెన్స్‌కి ఎప్పుడూ గుర్తుండిపోతాయి. అలా ఈ సారంగపాణి జాతకం చాలా కాలం పాటు గుర్తుండే చిత్రం అవుతుంది. జెంటిల్ మాన్, సమ్మోహనం తరువాత మా కాంబోలో హ్యాట్రిక్ హిట్ రాబోతోంది. మోహనకృష్ణ రాసిన కథ, కథనం ప్రతీ ఒక్కరినీ ఆకట్టుకుంటుంది. ఫ్యామిలీతో పాటుగా యూత్ ఆడియెన్స్ అందరినీ మెప్పిస్తుంది. సినిమా చాలా బాగా వచ్చింది. ఎంతో కష్టపడి ఈ చిత్రాన్ని తీశాం. సరైన థియేటర్లు దొరకాలనే ఉద్దేశంతో కాస్త లేటుగా వస్తున్నాం. మంచి సీజన్ దొరకాలనే ఇప్పటి వరకు ఆగాం. సమ్మర్ హాలీడేస్ స్టార్ట్ అయ్యాయి. ఇదే మంచి సీజన్ అనుకుని మేం ఏప్రిల్ 25న వస్తున్నాం. సమ్మర్‌లో వినోదాన్ని పంచేందుకు మా చిత్రం రాబోతోంది. సారంగపాణి జాతకం చిత్రం ఇప్పటికే చాలా మందికి చూపించాం. అందరూ అద్భుతంగా ఉందని అన్నారు.



ఫస్ట్ హాఫ్ పూర్తిగా వినోదాత్మకంగా సాగుతుంది. ఇక ద్వితీయార్థం నెక్స్ట్ లెవెల్లో ఉంటుంది. జాతకం చుట్టూ ఈ కథ తిరుగుతుంది. చాలా ఇంట్రెస్టింగ్‌గా, సస్పెన్స్‌గా ఉంటుంది. అలా అని మరీ అంత అన్ ప్రిడిక్టబుల్‌గా ఏమీ ఉండదు. అందరినీ హాయిగా ఎంటర్టైన్ చేసేలా మాత్రం ఉంటుంది. కథలో భాగంగానే కారెక్టర్లు వస్తాయి. ఏదో కావాలని ఇరికించినట్టుగా ఎక్కడా అనిపించదు. ప్రతీ పాత్రకు చాలా ఇంపార్టెన్స్ ఉంటుంది. వెన్నెల కిషోర్, వైవా హర్ష, నరేష్, అవసరాల శ్రీనివాస్ ఇలా అన్ని కారెక్టర్లు అద్భుతంగా నవ్విస్తాయి. ఈ కథ విన్నాక దర్శి అయితే బాగుంటుందని మేం అనుకున్నాం.

# రుచిర ఎంటర్‌టైన్‌మెంట్స్ 'లెవెన్'

రుచిర ఎంటర్టైన్మెంట్స్ ప్రముఖ డిస్ట్రిబ్యూటర్ ఎన్ సుధాకర్ రెడ్డి ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న బైలింగ్వల్ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ ఎలెవెన్ సినిమా థియేట్రికల్ హక్కులను సొంతం చేసుకున్నారు. నవీన్ చంద్ర హీరోగా నటించిన ఈ చిత్రం ఈ వేసవిలో అద్భుతమైన సినిమా ఎక్స్‌పీరియన్స్‌ని అందించడానికి సిద్ధంగా ఉంది. సుందర్ సి వద్ద కలకలప్పు 2, వంద రాజవతాన్ వరువేన్, యాక్షన్ వంటి చిత్రాలకు అసోసియేట్ డైరెక్టర్‌గా పనిచేసిన లోకేశ్ అజ్ల్స్ దర్శకత్వం వహించారు. ఎఆర్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై అజ్మల్ ఖాన్, రేయా హరి నిర్మించిన లెవెన్, విమర్శకుల ప్రశంసలు పొందిన సిలా నేరంగలిల్ సిలా మణిధర్గల్, సెంబి చిత్రాల విజయం తర్వాత వారి మూడవ వెంచర్. సిలా నేరంగలిల్ సిలా మణిధర్గల్‌లో నటించిన రేయా హరి, ఎలెవెన్‌లో కథానాయికగా నటించింది. ఈ చిత్రంలో అభిరామి, రవివర్మ, కిరీటి దామరాజు వంటి ప్రతిభావంతులైన తారాగణం కీలక పాత్రల్లో నటించిరు. ఈ చిత్రానికి ప్రముఖ సంగీత దర్శకుడు డి. ఇమ్మాన్ సంగీతం అందించగా, కార్తీక్ అశోకన్ సినిమాటోగ్రఫీని నిర్వహిస్తున్నారు. జాతీయ అవార్డు గ్రహీత శ్రీకాంత్ ఎన్.బి. ఎడిటర్‌గా వ్యవహరించడం, ఈ చిత్రం సాంకేతిక నైపుణ్యాన్ని మరింత పెంచుతుంది. ఈ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ వేసవిలో మే 16న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ చిత్రం వచ్చే నెలలో విడుదల కానున్నందున, నిర్మాతలు ప్రమోషన్స్ దూకుడు పెంచబోతున్నారు.



# వేసవిలో చెమటబారిన పడకుండా..

ఎండాకాలంలో బయట ఎండ, ఇంటిలోపల ఉక్కపోత సర్వసాధారణం. వేడికి ఇళ్లల్లో ఒకప్పుడు విసనకర్రలు, ఫ్యాన్లు వాడేవారు. పెంకుటిల్లు చుట్టూ చెట్లు, ఇంటికి పెరడు, వసారాలు, వాటిల్లో చెట్టు, ఇంటి ముందర వేపచెట్టు వంటివి ఉండేవి కాబట్టి అంతగా ఇబ్బందులు ఉండేవి కావు. కాని నేడు ప్రతిచోట అద్దె ఇళ్లు. అవి కూడా ఇరుకు గదులు. ఇక ఫ్యాన్లు సరిపోక కూలర్లు, ఎసిలు వాడకం ఎక్కువయింది. ఇంట్లో ఫ్యాన్లు, కూలర్లు ఉన్నప్పటికీ ఎండాకాలం చెమట సమస్య ఉండనే ఉంటుంది. దీన్ని పెద్దగా పట్టించుకోకపోతే డీహైడ్రేషన్ బారిన పడే ప్రమాదం ఉంటుంది. హార్మోన్ల స్థాయుల్లో మార్పులు, అధిక బరువు, ఆందోళన, శ్వాసకోశ, గుండె సంబంధిత సమసనయలు ఉన్నవారికి చెమట ఎక్కువగా ఉంటుంది. చెమట వల్ల శరీరంలోని మలినాలు, వ్యర్థ పదార్థాలు బయటికి పోయినప్పటికీ ఎక్కువయితే మాత్రం జాగ్రత్తలు తీసుకోవాల్సిందే. కొంతమందికి చంకల్లో ఎక్కువ చెమట పడుతుంది. అలాంటి వారు కొద్దిగా కార్న్‌స్టార్చ్‌లో కాస్త బేకింగ్ సోడా, సరిపడినంత ఎసెన్షియల్ ఆయిల్ కలిపి పేస్ట్‌లా చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని చంకల్లో అప్లై చేసి అరగంట తర్వాత శుభ్రం చేసుకుంటే మంచిది. తరచూ ఇలా చేస్తుంటే మంచి ఫలితం ఉంటుంది. ఎండాకాలంట పండ్ల రసాలు తాగుతాం. కానీ ఔషధ గుణాలు పానీయాలు తాగాలంటే కొంచెం అయిష్టంగానే ఉంటుంది. అయితే చెమట సమస్య ఉన్నవారికి ఔషధాలు ఉన్న పానీయాలు బాగా ఉపయోగపడతాయి. ముఖ్యంగా గోధుమగడ్డి, టొమాటో రసం వంటి వాటిలో సి, బి6, బి12 విటమిన్లు, ఫోలికామ్లం, ఇతర ఖనిజాలు ఎక్కువ మొత్తంలో లభిస్తాయి. ఇవన్నీ శరీరం నుంచి ఎక్కువ మొత్తంలో విడుదలయ్యే చెమటను తగ్గిస్తాయి. తద్వారా శరీరం డీహైడ్రేషన్‌కు గురికాకుండా



జాగ్రత్తపడవచ్చు. వేసవిలో నీళ్లు ఎక్కువ తాగాలి. పాలకూర, కాలిఫ్లవర్ కూరగాయాలు తీసుకోవాలి. పుచ్చకాయ, ద్రాక్ష, తర్బూజా వంటి పండ్లు తీసుకోవడం తప్పనిసరి. ఇవన్నీ శరీరం నుంచి విడుదలయ్యే చెమటను తగ్గించడంతో పాటు జీవక్రియల్ని వేగవంతం చేస్తాయి. పచ్చిమిర్చి, మసాలాలు వంటి ఘాటైన పదార్థాలు శరీరంలో అధిక వేడిని పుట్టించి ఎక్కువ చెమట విడుదలయ్యేలా చేస్తాయి. కాబట్టి ఈ కాలంలో వీటిని తీసుకోవడం తగ్గించాలి. కెఫిన్ నాడీ వ్యవస్థను ప్రేరేపించి శరీరంలో అడ్రినలిన్ హార్మోన్‌ను విడుదల చేస్తుంది. తద్వారా శరీర ఉష్ణోగ్రత పెరుగుతుంది. కాబట్టి కాఫీని సాధ్యమైనంత తక్కువగా తీసుకోవడం ఉత్తమం. ఒత్తిడి, ఆందోళనలు వంటివి తగ్గించుకోవడం కూడా ముఖ్యమే. అలాగే ఈ కాలంలో శరీరానికి గాలి తగిలేలా వదులుగా ఉండే దుస్తులు, అది కూడా కాటన్ దుస్తుల్ని ధరిస్తే సౌకర్యవంతంగా ఉంటుంది. ఇలాంటి జాగ్రత్తలు తీసుకుంటే వేసవిని ఇబ్బందిగా కాకుండా ఆహ్లాదంగా ఆస్వాదించవచ్చు.

# పార్టీకి ప్రత్యేకంగా..

పుట్టినరోజులు, ఫ్రెండ్స్‌తో గెట్‌టూగెదర్..సందర్భం ఏదైనా ఆ పార్టీలో మనం అందరిలోనూ మెరిసిపోవాలని అనుకోవడం సహజమే.కానీ, అయితే, ఫ్యాషన్ నిపుణులు చెప్పే ఈ సూత్రాలు సందర్భం ఏదైనా, ఎన్ని సార్లు ధరించినా కొత్తదనం కనిపించేలా చేయడంలో బ్లాక్ అండవైట్ రంగులకు మించినవేం ఉంటాయి. అందుకే పార్టీవేర్‌గా.. మీవార్డ్‌రోబ్‌లో వీటిని తప్పక ఉంచుకోవాలి. కాలేజీ అమ్మాయిలకు లిటిల్ బ్లాక్ డ్రెస్, వైట్ జంప్‌సూట్‌లు బాగుంటాయి. వీటిమీదకు స్టేట్‌మెంట్ జ్యూయెలరీ అదిరిపోతుంది. మరీ ఆధునికంగా వేసుకోలేం అనుకుంటే బ్లాక్ అనార్కలీనో, లాంగ్ గౌన్‌నో ఎంచుకుంటే సరి. ఈ సందర్భాలకు నలుపు రంగు చీరకు నప్పుతుంది.

సీక్విన్-గ్లిట్టర్ హంగులు : ఏ తరహా రంగు దుస్తులు ఎంచుకున్నా, వాటిమీదకు చమక్కుమనే ఎంబ్రాయిడరీ, సీక్విన్ల డిజైన్ ఉంటే చాలు. ఎంతమందిలో ఉన్నా ప్రత్యేకంగా కనిపించొచ్చు.



యాక్సెసరీలు: మీ అవుట్‌ఫిట్‌ని గోల్డ్, సిల్వర్ మెటాలిక్ వెయిస్ట్ బెల్ట్, స్లింగ్ బ్యాగ్, క్లచ్‌లు మరింత అందంగా కనిపించేలా చేస్తాయి. ఇక, చెప్పుల విషయానికి వస్తే.. నలుపు, తెలుపు మాత్రమే కాదు, గ్లిట్టర్, మెటాలిక్ ఫినిషింగ్ ఉన్న ఎరుపు, గోల్డ్, న్యూడ్ కలర్ స్నీకర్స్, స్టిలెటోస్, వెడ్ రకాలు బాగుంటాయి. హైఫ్లాట్ పామ్ ఫ్లిప్‌ఫ్లాప్స్, బాలేరి యన్స్ కూడా మంచి ఎంపికే.

## ఆధ్యాత్మికం

# ధర్మం, న్యాయం



ధర్మం, న్యాయం అనేవి ఇంచుమించు ఒకే అర్థాన్ని ఇస్తాయి. ధర్మం నాలుగు పాదాలలో నడవాలి అనే మాట రామాయణంలో మనం చూస్తాం. నీకిది న్యాయమా అనే మాట మనం తరచుగా వింటూ ఉంటాం. ధర్మాన్ని కాపాడితే అదే నిన్ను కాపాడుతుంది. ఇక న్యాయం మాటకు వస్తే అన్యాయంగా ప్రవర్తించకు న్యాయంగా చెప్పు అనే మనం ఎవరికైనా చెబుతూ ఉంటాం.ఈ రెండు సమపాళ్లలో ఉండేది చాలా తక్కువ. ఒక్క శ్రీరాముని కాలంలోనే ధర్మం, న్యాయం అనేవి ఒకటి ఎక్కువ కాకుండ, మరొకటి తక్కువ కాకుండ ఉండటం చూస్తాం. అంటే శ్రీరాముని పరిపాలన అటువంటిది. శ్రీరాముడు రాజు పదవి చాలా పవిత్రమైనదిగా చూశాడు. అందుకే ధర్మం, న్యాయం చాలా సమంగా ఉండేవి. ఎక్కడా అధర్మం కాని, అన్యాయం కాని జరిగిన దాఖలాలు ఉండేవి కావు. శ్రీరాముడు తన వేగులను పిలిచి 'మీరు నలు దిక్కులకు వెళ్లి మా పాలనపై ప్రజల అభిప్రాయం, వారు ఏమనుకుంటున్నారో నిక్కచ్చిగా మాతో చెప్పండి' అని వేగులను పంపించి వేశాడు. వాళ్లు నలు దిక్కులకు వెళ్లి సమాచారం సేకరించారు. ప్రభు మీ పాలన చాలా అద్భుతం అని కొనియాడారు అని చెప్పారు. ఒక వేగు మాత్రం ప్రభు అంటూ కళ్లనీళ్లు పెట్టుకుని శ్రీరాముని పాదాలపై పడ్డాడు. శ్రీరాముడు ఆ వేగు వాలకం చూసి లేవనెత్తి 'నువ్వు విన్నది, కన్నది ఏ భయం లేకుండా చెప్పు' అన్నాడు. 'ప్రభూ! అంటూ అతను కన్నీళ్లు పెట్టుకుని ఒక చాకలి వాడు ధర్మం, న్యాయం ఎక్కడ ఉంది అంటూ ఆ వెర్రి రాముడు కనుక లంకలో ఉండిన సీతమ్మను ఏలుకున్నాడు అని బొంగురు గొంతుతో చెప్పాడు.

వెంటనే శ్రీరామునిలో మార్పు కలిగి ప్రజల అభిప్రాయం శిరసా వహించి ధర్మం, న్యాయం కోసం సీతమ్మ వారిని త్యజించాడు. నాటి పాలకులు ప్రజల అభిప్రాయాలు గౌరవించేవారు. ధర్మం, న్యాయం పాటించే వారిలో ముందు వరుసలో ఉండేది శ్రీరాముడు ఒక్కడే.

**- కనుమ ఎల్లారెడ్డి**

## అతిగా ఆలోచించవద్దు

కొంత మంది ప్రతి చిన్నవిషయాన్నీ భూతద్దంలో చూస్తూ అతిగా ఆలోచిస్తూ ఉంటారు. దీని వల్ల మానసిక ప్రశాంతత దెబ్బ తింటుంది. అనవసరమైన ఆలోచనలను దూరం చేసేందుకు నిపుణులు సూచిస్తున్న చిట్కాలు ఇవే.. మనసుకు నచ్చిన పనిచేస్తూ అందులో లీనమైతే అనవసరమైన ఆలోచనలు రావు. ఏదైనా హాబీ, సృజనాత్మక కార్యక్రమాలు, చేతి పనులు లాంటి వాటి మీదికి దృష్టి మరలిస్తే ఆందోళన అనేది ఉండదు. భయం, ఆందోళనలను మౌనంగా భరించకుండా స్నేహితులు లేదా కుటుంబ సభ్యులతో పంచుకుంటే ఒత్తిడి తగ్గి మనసు ప్రశాంతంగా అనిపిస్తుంది.

ప్రతి రోజూ ఉదయం లేదా సాయంత్రం కొద్దిసేపు ధ్యానం చేస్తూ ఉంటే భావోద్వేగాలపై నియంత్రణ పెరుగుతుంది. ఆలోచనలు నిశ్చలంగా ఉంటాయి. ప్రతికూలంగా మాట్లాడుతూ నిరుత్సాహ పరిచేవారి నుంచి దూరంగా ఉండడం మంచిది. దీని వల్ల మానసిక ఆందోళన తగ్గుతుంది.మనసులోని భావాలను కాగితం మీద రాయడం అలవాటు చేసుకుంఏట భారమైన భావోద్వేగాలు బయటికి వ్యక్తమవుతాయి. మనసు తేలిక పడుతుంది.

ప్రకృతిని ఆస్వాదిస్తూ విహారయాత్రలకు వెళ్లడం వల్ల మనసు ఉపశమనం పొందుతుంది. కొత్త ప్రదేశాలు చూసినప్పుడు కలిగే అనుభూతులు ఆనందాన్నిస్తాయి.

## చెలి చిట్కాలు

నకర్పూరం దగ్గుకు, కలరాకు బాగా పనిచేస్తుంది. ఉత్సాహం కలిగిస్తుంది. గుండెకు చైతన్యం కలిగిస్తుంది. గ్లాసు పాలల్లో గురువింద గింజంత కర్పూరం కరిగించి తాగితే గుండెకు మంచిది. దంతాల చిగుళ్లలో చీము, నొప్పి బాధలున్నవారు కర్పూరంతో పళ్లు తోముకుంటే బాధలన్నీ పోతాయి. కర్పూరం, ఆవనూనె కలిపి సూర్యరశ్మిలో వేడిచేసి కీళ్లనొప్పులున్నవారు, కండరాల నొప్పులు కలవారు, వెన్నునొప్పి, కాళ్లు సాగకపోవడం లాంటివి ఉన్నప్పుడు ఈ మిశ్రమాన్ని రాస్తే నొప్పులు తగ్గుతాయి.



# కాబేజీతో వైద్యం!

'కాళ్లు వాచాయా? మోకాళ్ల నొప్పా.. అయితే క్యాబేజీ చుట్టేయండి.. సోషల్ మీడియాలో ఈ వీడియో తెగ వైరలవుతోంది. ఈ జపనీస్ చిట్కాతో మేం నొప్పి తగ్గించుకున్నామని కొందరంటే.. క్యాబేజీకి కాస్త మయునైజ్, ఉప్పు కారం కూడా చల్లండని జోక్ చేస్తున్నవారు మరికొందరు. మరి నిపుణులేమంటున్నారు?

గంటలకొద్దీ నిల్చున్నప్పుడు పాదాలు వాయడం,కాల్షియం తగ్గాక కీళ్ల వద్ద నొప్పులు సహజమే కదూ! చిన్న చిట్కాతో వాటి నుంచి ఉపశమనం పొందొచ్చు అంటే ఎవరైనా ప్రయత్నించకుండా ఉంటారా? అందుకే ఈ 'క్యాబేజీ' చిట్కా వైరల్ అవుతోంది. దీనిలో క్యాబేజీ పొరను సమస్య ఉన్నచోట ఉంచి, వస్త్రం లేదా బ్యాండేజీతో పడిపోకుండా కడతారు.



ఈ ఆకుల్లో విటమిన్లు ఫైటో న్యూట్రియంట్లు, యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలెక్కువ. ఆకుల్ని మృదువుగా చపాతీ కర్రతో రుద్ది, కడితే ఇవన్నీ చర్మం ద్వారా శరీరంలోకి ఇంకి వాపు, నొప్పి తగ్గుతాయట. నిపుణులూ దీన్ని అంగీకరిస్తున్నారు. అయితే కట్టే ముందు వాటిని శుభ్రపరచడం మాత్రం తప్పని సరట. దీన్ని రోజులో నాలుగైదు సార్లు ప్రయత్నించొచ్చు అనీ చెబుతున్నారు. ఎప్సమ్ సాల్ట్‌ను వేడినీటిలో వేసి వాటిలో పాదాలను ఉంచినా, సమస్య ఉన్నచోట యూకలిప్టస్, పెప్పర్‌మింట్, లావెండర్ వంటి నూనెలతో మర్దన చేసినా నొప్పి, ఇన్‌ఫ్లమేషన్ తగ్గుతాయి. చల్లని లేదా వేడి నీటితో కాపడం పెట్టినా ఉపశమనం కలుగుతుంది అంటున్నారు నిపుణులు. అయితే చిట్కాలపైనే ఆధారపడక నిపుణులనీ కలవమంటున్నారు. పెద్ద సమస్య అయితే వెంటనే చికిత్స ప్రారంభించడంతోపాటు పాటించాల్సిన ఆహార నియమాలూ వ్యాయామాలనూ సూచిస్తారు అని సలహానిస్తున్నారు. అదండీ సంగతి.. మరి మీరేం చేయాలనుకుంటున్నారు?

---

# కల్యాణకట్టలో మళ్లీ డబ్బులు డిమాండ్!

## - భక్తుల పుకార్లతో క్షురకుల ఆవేదన



**తిరుమల,ఏప్రిల్ 22ప్రభాతవార్తప్రతినిధి:** ఆపదమొక్కులవాడ...అనాదరక్షకా గోవిందా అంటూ తిరుమలకు వచ్చిన భక్తులు తమ మొక్కుబడుల్లో భాగంగా కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించడం ఆనవాయితీ. ఇక్కడ కల్యాణకట్టలో తలనీలాల సమర్పణకు భక్తులు పూర్తి ఉచితం. అయితే కొందరు క్షురకులు డబ్బులు అడిగారనే విషయం మంగళవారం మధ్యాహ్నం తిరుమలలో పుకార్లు హల్‌చల్ చేశాయి. ప్రధాన కల్యాణకట్టతోబాటు 12వరకు మినీకల్యాణకట్టలు ఉన్నాయి. ఇక్కడ మహిళా క్షురకులతోబాటు పురుష క్షురకులు సేవలందిస్తున్నారు. భక్తులు తమ తలనీలాలు సమర్పణకు కౌంటర్‌ల వద్ద రశీదు తీసుకుని బ్లేడ్‌ను ఉచితంగా అందుకుంటారు. ఈ నంబర్ల ప్రకారం క్షురకులు తలనీలాలు తీస్తారు. కల్యాణకట్టలో కొందరు భక్తుల నుండి వందరూపాయలు డిమాండ్ చేశారనేది సామాజిక మాద్యమం వేదికగా ఆరోపణలు వెలుగుచూశాయి.

ఆ వీడియో చూసిన భక్తులు ఆగ్రహం వ్యక్తంచేశారు. సాదారణంగా భక్తులే కొందరు తలనీలాలు సమర్పించుకున్న తరువాత సంతోషంగా క్షురకులకు వారికి తోచిన డబ్బులు ఇస్తుంటారు. అలా కొందరు భక్తులు ఇచ్చిన దానిని అతస్యఆరోపణలు చేశారని క్షురకులు,క్షురకుల యూనియన్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. కల్యాణకట్టలో సిసికెమెరాలు పనిచేయడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. టిటిడి ఉన్నతాధికారులు వేసవి సెలవుల్లో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని చర్యలు తీసుకోవాల్సి ఉందని భక్తులు కోరు తున్నా రు. సాధారణంగా ప్రతిరోజూ 25వేల మంది నుండి 30వేలమంది వరకు భక్తులు తలనీలాలు సమర్పిస్తున్నట్లు టిటిడి సమాచారం. కొందరు క్షురకులు భక్తుల నుండి డబ్బులు డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

# లిక్కర్ స్కాంపై నేను విజిల్ బ్లోయర్‌ను: విజయసాయిరెడ్డి

**విజయవాడ,ఏప్రిల్22,ప్రభాతవార్తప్రతినిధి:** వైఎస్సార్సీపీ ప్రభుత్వంలో జరిగిన మద్యం కుంభకోణంలో తన పాత్ర విజిల్ బ్లోయర్‌లాంటిదని మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి అన్నారు. ఈ మేరకు ఎక్స్(శ్రీ)లో ఆయన పోస్ట్ చేశారు. తప్పించుకునేందుకే దొరికిన దొంగలు, దొరకని దొంగలు నా పేరుని లాగుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ అవినీతిలో ఏ రూపాయీ తాను ముట్టలేదని తెలిపారు. లిక్కర్ దొంగల దుస్తులు సగమే విప్పారని కానీ వారి మిగతా దుస్తులు విప్పేందుకు పూర్తిగా తాను సహకరిస్తానని విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. వైఎస్సార్సీపీ హయాంలో జరిగిన మద్యం కుంభకోణంలో పాత్రధారి, సూత్రధారి కెసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డేనని ఇటీవల విజయసాయిరెడ్డి చెప్పిన సంగతి తెలిసిందే.

మద్యం కుంభకోణంలో కర్త, కర్మ, క్రియ రాజ్ కెసిరెడ్డేనని దీనికి సంబంధించి చెప్పాల్సి వస్తే మరిన్ని వివరాలు భవిష్యత్తులో వెల్లడిస్తానని ఆయన చెప్పారు.

ఈ కేసులో నిన్న (సోమవారం) కెసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డిని సిట్ అధికారులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే విజయ సాయిరెడ్డి ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

# తెలుగు రాష్ట్రాల రైల్వే సీనియర్ పిఆర్ఐ కరుణాకర్ సేవలు మరువలేనివి

## రైల్వే సిపిఆర్ఒ కార్యాలయంలో సంతాప సభలో వక్తలు

**గుంతకల్లు రైల్వే,ఏప్రిల్ 22,ప్రభాతవార్త** తెలుగు రాష్ట్రాల దక్షిణ మధ్య రైల్వే సీనియర్ పబ్లిక్ రిలేషన్స్ ఇన్‌స్పెక్టర్ బి కరుణాకర్ సేవలు మరువలేనివని వక్తలు పేర్కొన్నారు. ఆయన గత సోమవారం కార్డియాక్ అరెస్టుతో గుండెపోటుకు గురైహఠాత్ మరణం గావించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మంగళవారం రైల్వే సిపిఆర్ఓ కార్యాలయంలో విషాద వదనాల మధ్య జరిగిన సంతాపసభలో పలువురు ఉన్నతాధికారులు,సహచరులు, జర్నలిస్టులు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా జరిగిన సంతాపసభలో రైల్వే ఉన్నతాధికారులు శ్రీధర్ రాకేష్,షకీల్ అహ్మద్,అనిల్ కుమార్,రాజేష్ పలువురు సహచరులు వేదనాభరత హృదయంతో మాట్లాడుతూ కరుణాకర్ గత కొన్నేళ్లుగా రైల్వే పౌర సంబంధాల విభాగానికి డిప్యూటేషన్‌పై వచ్చారని, వ్యక్తిగతంగా సౌమ్యుడు, మృదుస్వభావి అయిన కరుణాకర్ ఎల్లవేళల సహచరులతో సన్నిహితంగా ఉంటూ రైల్వే యాజమాన్యం,మీడియా మధ్య అనుసంధానకర్తగా బాధ్యతలు నిర్వహిస్తూ సమన్వయకర్తగా వ్యవహరించేవారన్నారు. ఎప్పుడు ఎలాంటి సమయంలో అయిన మీడియా ప్రతినిధుల సందేహాలను విసుగించుకోకుండ నివృత్తి చేసేవారన్నారు. కరుణాకర్ మృతి పట్ల రైల్వే పౌరసంబంధాల విభాగం సీనియర్ పబ్లిసిటీ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్,నాగరాజు,షర్మిల,నుశ్రత్,హేమంత్ పలువురు జర్నలిస్టులు,కార్మిక సంఘాల నాయకులు తదితరులు మృతుని ఆత్మకు శాంతి చేకూరాలని ఆయన కుటుంబానికి తమ ప్రగాఢ సంతాపం తెలిపారు.

# సిఎం జిల్లాలో జనాదరణ కోల్పోతున్న ఎమ్మెల్యేలు!

## - పదినెలల్లోనే కొందరి తీరుపై వ్యతిరేకత!

**తిరుపతి,ఏప్రిల్ 22ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో కూటమిప్రభుత్వం అధికారం చేపట్టి పదినెలలు కావడంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సొంత ఉమ్మడి చిత్తూరుజిల్లాలో సొంత పార్టీకి చెందిన కొందరు ఎమ్మెల్యేల తీరుపై జనంలో వ్యతిరేకత కనిపిస్తోంది. ఇప్పటికే కొందరు ఎమ్మెల్యేల జనాదరణ గ్రాఫ్ కూడా తగ్గిపోయిందని ఇటీవల టిడిపిరాష్ట్రవ్యాప్తంగా చేయించిన సర్వే నివేదికలు కూడా వెల్లడించడం విశేషం. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 13మంది టిడిపి ఎమ్మెల్యేల్లో తిరుపతి నియోజకవర్గం ఎమ్మెల్యే జనసేన పార్టీకి చెందిన వ్యక్తి. ఇక 11మంది ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లో అనుకున్న స్థాయిలో పనితీరు లేదనేది పార్టీ అధిష్టానానికి అందిన నివేదికలు. 11మంది అధికారపార్టీల ఎమ్మెల్యేల్లో ఏడుగురు వరకు ఎమ్మెల్యేల వ్యవహారం వారివారి సొంత పనులు చక్కబెట్టుకోవడం, రకరకాల వ్యాపారాలు చేసుకోవడంలో బిజీఅయ్యారనేది సమాచారం.పార్టీ నేతలకుగానీ, కార్యకర్తలకు కూడా అందుబాటులో లేరనేది నియోజకవర్గాల్లో ప్రజల నుండి వ్యక్తమవుతున్న విమర్శలు. ప్రజలనుండి ఎమ్మెల్యేల పనితీరుపై సదభిప్రాయం లేదనే వ్యాఖ్యలు ఉన్నాయి. పదినెలలపాలనకే వారి పరిస్థితి ఇలా దారుణంగా తయారైందని, రానున్న నాలుగేళ్ళు నియోజకవర్గాల్లో ఏమేరకు ప్రజలకు అందుబాటులో ఉండి మళ్ళీ ఎన్నికల్లో ఓటు అడుగుతారనేది అనుమానమే. కుప్పం నుండి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రాతినిధ్యం వహిస్తుండగా నగరి, సత్యవేడు, శ్రీకాళహస్తి, పలమనేరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, చంద్రగిరి టిడిపి ఎమ్మెల్యేలు కొనసాగుతున్నారు. తిరుపతిలో జనసేనపార్టీ ఎమ్మెల్యే. వీరిలో ఆరేడుగురు ఎమ్మెల్యేలపై సొంత పార్టీ నేతలేగాక కార్యకర్తలు చివరకు నియోజకవర్గ ప్రజల్లో కూడా ఆ స్థాయిలో వ్యతిరేకత మొదలైందంటే కారణాలను సిఎం చంద్రబాబు సర్వేలతో నివేదిక రాబట్టారు. చాలావరకు జిల్లాలో తొలిసారిగా ఎమ్మెల్యేలుగా గెలిచిన వారే ఎక్కువగా ఉన్నారు. పాలనపై పట్టు, నియోజకవర్గాల్లో జనాదరణ కలిగిఉండాల్సింది పోయి ఎమ్మెల్యేలు ఎక్కువగా రియల్ ఎస్టేట్ వ్యాపారాల్లో జోక్యం చేసుకోవడం, ఖాళీస్థలాలు పై అనుచరులతో పాగా వేయించడం, ఇసుక మద్యం వ్యాపారాలపై దృష్టి ఉంచారనేది ఫిర్యాదులు ఉన్నాయి. ఇదే సమయంలో పాలనపై పూర్తిస్థాయిలో పట్టుసాధించడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అహర్నిశలు శ్రమిస్తున్నారు. రాష్ట్రాన్ని పారిశ్రామికంగా ముందుకు తీసుకెళ్ళడం, ఉపాధి అవకాశాలు కల్పించడం, ప్రజల అవసరాలను తెలుసుకుని పరిష్కరించడం వంటివాటిపై దృష్టి పెట్టారు. సొంత పార్టీ ఎమ్మెల్యేల పనితీరుపై ఇప్పటికే నివేదికల రూపంలో అందిన సమాచారాన్ని సిఎం ప్రాతిపదికగా తీసుకుని జనంలోనే వుండాలని, జనం సమస్యలు తెలుసుకునేందుకు ప్రతి బుధవారం ప్రజాదర్బార్ పేరుతో వినతులు స్వీకరించాలని స్పష్టంగా ఆదేశించారు. జనంలోనే ఉండాలని కూడా నిర్దేశం చేశారు. అయినా సొంత జిల్లాలోనే ఎక్కువమంది ఎమ్మెల్యేల పనితీరుపై, జనాదరణ లేకపోవడంపై ఆయన ఆగ్రహం వెలిబుచ్చిన సందర్భాలు ఉన్నాయని పార్టీలో సీనియర్ నేతలు బహిరంగంగా వ్యాఖ్యానిస్తున్నారు.పనితీరు మార్చుకోకుంటే వచ్చే ఎన్నికల్లో సీట్లు కష్టమని కూడా బాబు హెచ్చరించారు. ఇప్పటికీ చాలావరకు ఎమ్మెల్యేలు చుట్టపుచూపుగా నియోజకవర్గాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటునాన్నరనేది కూడా సిఎంకు అందిన సర్వే రిపోర్టులో విస్తుబోయే అంశాలు.

మరి ఇదే నేపథ్యంలో మేనెలలో జరగనున్న పార్టీ మహానాడులో ఎమ్మెల్యేల జాతకాలు ఆధారంగా సీనియర్ నేతలకు, పార్టీని నమ్ముకుని కష్టపడుతున్న కార్యకర్తలకు పదవులు ఇచ్చేందుకు అధినేత బాబు సుముఖతగా ఉన్నట్లు పార్టీ వర్గాల సమాచారం.

పార్టీలో క్రియాశీలక పదవుల పదవీకాలం కూడా ముగిసింది. వచ్చేనెలలో మహానాడులోనే మళ్ళీ క్రియాశీలక ఎన్నికలు జరిపి పదవులు కేటాయింపు ఉంటుంది. ఎమ్మెల్యేల పనితీరు బాగోలేకుంటే ఆయా చోట్ల మాజీఎమ్మెల్యేలకు,సీనియర్ నాయకులకు పెత్తనం ఇచ్చేందుకు కూడా పార్టీ సిద్దమైందనేది విశ్లేషకుల అభిప్రాయం.

# నీటి తొట్టెల నిర్మాణాన్ని నెలాఖరులోగా పూర్తి చేస్తాం

## పిఆర్ అండ్ ఆర్డి కమిషనర్ కృష్ణతేజ



**విజయవాడ, ఏప్రిల్22, ప్రభాత వార్తప్రతినిధి:** ఉపాధి హామీ పథకంలో పశువుల కోసం చేపట్టిన 15 వేల నీటి తొట్టెల నిర్మాణాన్ని ఈ నెలాఖరులోగా పూర్తి చేస్తామని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ విఆర్ కృష్ణతేజ తెలిపారు. ఇప్పటి వరకూ 12 వేల తొట్టెల నిర్మాణాన్ని పూర్తి చేసినట్లు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒక్కో తొట్టె నిర్మాణానికి రూ.45 వేల వ్యయంతో పశు సంవర్ధకశాఖ గుర్తించి ప్రదేశాల్లో 15 వేల తొట్టెల నిర్మాణం ఉపాధి హామీ పథకంలో చేపట్టినట్లు తెలిపారు. ఒక్కో తొట్టె 3 వేల లీటర్ల పరిమాణం కలిగి ఉందన్నారు. వీటివల్ల 15 లక్షల మూగ జీవాలకు తాగునీటి వసతి కల్పిస్తున్నట్లు చెప్పారు. దీనివల్ల పాల ఉత్పత్తి పెరిగి రైతులకు ఆదాయం పెరుగుతుందని పేర్కొన్నారు. వీటి నిర్మాణాన్ని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశాల మేరకు ఈ నెల ఒకటిన ప్రారంభించినట్లు తెలిపారు. ఉపాధి పథకంలో వ్యవసాయ అనుబంధ పనుల్లో భాగంగా ఇప్పటికే మినీ గోకులాల నిర్మాణం చేపట్టినట్లు పేర్కొన్నారు.

# సివిల్స్‌కు ఎంపికైన రైల్వే రత్నం ధనుష్

## - జాతీయ స్థాయిలో 232వ ర్యాంకు



**గుంతకల్లు రైల్వే,ఏప్రిల్ 22,ప్రభాతవార్త** కేంద్ర యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ మంగళవారం విడుదల చేసిన యుపిఎస్‌సి-2024తుది పరీక్షా ఫలితాల్లో రైల్వే అధికారిణి కుమారుడు పూల ధనూష్ జాతీయ స్థాయిలో 232వ ర్యాంకు సాధించి సివిల్స్ గ్రూపు-ఎ క్యాడర్‌కు ఎంపికయ్యారు. సికింద్రాబాద్‌లోని దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ డైరెక్టర్ ఆఫ్ ఆడిట్ కార్యాలయంలో సీనియర్ డివిజనల్ ఆడిట్ అధికారిణిగా పనిచేస్తున్న జి నాగమణీ, తెలంగాణలోని ఓ ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్న పూల శ్రీనివాసులు దంపతుల కుమారుడైన ధనూష్ 1997అక్టోబరు 9న గుంతకల్లు రైల్వే ఆసుపత్రిలో జన్మించాడు. తల్లిదండ్రులు స్థానిక వివినగర్‌లో నివాసం ఉండగా తల్లి రైల్వే అధికారిణి కావడంతో సికింద్రాబాద్‌కు బదిలీపై వెళ్లారు. ధనూష్ విద్యాభ్యాసం హైదరాబాదులో జరిగింది. హైదరాబాద్ జెయన్‌టియు విశ్వవిద్యాలయం నుండి ఇసిఇ బ్రాంచిలో బిటెక్ చేసిన ధనూష్, స్వతహాగా చిన్నప్పటి నుంచి మానవత్వం, సేవాదృక్పదం గల స్వభావి, వన్యప్రాణులంటే అమితంగా ఇష్టపడే వ్యక్తిత్వం, 2021,2022లో వరుసగా యూపిఎస్‌సి ప్రిలిమ్స్‌కు ఎంపికైన,మంగళవారం యుపిఎస్‌సి విడుదల చేసిన 2023లో జరిగిన సివిల్స్ తుది పరీక్ష ఫలితాల్లో ప్రిలిమ్స్,మెయిన్స్,ఇంటర్వ్యూలలో జాతీయ స్థాయిలో 480వ ర్యాంకు సాధించి సివిల్ సర్వీసెస్ గ్రూప్-ఎ క్యాడర్‌కు ఎంపికయ్యాడు.

# వైకాంగ్రెస్ పార్టీ నేత వల్లభనేని వంశీకి రిమాండ్ పొడిగింపు

**విజయవాడ,ఏప్రిల్22,ప్రభాతవార్తప్రతినిధి:** సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులో గన్నవరం మాజీ ఎమ్మెల్యే, వైకాంగ్రెస్ పార్టీ నేత వల్లభనేని వంశీకి మళ్లీ నిరాశే ఎదురైంది. ఆయన రిమాండ్‌ను ఎస్సీ, ఎస్టీ కోర్టు మరోసారి పొడిగించింది. మే 6 వరకు వంశీ రిమాండ్‌ను పొడిగించింది.

ఈ కేసులో నేటితో ఆయన రిమాండ్ ముగుస్తుండటంతో వంశీ కస్టడీని మరోసారి పొడిగించాలంటూ పోలీసుల తరఫు న్యాయవాది కోర్టులో తమ వాదనలను బలంగా వినిపించారు. దీంతో వల్లభనేని వంశీతో పాటు మరో నలుగురు నిందితులకు ఎస్సీ, ఎస్టీ స్పెషల్ కోర్టు మే 6వ తేదీ వరకు రిమాండ్‌ను పొడిగిస్తూ తీర్పునిచ్చింది. ఈ కేసులో వంశీ రిమాండ్ ఖైదీగా విజయవాడ జిల్లా జైలు రిమాండ్‌లో ఉన్నారు.

# కోల్‌కతాకు ప్లే ఆఫ్స్ ఆశలు



**న్యూఢిల్లీ:** ఐపిఎల్-2025 ప్లేఆఫ్స్ పై కోల్‌కతా నైట్ రైడర్స్ (కెకెఆర్) భారీ అంచనాలు పెట్టుకుంది. దాదాపు అన్ని జట్ల మధ్య ప్లేఆఫ్స్ రేసు చాలా హోరాహోరీగా సాగుతోంది. ప్రతి జట్టు తమ స్థానాన్ని పదిలపరుచుకోవడానికి తీవ్రంగా ప్రయత్నిస్తోంది. ఈ నేపథ్యంలో కెకెఆర్ ఇప్పటికే 8 మ్యాచ్‌లు ఆడి అందులో 5 ఓటములు మూట గట్టుకున్నా ఇంకా ప్లే ఆఫ్ ఆశలు సజీవంగానే ఉన్నాయి. దీనికి అర్హత సాధించాలంటే మిగిలిన 6 మ్యాచ్‌లలో అద్భుతమైన ప్రదర్శన కనబర్చాలి. ఇందులో కనీసం 5 విజయాలు సాధించడంతో పాటు, తమ నెట్ రన్ రేట్‌ను కూడా మెరుగు పరచుకోవాలి. దీంతో పాటు, ఇతర జట్ల ఫలితాలు కూడా కెకెఆర్ ప్లే ఆఫ్స్ అవకాశాలను ప్రభావితం చేస్తాయి. ఇప్పటికే టోర్నమెంట్‌లో సగం మ్యాచ్‌లు ముగిసిన సంగతి తెలిసిందే. తాజా ఓటమితో

## 3 గెలుపులు 5 ఓటములు అయినా ఛాన్స్!

కోల్‌కతా ప్రస్తుతం పాయింట్ల పట్టికలో 7వ స్థానంలో ఉంది. కేకఆర్ ఇప్పటివరకు ఆడిన 8 మ్యాచ్‌లలో 3 విజయాలు, 5 ఓటములతో 6 పాయింట్లు సాధించింది. మరోవైపు గుజరాత్ టైటాన్స్ 12 పాయింట్లు సాధించి పట్టికలో అగ్రస్థానంలో కొనసాగుతుండగా, ఢిల్లీ క్యాపిటల్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, పంజాబ్ కింగ్స్, లక్నో సూపర్ జెయింట్స్ వంటి జట్లు 10 పాయింట్లతో కెకెఆర్ కంటే ముందున్నాయి. ముంబై ఇండియన్స్ కూడా 8 పాయింట్లతో కెకెఆర్ కంటే కొంచెం మెరుగైన స్థానంలో ఉంది.

రాజస్థాన్ రాయల్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్, చెన్నై సూపర్ కింగ్స్ వంటి జట్లు కూడా కెకెఆర్‌తో పోటీ పడుతున్నప్పటికీ, ఆ జట్ల స్థానాలు కూడా అంత ఆశాజనకంగా లేవు. ఈ పరిస్థితుల్లో కెకెఆర్ మిగిలినమ్యాచ్‌లలో తనసత్తాను చాటాల్సి ఉంటుంది. కోల్‌కతా ఇంకా ఆరు మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. ఈ మ్యాచ్‌లన్నీ కెకెఆర్‌కు చాలా కీలకం. ప్రతి మ్యాచ్‌లో విజయం సాధించడం ద్వారానే కోల్‌కతా ప్లేఆఫ్స్ రేసులో నిలవగలదు. ప్రత్యర్థుల బలాబలాలను బట్టి కెకెఆర్ తమ వ్యూహాలను మార్చుకోవాల్సిన అవసరం ఉంది. కోల్‌కతా ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధించాలంటే మిగిలిన ఆరు మ్యాచ్‌లలో తప్పక గెలవాల్సిందే. సాధారణంగా, ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించడానికి ఒక జట్టుకు కనీసం 16 పాయింట్లు (8 విజయాలు) అవసరం. కెకెఆర్ ఇప్పటికే 8 మ్యాచ్‌లలో 3 విజయాలు సాధించింది. ఈ ప్రకారం మిగిలిన 6 మ్యాచ్‌లలో కనీసం 5 మ్యాచ్‌లు గెలవాల్సి ఉంటుంది. ఒకవేళ కెకెఆర్ 4 మ్యాచ్‌లు గెలిస్తే, అవకాశాలు గణనీయంగా తగ్గిపోతాయి.

అయితే, కొద్దిగా అవకాశం కూడా ఉంటుంది. అది ఇతర జట్ల ఫలితాలపై ఆధారపడి ఉంటుంది. కెకెఆర్ ప్లేఆఫ్స్ అవకాశాలు కేవలం ఆ జట్టు ప్రదర్శనపై మాత్రమే ఆధారపడి ఉండవు. పాయింట్ల పట్టికలో ముందున్న ఢిల్లీ క్యాపిటల్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, పంజాబ్ కింగ్స్, లక్నో సూపర్ జెయింట్స్ వంటి జట్లు తమ మిగిలిన మ్యాచ్‌లలో ఎలా రాణిస్తాయనే దానిపై కూడా ఆధారపడి ఉంటుంది. ఈ జట్లు కొన్ని మ్యాచ్‌లలో ఓడిపోతే, కేకేఆర్‌కు ప్లేఆఫ్స్‌కు చేరుకునే అవకాశం పెరుగుతుంది. అలాగే, ముంబై ఇండియన్స్ వంటి ఇతర జట్లు కూడా తక్కువ మ్యాచ్‌లు గెలిస్తే కేకేఆర్‌కు లాభం చేకూరుతుంది. ఇవన్నీ జరిగితేనే నిస్సందేహంగా కోల్‌కతా ప్లేఆఫ్స్‌లో తమ స్థానాన్ని ఖాయం చేసుకుంటుంది..



జస్ప్రిత్ బుమ్రా



స్మృతి మంధన

# బుమ్రాకు అరుదైన గౌరవం

## క్రికెటర్ ఆఫ్ ద వరల్డ్‌కు ఎంపిక

## మహిళల్లో స్మృతికి దక్కిన అవార్డు

**న్యూఢిల్లీ:** టీమిండియా పేసు గుర్రం జస్ప్రిత్ బుమ్రాకు అరుదైన గౌరవం దక్కింది. 2024 సంవత్సరానికి గాను విజ్డెన్ మెన్స్ లీడింగ్ క్రికెటర్ ఆఫ్ ద వరల్డ్ అవార్డుకు ఎంపిక కాగా, విజ్డెన్ ఉమెన్స్ లీడింగ్ క్రికెటర్ ఆఫ్ ద వరల్డ్ అవార్డుకు భారత్ స్టార్ బ్యాటర్ స్మృతి మంధనకు లభించింది. ఇక గత ఏడాది ఫార్మాట్లకు అతీతంగా అత్యుత్తమ ప్రదర్శన కనపరచినందుకు గాను బుమ్రాకు ఈ గౌరవం దక్కింది. 2024లో బుమ్రా మూడు ఫార్మాట్లలో 86 వికెట్లు (21 మ్యాచ్‌ల్లో 13 సగటున) తీసి లీడింగ్ వికెట్ టేకర్‌గా నిలిచాడు. అంతేకాకుండా గత ఏడాది బుమ్రా టెస్టుల్లో విశేషంగా రాణించి అత్యధిక టెస్ట్ వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచాడు. ఫలితంగా అతను ఐసిసి క్రికెటర్ ఆఫ్ ద ఇయర్, ఐసిసి టెస్ట్ క్రికెటర్ ఆఫ్ ద ఇయర్, బిసిసిఐ మెన్స్ క్రికెటర్ ఆఫ్ ద ఇయర్ అవార్డులు గెలుచుకున్నాడు. అలాగే గత ఏడాది టీ20 వరల్డ్ కప్‌లో అద్భుతంగా రాణించిన బుమ్రా భారత్‌కు టైటిల్‌ను అందించడంలో ప్రధాన పాత్ర పోషించాడు. ఈ మెగా టోర్నీలో బుమ్రా ప్లేయర్ ఆఫ్ ద టోర్నమెంట్ అవార్డుతో పాటు, రెండు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డులను గెలుచుకున్నాడు. తాజాగా విజ్డెన్ మెన్స్ లీడింగ్ క్రికెటర్ ఆఫ్ ద వరల్డ్ అవార్డు గెలవడంతో బుమ్రా భారత్ దిగ్గజ క్రికెటర్ల సరసన చేరాడు. గతంలో విరాట్ కోహ్లి, వీరేంద్ర సెహ్వాగ్, సచిన్ టెండూల్కర్ మాత్రమే ఈ అవార్డును గెలుచుకున్నారు. వీరిలో కోహ్లి అత్యధికంగా 3 సార్లు ఈ అవార్డును గెలుచుకోగా, సెహ్వాగ్ 2, సచిన్ ఓసారి ఈ అవార్డుకు ఎంపికయ్యారు. కాగా 2024 సంవత్సరానికి గాను విజ్డెన్ ఉమెన్స్ లీడింగ్ క్రికెటర్ ఆఫ్ ద వరల్డ్ అవార్డును భారత్ స్టార్ స్మృతి మందాన దక్కించుకుంది. స్మృతి గత ఏడాది మూడు ఫార్మాట్లలో విశేషంగా రాణించి రికార్డు స్థాయిలో 1,659 పరుగులు చేసింది. మహిళల క్రికెట్‌లో ఓ క్యాలెండర్ ఇయర్‌లో ఇన్ని పరుగులు ఎవరూ చేయలేదు. గత ఏడాది స్మృతి నాలుగు వన్డే శతకాలు, ఓ టెస్ట్ సెంచరీ సాధించింది.

# ఇండియా బ్యాడ్మింటన్ టీముకు..

# సాత్విక్-చిరాగ్ జోడీ దూరం



**న్యూఢిల్లీ:** ప్రతిష్టాత్మక సుదిర్మన్ కప్ ఫైనల్స్ టోర్నమెంట్ ముంగిట ఇండియా బ్యాడ్మింటన్ టీముకు షాక్ తగిలింది. భారత్ డబుల్స్ టాప్ జోడీ సాత్విక్ సాయిరాజ్- చిరాగ్ శెట్టి అనారోగ్యం కారణంగా ఈ మెగా టోర్నీ నుంచి తప్పుకున్నట్లు బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (బాయ్) ప్రకటించింది. ఈ నెల 27 నుంచి మే 4 వరకు చైనా లోని షియామెన్లో జరగనున్న ఈ మిక్స్డ్ టీమ్ ఛాంపియన్‌షిప్ ఇండియా అవకాశాలకు ఇది పెద్ద ఎదురుదెబ్బగా మారింది. అయితే సాత్విక్- చిరాగ్ స్థానంలో జట్టులో ఎవ్వరినీ చేర్చలేదని బాయ్ తెలిపింది. దాంతో హరిహరణ్-రూబన్ కుమార్ జోడీ మెన్స్ డబుల్స్‌లో ప్రాతినిధ్యం వహించనుంది. కాగా, గాయాల కారణంగా ఇప్పటికే విమెన్స్ జంట పుల్లెలగాయత్రి-ట్రీసా జాలీ ఈ టోర్నీకి దూరంగా ఉంటోంది. ఓవరాల్ వరల్డ్ ర్యాంక్‌తో ఈ టోర్నీకి క్వాలిఫైఅయిన ఇండియా కఠినమైన గ్రూప్-డిలో మాజీ చాంపియన్ ఇండోనేసియా, రెండు సార్లు రన్నరప్ డెన్మార్క్, బలమైన ఇంగ్లండ్‌తో బరిలోకి దిగనుంది.

# మొక్కుబడిగా పాకిస్థాన్ సూపర్ లీగ్

## చెప్పుకోదగ్గ ప్రదర్శనే కరువు



**న్యూఢిల్లీ:** భారత్‌లో ప్రస్తుతం జరుగుతున్న ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపిఎల్)కు పోటీగా దాయాది పాక్ తమ దేశంలో నిర్వహిస్తున్న పాకిస్థాన్ సూపర్ లీగ్ (పిఎస్ఎల్) మొక్కుబడిగా సాగుతోంది. ఈ లీగ్‌లో ఇప్పటి వరకూ చెప్పుకో దగ్గ ఒక్క మ్యాచ్ ప్రదర్శన కూడా లేకపోవడం విశేషం. ఆటగాళ్ల మెరుపులు, విధ్వంశాలు లేకుండానే దాయాది లీగ్ చప్పగా జరుగుతోంది. లీగ్ సీజన్‌లో ఊహించని దృశ్యాలు కనిపిస్తున్నాయి. ఒకప్పుడు క్రికెట్‌ను ప్రాణంగా ప్రేమించే పాకిస్థాన్ అభిమానులు ఇప్పుడు స్టేడియాలకు రావడం లేదు. పేషావర్ జల్మీ, కరాచీ కింగ్స్ మధ్య జరిగిన 11వ మ్యాచ్‌కు కరాచీలోని నేషనల్ స్టేడియం పూర్తిగా ఖాళీగా దర్శనమిచ్చింది. మైదానంలో అభిమానుల కంటే భద్రతా సిబ్బంది ఎక్కువగా ఉండటం గమనార్హం. పాకిస్థాన్ క్రికెట్ అభిమానులు క్రీడకు దూరమవుతున్నారా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ నెల 11న మొదలైన పిఎస్ఎల్ ఇప్పటికి 11 మ్యాచ్‌లు పూర్తయ్యాయి. ఇందులో కేవలం ఒకే ఒక మ్యాచ్ ఒకింత ఆసక్తికరంగా సాగింది. ఈ నెల 12న జరిగిన సీజన్ మూడో మ్యాచ్‌లో ముల్తాన్ సుల్తాన నిర్దేశించిన 235 పరుగుల భారీ లక్ష్యాన్ని కరాచీ కింగ్స్ ఛేదించింది. ఈ మ్యాచ్‌లో ఇరు జట్ల ఆటగాళ్లు మహ్మద్ రిజ్వాన్, జేమ్స్ విన్స్ ఇద్దరూ తలో సెంచరీ నమోదు చేశారు. ఈనెల 14న జరిగిన సీజన్ ఐదో మ్యాచ్ కూడా కాస్త ఫర్వాలేదనిపించినప్పటికీ ఆ మ్యాచ్ పూర్తిగా ఏకపక్షంగా సాగింది. ఆ మ్యాచ్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ ఇస్లామాబాద్ యునైటెడ్ ఓపెనర్ సాహిబ్జాదా ఫర్హాన్ సూపర్ సెంచరీతో మెరిశాడు. అనంతరం పెషావర్ జల్మీ 244 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదిస్తూ 141పరుగలకే కుప్పకూలింది. ఈ రెండు మినహా మిగిలిన 8 మ్యాచ్‌లను చూసేందుకు అభిమానులు సైతం కరువయ్యారు.

# రాజస్థాన్ రాయల్స్‌పై ఫిక్సింగ్ ఆరోపణలు



**న్యూఢిల్లీ:** ఐపిఎల్ 2025 సీజన్‌లో మ్యాచ్ ఫిక్సింగ్ కలకలం రేపుతోంది. రాజస్థాన్ రాయల్స్, లక్నో సూపర్ జెయింట్స్ జట్ల మధ్య ఈ నెల 19న జరిగిన జరిగిన మ్యాచ్‌లో ఆర్ఆర్ 2 పరుగుల తేడాతో ఓడిపోయింది. కాగా ఈ మ్యాచ్ ఫిక్సైంది అంటూ ఆరోపణలు వస్తున్నాయి. రాజస్థాన్ ఫిక్సింగ్‌కు పాల్పడిందని రాజస్థాన్ క్రికెట్ అసోసియేషన్ (ఆర్‌సిఎ) తాత్కాలిక కన్వీనర్ జైదీప్ బిహాని ఆరోపించారు. విజయం ఖాయమనుకున్న మ్యాచ్‌లో ఆర్ఆర్ ఎలా ఓడిపోయిందంటూ ప్రశ్నించారు. వెంటనే విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆర్‌సిఎకు రాజస్థాన్ రాయల్స్ మేనేజ్‌మెంట్ విలువ ఇవ్వడం లేదని ఆరోపించారు. రాజస్థాన్ క్రికెట్ అసోసియేషన్‌లో రాష్ట్ర ప్రభుత్వం అడ్‌హాక్ కమిటీని ఏర్పాటు చేసిందని, ఈ కమిటీని ఐదోసారి పొడిగించారన్నారు. ఆర్‌సిఎ ఆధ్వర్యంలో జరిగే అన్ని మ్యాచ్‌లు ఎలాంటి సమస్యలు లేకుండా నిర్వహిస్తున్నాం. అయితే ఐపిఎల్‌కు వచ్చే సరికి జిల్లా పరిషత్ బాధ్యతలు తీసుకుంటుందని, ఐపిఎల్ నిర్వహణ కోసం ఆర్‌సిఎకు మాత్రమే బిసిసిఐ లేఖ పంపించిందన్నారు. కానీ సవాయి మాన్సింగ్ స్టేడియం నుంచి మాకు ఎంఒయూ లేదని రాజస్థాన్ రాయల్స్ మేనేజ్‌మెంట్ చెబుతోంది. ఎంఒయూ లేకపోతేనేం ప్రతీ మ్యాచ్‌కు జిల్లా పరిషత్‌కు రెంట్ చెల్లిస్తున్నారు కదా అని జైదీప్ ప్రశ్నించారు.

## వాణిజ్యం

# అమెజాన్, వాల్‌మార్ట్ కోసం భారత్‌పై అమెరికా ఒత్తిడి!



**వాషింగ్టన్, ఏప్రిల్ 22:** దేశీయంగా దాదాపు 125 బిలియన్ డాలర్ల ఈకామర్స్ మార్కెట్లో తమ సంస్థల పట్టు పెంచేందుకు భారత్ పై అమెరికా ఒత్తిడి తెస్తోంది. ఈ విషయాన్ని ఫైనాన్షియల్ టైమ్స్ పత్రిక ఓ కథనంలో పేర్కొంది. న్యూఢిల్లీపై దాదాపు 26శాతం సుంకాలు విధించిన నేపథ్యంలో సమస్యల పరిష్కారం కోసం జరుగుతున్న ఈ చర్చల్లో ఇ-కామర్స్ అంశం కూడా వచ్చింది. భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం కోసం విస్తృతస్థాయిలో జరుగుతున్న సదస్సుల్లో ఇ-కామర్స్ రంగంలోని అన్ని సంస్థలకు సమాన అవకాశాలు, పరిస్థితులు కల్పించే అంశంపై చర్చ జరిగింది. తాజాగా భారత్ పర్యటనలో ఉన్న అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ కూడా ఈ చర్చలపై స్పందిస్తూ, ఇరుపక్షాల ప్రయోజనాలను కాపాడేలా చెప్పుకోదగ్గ పురోగతి సాధించాం. ఇంధన, రక్షణ, వ్యూహాత్మక టెక్నాలజీల రంగంలో సహకారాన్ని బలోపేతం చేసు కొంటాం అని పేర్కొన్నారు. వాల్‌మార్ట్ అధినేత మెక్‌మిలన్ కొన్నాళ్ల క్రితం అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో భేటీ అయ్యారు. ఆ సందర్భంగా భారత్‌లో ఇ-కామర్స్ కంపెనీ లకు ప్రభుత్వం విధించిన నిబంధనలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. భారత్‌లో ఫ్లిప్‌కార్ట్ యాజమాన్యం వాల్‌మార్ట్ చేతిలో ఉన్న విషయం తెలి సిందే. భారత్‌లో ఫ్రైస్‌ఓపెన్ విధానం అమలు చేయాలని ఒత్తిడి చేస్తోంది. దీంతో పాటు అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ సంస్థలు దేశీయ రిటైల్ దిగ్గజమైన రిలయన్స్‌తో పోటీపడాలని బలంగా భావిస్తున్నారు. భారత్ లో విదేశీ ఇ-కామర్స్ సంస్థలు కేవలం ఇతరులు తయారు చేసిన వస్తువులను కస్టమర్లకు విక్రయించడా నికే వినియోగించాలన్న నిబంధన ఉంది. అదే భారత్‌కు చెందిన కంపెనీలు తయారుచేసిన వస్తువులు సొంత ప్లాట్‌ఫామ్‌ల్లో విక్రయించుకొనే అవకాశం ఉంది. దీనిని టారీఫేతర అడ్డంకిగా అమెరికా ఆరోపిస్తోంది. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల్లో పరిమితిని కూడా ఇలానేపోలుస్తుంది. 2006 నుంచి భారత్ దేశీయ మార్కెట్లను తమ కంపెనీలకు తెరిపించేందుకు అమెరికా ప్రయత్నిస్తోంది. కానీ, దీనికి తీవ్ర ప్రతిఘటనను ఎదు ర్కొంటోంది. ఇక దీనికితోడు భారత్‌లోని విదేశీ ఇ- కామర్స్ వేదికలు తరచూ బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ తనిఖీలకు లక్ష్యంగా మారుతున్నాయని ఆయా కంపెనీలు చెబుతున్నాయి.

# మైనర్లకు ఆర్‌బిఐ గుడ్‌న్యూస్..



**ముంబై, ఏప్రిల్ 22:** రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా దేశంలోని అన్ని బ్యాంకులకు ఒక ముఖ్యమైన ఆర్డర్ జారీ చేసింది. దీంతో ఇప్పుడు 10 సంవత్సరాలు, అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న పిల్లలు సొంతంగా సేవింగ్స్ అకౌంట్ అండ్ ఫిక్స్డ్ డిపాజిట్‌ను ఓపెన్ చేయవచ్చు అలాగే అతను/ఆమె తల్లిదండ్రులు లేదా సంరక్షకుడి సహాయం లేకుండానే అకౌంట్ స్వయంగా మెయింటేన్ చేయవచ్చు. ఇంతకుముందు పిల్లలకి ఇలాంటి అకౌంట్ తెరవడానికి తల్లిదండ్రులు, చట్టపరమైన సంరక్షకుడు అవసరం, కానీ ఇప్పుడు 10 సంవత్సరాల వయస్సు తర్వాత సొంతంగా బ్యాంకుల్లో అకౌంట్ ఇంకా ఎఫ్డిలు తీసుకోవచ్చు. దీనికి సంబంధించి అన్ని వాణిజ్య బ్యాంకులు అలాగే సహకార బ్యాంకులకు ఒక సర్క్యులర్ జారీ చేయడం ద్వారా ఆర్‌బిఐ ఈ సమాచారాన్ని అందించింది. ఏ వయసు వారైనా తల్లిదండ్రులు లేదా సంరక్షకుల ద్వారా అకౌంట్ తెరవవచ్చని, కానీ 10 సంవత్సరాల కంటే ఎక్కువ వయస్సు ఉంటే వాళ్లే స్వయంగా అకౌంట్ ఓపెన్ చేయవచ్చని అందులో పేర్కొంది. అంతేకాదు అతను/ఆమె తల్లిని సంరక్షకురాలిగా చేయడం ద్వారా కూడా అకౌంట్ తెరవవచ్చు. పిల్లల వయస్సు 10 సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ ఉంటే అతను/ఆమె సొంతంగా సేవింగ్స్ ఇంకా టర్మ్ డిపాజిట్ అకౌంట్ ఓపెన్ చేయవచ్చు, నిర్వహించవచ్చు. ..అలాగే పిల్లలు ఎంత డబ్బు జమ చేయాలో, ఎంత వరకు విత్ డ్రా చేసుకోవచ్చో బ్యాంకులు నిర్ణయిస్తాయి. ఇదంతా బ్యాంకు రిస్క్ మేనేజ్‌మెంట్ విధానంపై ఆధారపడి ఉంటుంది. ఈ మైనర్లకు 18 సంవత్సరాలు నిండిన తరువాత బ్యాంకు మళ్ళీ అతను/ఆమె నుండి కొత్తగా సంతకం అండ్ అకౌంట్ మెయింటెనెన్స్ పద్ధతిని తీసుకుంటుంది. పిల్లలకు ఇంటర్నెట్ బ్యాంకింగ్, తిగిలీ/డెబిట్ కార్డ్, చెక్ బుక్ వంటి సౌకర్యాలు ఇవ్వాలా వద్దా అనేది బ్యాంకులు సొంతంగా నిర్ణయించుకోవచ్చు.

# మహీంద్రా ఆటోకు కొత్త చీఫ్



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 22:** మహీంద్రా ఆటో తన కొత్త అధ్యక్షుడిగా ఆర్ వేలుసామిని నియమిస్తున్నట్లు ప్రకటిం చింది. ప్రస్తుతం ఆటోమోటివ్ టెక్నాలజీ అండ్ ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ అధ్యక్షుడిగా ఉన్న వేలుసామి, వీజయ్ నక్రా స్థానంలో తన కొత్త పదవిని చేపడతారు. 1996లో మహీంద్రా అండ్ మహీంద్రాలో చేరిన వేలుసామి, వివిధ స్థాయిలలో కీలక పదవులను చేపట్టారు. ఐసిఇ వాహ నాలు, ఎలక్ట్రిక్ వాహనాల తయారీలో కూడా ఆయన ప్రధాన పాత్ర పోషిం చారు. మహీంద్రా ఆటో అధ్యక్షుడిగా వేలుసామి లాభ, నష్టాలు, డెలివరీతో సహా కంపెనీ ఆటోమో టివ్ కార్యకలాపాలకు పూర్తి బాధ్యత ఉంటుంది. వ్యవసాయ పరికరాల రంగానికి ప్రస్తుత అధ్యక్షుడు హేమంత్ సిక్కాను దాని బోర్డు మహీంద్రా లాజి స్టిక్స్ లిమిటెడ్ మేనే జింగ్ డైరెక్టర్ అండ్ సిఇఒగా నియమించింది. మునుపటి సిఇఒ రామ్ స్వామినాథన్ పదవీ విరమణ చేసి కొత్త వృత్తిపరమైన అవకాశాలను అన్వేషిస్తున్నారు.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.